


మళ్లీ అవే తప్పులతో..
ఏం లాభం?
సవరణలు లేకుండా కొత్త పాస్‌పుస్తకాల ముద్రణ

- రీ సర్వే జరిగినచోట పుస్తకాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- పాత తప్పులు సరిచేయకుండానే పంపిణీకి సిద్ధం
- గత వైసీపీ ప్రభుత్వ విధానాలే ఇప్పుడూ కొనసాగింపు
- భూ విస్తీర్ణాల్లో తేడాలు సవరించకుండా ప్రింటింగ్
- జిల్లా అధికారులకు పట్టని రైతుల గోడు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు సలిమడుగు కొండారెడ్డి. తర్లుపాడు మండలం కారుమానుపల్లికి చెందిన రైతు. ఇతనికి వారసత్వంగా సర్వే నెంబర్ 17/10లో 4.12 ఎకరాలు వచ్చింది. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ గ్రామంలో రీసర్వే జరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పాస్‌పుస్తకంలో 2.80 ఎకరాలు మాత్రమే భూ హక్కులు ఉన్నట్లు పొందుపర్చారు. మిగిలిన 1.32 ఎకరాలు మాయమైంది. దీనిపై ఎన్నిసార్లు రెవెన్యూ అధికారుల చుట్టు తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు.



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు భోగెం లక్ష్మయ్య. మార్కాపురం మండలం శివరామపురం గ్రామానికి చెందిన ఈయనకు ఇళ్లను ఆనుకుని 0.28 సెంట్ల విలువైన భూమి ఉంది. ఈ గ్రామంలో రీసర్వే చేసిన అనంతరం ఆయనకు ఇచ్చిన పాస్‌పుస్తకంలో సుమారు 7 సెంట్ల మేర విస్తీర్ణం తగ్గించి 0.21 సెంట్లు ఉన్నట్లు ఇచ్చారు.

కొండారెడ్డి, లక్ష్మయ్య లాంటి వేలాదిమంది రైతులు జిల్లాలో ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. బాధితులు మండల కార్యాలయాలు, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. పాత లెక్కలతోనే కొత్త పుస్తకాలు ఇస్తున్నారని తెలిసి అందరూ నిరుత్సాహానికి గురవుతున్నారు.



మార్కాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల తర్వాత గ్రామాల్లో భూములు సర్వే చేస్తున్న ఘనత తమదేనని గత వైసీపీ ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించింది. భూయజమానులతో సంబంధం లేకుండా డ్రోన్‌ల ద్వారా సర్వే చేసింది. అంతేకాక ప్రచార ఆర్భాటంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫొటోను ముద్రించి పాస్ పుస్తకాలు పంపిణీ చేసింది. ఈ ప్రక్రియ కోసం రూ.వందలాది కోట్లు తగలేశారు. సరే ఈ కార్యక్రమం ఏమైనా ప్రజలకు ప్రయోజనం చేకూర్చిందా అంటే అదీ లేదు. ప్రయోజనానికి బదులు లేనిపోని సమస్యలను రైతుల నెత్తిన రుద్దారు. విస్తీర్ణంలో తేడాలు, సర్వే నెంబర్‌ల బదులు ఎల్‌పీ నెంబర్ల వల్ల రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులు, పేర్లు, ఆధార్ నెంబర్‌లు, ఫొటోలు ఇలా అన్నిరకాలైన తప్పులతో భూయజమానులు తీవ్ర అవస్థలు పడేలా చేసింది. ఎన్నికలకు ముందు తప్పులతడకగా మారిన రీసర్వేను మళ్లీ పునఃసమీక్షించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు చేస్తామని కూటమి నాయకులు ప్రజలకు భరోసా ఇచ్చారు.

తప్పుల సవరణతోనే మేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నేటికీ రీసర్వే సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపలేకపోయింది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు రీసర్వే జరిగిన గ్రామాల్లో సభలు నిర్వహించి అధికారులు అర్జీలు స్వీకరించారు. కానీ తప్పుల సవరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలావుంటే రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ప్రభుత్వం రాజముద్రతో నూతన పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే మండల కేంద్రాలకు పాస్ పుస్తకాలు చేరాయి. ఆ పాస్ పుస్తకాలు చూసిన రెవెన్యూ అధికారులు అవాక్కయ్యారు. గత

మిగతా 6లో...



పొగాకు మార్కెట్లో కదలిక

- కిలో రూ.297 పలికిన గరిష్ఠ ధర
- ఆందోళనకరంగా నోబిడ్‌లు

ఒంగోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో కాస్తంత కదలిక వచ్చింది. శుక్రవారం పలు కేంద్రాల్లో గరిష్ఠ ధరలు కిలో రూ.290పైనే లభించాయి. గరిష్ఠంగా ఎస్‌ఎల్‌ఎస్ రీజియన్ పరిధిలోని కందుకూరు-2 వేలంకేంద్రంలో కిలో రూ.297 అత్యధిక ధర పలికింది. పొగాకు మార్కెట్ ప్రారంభం నుంచి గరిష్ఠ ధర కిలో రూ.280కి అటుఇటుగా కొనసాగుతున్నాయి. వారం క్రితం వరకు అదే పరిస్థితి. పలు కంపెనీల బయ్యర్లు వేలం కేంద్రాల్లో మేలురకం బేళ్ల కోసం పోటీపడుతున్నా ధరలు మాత్రం పెరగలేదు. వ్యాపారులంతా కూటమి కట్టి గరిష్ఠ ధరలపై సీలింగ్ పెట్టి కిలో రూ.280 లేదా రూ.281 మాత్రమే ఇస్తూ వస్తున్నారు. అయితే రెండు, మూడు రోజులుగా పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. క్రమంగా ధరలు పెరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం గరిష్ఠ ధర కిలో రూ.282 పలుకగా గురువారం రూ.287 పలికింది. శుక్రవారం మరో పది రూపాయలు పెరిగి రూ.297 లభించింది. ఇప్పటి వరకు దక్షిణాదిలో సుమారు 91 మిలియన్

మిగతా 6లో...

సామూహిక వ్రతాలు

త్రిపురాంతకం శ్రీ బాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యనిర్వహణ అధికారి, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది ఈ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారు. -త్రిపురాంతకం,(ఆంధ్రజ్యోతి)



బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌పై ఉక్కుపాదం మోపాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థుల బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌పై ఉక్కుపాదం మోపాలని పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల విద్యాధికారులు, క్లస్టర్ హెచ్‌ఎంలతో నిర్వహించిన వెబెక్స్‌లో ఆయన మాట్లాడుతూ ఏదైనా పాఠశాలలో విద్యార్థులను బోగస్‌గా నమోదు చేసి ఉంటే అందుకు సం బంధిత పాఠశాల హెచ్‌ఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలు రాయని విద్యార్థులను బోగస్ ఎన్‌రోల్‌మెంట్‌గా గుర్తించాలన్నారు. మండల విద్యాధికారులు, క్లస్టర్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను తనిఖీచేసి విద్యార్థుల నమోదును ప్రక్షాళన చేసి బోగస్ నమోదును తొలగించాలన్నారు. విద్యార్థులు అసెస్‌మెంట్ బుక్‌లెట్లలో రాసిన ఎఫ్ఏ1 పరీక్షల జవాబు మూల్యాంకనం ఈనెల 25 నాటికి పూర్తి చేసి మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

మారకుంటే వేటే!

- పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటా
- ఇదేవిధంగా కొనసాగితే ప్రభుత్వానికి సరెండర్
- వైద్యశాఖ తీరుపై కలెక్టర్ మండిపాటు



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పద్ధతి మార్చుకొని పనిచేయకపోతే అధికారులను ప్రభుత్వానికి సరెండర్

మిగతా 6లో...

మనీ యాప్‌తో మోసం

- స్కామ్‌లో చిక్కుకున్న దోర్నాల బాధితులు
- తెలిసినవారు చెప్పడంతో నమ్మామంటున్న వైనం
- న్యాయం చేయాలని పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు



ఎస్సై మహేశ్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు

పెద్దదోర్నాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, పోలీసు అధికారులు సైబర్ నేరాల పట్ల పదేపదే అవగాహన కల్పిస్తున్నా ప్రజలకు చెవికెక్కడం లేదు. ఆశకు పోయి తెలిసినా కొందరి మాయ మాటలకు మోసపోతున్నారు. కూడబెట్టుకున్న కష్టార్జితాన్ని పొగొట్టుకుని నెత్తినోరు కొట్టుకుంటున్నారు. ఆ కోవలోకి వచ్చిందే హంజ్ యాప్ స్కామ్. దోర్నాలలో పెద్ద సైబర్ దోపిడీ గురువారం వెలుగులోకి వచ్చింది. పదుల సంఖ్యల్లో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలను తెలుసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ మహేష్ చెప్పారు. ఈ సైబర్ దోపిడీలో అధికశాతం మంది ముస్లింలే బాధితులు. వారిలో మధ్యతరగతి వారితోపాటు ఉద్యోగులు, ఉన్నత వర్గాల వారు ఉన్నారు. దోర్నాలలో సుమారు ఐదారు కోట్ల వరకు స్కాం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు.

బుట్టలోకి దించిందిలా....

దోర్నాలకు చెందిన షేక్ మస్తాన్‌వలి, ఆయన భార్య హుమేరా హంజ్ సంస్థ చాలా గొప్పదని ఇతర రాష్ట్రాల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ఆ సంస్థకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నామని నమ్మబలికారు. 2025 జూన్ 24న బొగ్గరపు కల్యాణ మండపంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి బహు మతులు కూడా ఇచ్చారని బాధితులు తెలిపారు. దీంతో బంధువులు, స్నేహితులు పెద్దఎత్తున సభ్యత్వం పొందారు. మొదట్లో అందరికీ ఎంతో కొంత డబ్బులు అకౌంటులో పడుతుండడంతో నమ్మారు. అసలు ఈ యాప్‌లో సభ్యత్వం పొందిన వారు ఎంతమందిని ఎక్కువ చేర్పించగలిగితే అంత పెద్ద మొత్తంలో కమీషన్ రూపంలో సొమ్ము నేరుగా అకౌంటులో పడిపోతాయని, త్వరితగతిన లక్షాధికారులు కావచ్చని చెప్పారు. ఈయాప్‌లో రూ.2100, రూ.5,500, రూ.16,500, రూ.49,000, రూ.1,50,000, రూ.5,00,000, రూ.10,00,000 ఇలా తొమ్మిది స్థాయిలు కేటాయించారు. చెల్లించే సొమ్ము ప్రకారం వారికి కమీషన్ శాతం వస్తుందని నమ్మబలికారు. దీంతో అందరూ తమ సమీప బంధువులు, స్నేహితులతో సభ్యత్వం చేయించారు. ఎక్కువశాతం మంది రూ.16,500లు తమ అకౌంటు నుంచి స్కానర్ ద్వారా చెల్లించారు. అంతా వాట్సాప్ ద్వారానే మెస్సేజ్‌లు ద్వారానే సమాచారమిస్తారు. బుధవారం రోజు ఒక మెస్సేజ్ వచ్చింది. ఈ ఒక్క రోజు ఎంత ఎక్కువ మొత్తం చెల్లిస్తే వెంటనే డబుల్ అకౌంటులో జమ అవుతుందని సారంశం. దీంతో చాలామంది అప్పు చేసి, బంగారం కుదువ పెట్టి డబ్బులు అకౌంటుకు బదిలీ చేశారు. అంతే గురువారం అకౌంట్లు పరిశీలిస్తే అంతకు ముందున్న డబ్బులు కూడా పోయి, మైనస్ కనబడుతోంది. పైగా హోల్డులోకి వెళ్లాయి. దీంతో

మిగతా 6లో...

ఎర్రెర్రగా..

ఒంగోలులో సీపీఐ మహాసభలకు సర్వం సిద్ధం

- నేడు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు రాజా, నారాయణ
- రేపు, ఎల్లుండి ప్రతినిధుల సభలు
- రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చ
- ఉత్సాహంగా సాగుతున్న కళా ప్రదర్శన



ప్రజా కళా ఉత్సవాల్లో చిందేస్తున్న గోరటి వెంకన్న



ఫ్లెక్సీలతో ఎర్రబారిన ఒంగోలు

ఒంగోలు వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్రమహాసభలకు ఆ పార్టీశ్రేణులు, ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి సంస్థాగతంగా సీపీఐ గ్రామస్థాయి నుంచి అఖిలభారత స్థాయి వరకు మహాసభలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహాసభలు పూర్తికాగా ఈనెల 23 నుంచి 25 వతేదీ వరకు రాష్ట్రమహాసభలు జరగనున్నాయి.

ఒంగోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మూడ్రోజులుపాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాభలకు నగరం ముస్తాబైంది. మూడేళ్లు రాష్ట్రంలో ఆ పార్టీ నిర్వహించిన కార్యక్రమాల సమీక్ష, రాష్ట్రంలో, దేశంలో ప్రస్తుత రాజకీయపరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించి వచ్చేమూడేళ్లు చేపట్టనున్న భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. రానున్న మూడేళ్ల పాటు పార్టీని నడిపించే నూతన నాయకత్వ ఎన్నిక కూడా ఈ మహాసభల్లో జరగనుంది. సీపీఐ

మిగతా 6లో...

ప్రజాకళలతోనే సమాజ మార్పు

మీడియా సమావేశంలో గాయకులు గోరటి వెంకన్న

7



ధైర్యం.. త్యాగంతో ప్రకాశం..!

- అపర భగీరథుడు 'టంగుటూరి' 153వ జయంతి నేడు
- ఆంధ్రుల ఆవేశం.. ఆత్మవిశ్వాసానికి ప్రతీక 'పంతులు'

7

గుప్తనిధుల కోసం తవ్వకాలు

నందనవనం కొండపై నెలరోజులుగా రెక్కీ వేసిన ముఠా

7

మనీ యాప్‌తో మోసం

(5వపేజీ తరువాయి)

నెత్తి నోరు బాదుకున్నారు. షేక్ మస్తాన్‌వలి, భార్య హుమేరా గురించి ఆరా తీయగా అందుబాటులో లేరని బాధితుల వాపోతున్నారు. బ్యాంకుల్లో అడిగితే మాకు తెలియదని, ఏదో కంపెనీకి వెళ్లినట్లు చూపుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

తెలిసిన వారని నమ్మి మోసపోయా

-షేక్ మహబూబ్ బాష, దోర్నాల, బాధితుడు

మస్తాన్‌వలి, హుమేరా తెలిసిన వారు కావడంతో నా భార్య వంటి మీద నగలు కుదువపెట్టి రూ.33వేలు చెల్లించాను. 3నెలల్లో రెండుసార్లు రూ.8వేల చొప్పున నాకు అకౌంటులో జమయ్యాయి. అంతటితో ఆగకుండా భర్త లేని నా చెల్లెలుకు ఉపకరిస్తాయని భావించి రూ.16వేలు కట్టాను. అన్నీ పోయాయి.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-ఎస్సై వీ మహేశ్

తాము మోసపోయామని తమ అకౌంట్లనీ హోల్డయ్యాయని బాధితులు పోలీసుస్టేషనులో గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేశ్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మారకుంటే వేటే..!

(5వపేజీ తరువాయి)

చేసేందుకు కూడా వెనుకాడేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. పైస్థాయిలో పట్టించుకునేవారు లేరు... క్షేత్ర స్థాయిలో పనిచేసే వారు లేరనట్లుగా వైద్యశాఖ తీరు ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వైద్యారోగ్యశాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పైవిధంగా స్పందించారు. వైద్యశాఖ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జిల్లాకు చెడ్డ పేరు వస్తుంటే మీకు ఎలా ఉందని ప్రశ్నించారు. ఉన్నతస్థాయిలో ఉన్న అధికారి క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షించకుండా ఏం చేస్తున్నారని మండిపడ్డారు. డెలివరి, సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, జ్వరాల కేసులపై మండిపడ్డారు. అవసరమైన మందులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉంచడంతో పాటు ప్రైవేటు ఆస్పత్రులలో వైరల్ జ్వరాల కేసుల నమోదైతే ఆ వివరాలను కూడా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వైరల్ జ్వరాలను గుర్తించడంలో క్షేత్రస్థాయిలో ఆశాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గాడిలో పడుతున్నాయని, సెకండరీ లెవల్ ఆస్పత్రుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ పరిధిలోని ఆస్పత్రులపై దృష్టిసారిస్తున్నారా లేదా? అని ప్రశ్నించారు. కనీసం సమీక్షా సమావేశాలకు వస్తున్నప్పుడు కూడా నివేదికలు సమగ్రంగా తయారు చేసుకొని రాలేరా? అని డీసీహెచ్ఎస్ శ్రీనివాసనాయక్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. గతనెలలో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలను సంక్షేమశాఖ మంత్రి స్వామితో కలిసి తాను తనిఖీ చేసినప్పుడు చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కనీసం తనకు నివేదిక పంపించాలని చెప్పిన కూడా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. చెప్పిన పని కూడా చేయలేరా అంటూ మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రామచంద్రరావుపై మండిపడ్డారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాణిక్యరావు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో పాదయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇస్కాన్ పాదయాత్ర బృందం శుక్రవారం మార్కాపురం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జవహర్‌నగర్ కాలనీలోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి మహా హరినామ సంకీర్తన చేస్తూ ప్రధాన వీధుల్లో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం వరకు చేరుకున్న తర్వాత అక్కడ మహాహారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఇస్కాన్ ఆల్ ఇండియా పాదయాత్ర అధ్యక్షుడు స్వామీజీ శ్రీమాన్ ఆచార్య ప్రభూజీ ప్రవచనం ఇచ్చారు.

చెంచు కుటుంబానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో పరామర్శ

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని శాంతి నగర్ గిరిజన గూడెంలో నివాసం ఉంటున్న పులిచెర్ల చిన్న దేవయ్య అనే వ్యక్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి గూడెంలోని మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. వారితో మాట్లాడి మృతుని మట్టి ఖర్చుల కోసం రూ. 5వేల రూపాయలను ఆయన వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట వైద్యులు కోటానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంద ఉపన్యాసాల కన్నా ఒక్క పాట శక్తివంతమైంది

ప్రజా కళాకారులు దేశంలోని రుగ్మతలపై సాంస్కృతికోద్యమం నిర్వహించాలి : సీపీఐ రామకృష్ణ

హాజరైన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఏపూరి సోమన్న

ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వంద ఉపన్యాసాల కన్నా ప్రజా కళాకారుని ఒక పాట ఎంతో శక్తివంతమైనదని, ప్రజలను చైతన్యపరుస్తూ దూసుకుపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. సీపీఐ వందేళ్ల పండుగను పురస్కరించుకుని ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్న సభలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రామకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశం నేడు క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. అటువంటి పరిస్థితుల్లోనూ డాక్టర్ అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగం గొప్ప స్ఫూర్తితో నిలుస్తోందన్నారు. బీజేపీపై వామపక్ష పార్టీలు సాగిస్తున్న పోరాటంలో ప్రజా కళాకారులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. ఈ సందర్భంగా సినీ దర్శకులు బాబ్జీ మాట్లాడుతూ తాము ఇంత గొప్ప స్థాయిలో ఉండటానికి ప్రజా నాట్యమండలినే కారణమన్నారు. ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, ఏపూరి సోమన్న ఆట, పాట, మాట ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, కార్యదర్శులు చిన్నం పెంచలయ్య నాగరాజు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో నేటికీ కొనసాగుతున్న అంటరానితనం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమాజంలో అంటరానితనం నేటికీ కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలు ఆవరణలో జరుగుతున్న మూడో పుస్తక ప్రదర్శన కేంద్రాన్ని శుక్రవారం రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై దేవరాజు మహారాజు రచించిన హిందూత్వం సింహాసనంపై అబద్దాల చక్రవర్తి అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంకా కులం, మతం అనే పేరుతో విభజన రేఖ ఉందన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం త్వరలో మనం జపాన్‌ని అధిగమిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర పబ్లిక్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి రచించిన వాడు-నేను అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విజయవాడ పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు కే లక్ష్మయ్య, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

నల్లమలలో ఏం జరుగుతోంది?

చెక్‌పోస్టు దాటి తవ్వకాలకు ఎలా వెళ్లారనేది ప్రశ్న

మూడు రోజులుగా మూడు వాహనాలతో పనులు

అసలు సూత్రధారులు ఎవరు

ఉద్యోగులు, నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యంలో అసలు ఏమి జరుగుతుందో తెలియన పరిస్థితిలో ఫారెస్టు అధికారులు ఉన్నారా? అంటే నిజమే అన్నట్లు ఉంది. ఎర్రగొండపాలెం మండంలోని గంజివారిపల్లి రెంజ్ పరిధిలోని చెన్నుపల్లి గూడెం సమీపంలోని విరుడుగుంట ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు అక్కడికి వెళ్లి ఎక్స్‌కవేటర్, జీపు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రాంతంలోకి వారు ఎలా వెళ్ళారు.., ఎన్ని రోజులుగా తవ్వకాలు చేస్తున్నారు.., దానికి గల సూత్రధారులు ఏవరు అనేది విచారణలో తెలియాల్సి ఉంది.

చెక్ పోస్టులు దాటి ఏలా వెళ్లారు

గంజివారిపల్లి రెంజ్ పరిధిలో నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్ళాలంటే గాంధీనగర్ గూడెం వద్ద ఫారెస్టు అధికారులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఏ వాహనం వెళ్ళాలన్న, రావాలన్నా ఈ చెక్ పోస్టు దాటి వెళ్ళాల్సిందే. మరి ఈ రెండు (మూడు వాహనాలు అని ప్రచారం) వాహనాలు ఏలా వెళ్ళాయి... ఏవరు పంపించారు అనేది ప్రశ్నగా ఉండగా ఇందులో ఫారెస్టు అధికారుల హస్తం కూడా ఉందా అనేది అనుమానంగా ఉంది.

మూడు రోజులుగా తవ్వకాలు

అయితే ఈ ప్రాంతంలో మూడు రోజులుగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మూడు రోజులుగా తవ్వకాలు జరుగుతుంటే ఫారెస్టు అధికారులకు తెలియకుండా ఉందా, కనిపించ లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.


ఫారెస్టు కార్యాలయంలో ఉన్న వాహనాలు (ఫైల్)


తవ్వకాలు చేసిన ప్రాంతంలో మట్టి గుంతలు(ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగుల హస్తం

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాలకు సంబంధించి ఎర్రగొండపాలెం మండలంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల హస్తం ఉందని జోరుగా మండలం వ్యాప్తంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దానికి గల కారణం తవ్వకాలకు వినియోగించిన వాహనంలో ఓ వాహనం ప్రభుత్వ ఉద్యోగిదని సమాచారం. అంతే కాకుండా ప్రజాప్రతినిధులు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌కవేటరుకు డీజిల్ కొట్టించే సమయంలో ఓ నాయకున్ని పలువురు చూసినట్టు తెలుస్తోంది. అత్యాస కోసం ఇటు ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు ఇలాంటి పురాతన దేవాలయాల్లో తవ్వకాలు చేస్తుంటే ఇంక వాటిని కాపాడేదేవరంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇద్దరు నిందితులు దొరికితే వాహనాలు ఎవరివో..దానికి సుత్రధారులు ఎవరో అధికారులు తెలసుకోలేక పోతున్నారా అంటూ ప్రజలు గుసగుసలాడున్నారు. దీనిపై రేంజర్ ప్రసన్న జ్యోతి, ఎఫ్ఎస్ఓ కరిముల్లాలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఏది ఏమైనా దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే చాల విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.

ఏం లాభం?

(5వపేజీ తరువాయి)

ప్రభుత్వంలో జగన్ బొమ్మతో ఇచ్చిన పాస్ పుస్తకాల్లోని విస్తీర్ణాలతోనే నూతన పాస్ పుస్తకాలు తయారు చేశారు. సమస్యలకు పరిష్కారం చూపకపోగా ఏదో పుస్తకాలు అందజేసి చేతులు దులుపుకొందాం అన్నచందంగా ప్రభుత్వం, రెవెన్యూ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది.

మండల కేంద్రాలకు చేరిన పాస్ పుస్తకాలు

జిల్లాలోని మూడు డివిజన్‌ల పరిధిలోగల 193 గ్రామాలకు 72,057 రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. తొలుత ఆగస్టు 15 నుంచి గ్రామాల్లోని రైతులకు పంపిణీ చేయాలని తలిచారు. ఒక కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని రెవెన్యూ ఉన్నతాధికారులు యోచించడంతో ప్రస్తుతానికి గ్రామస్థాయిలో పంపిణీని ఆపారు. మండల కేంద్రాలకు కూడా ఇప్పటికే ఐదు పర్యాయాలకుపైగా విడతల వారీగా పాస్ పుస్తకాలను పంపారు. వాటిని ఇంకా సచివాలయాలకు చేర్చలేదు.

అలాగైతే భూయజమానులకు అవస్థలే

రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నెంబర్ల బదులుగా ఎల్‌పీ నెంబర్లు కేటాయించారు. ఇక్కడే అసలైన సమస్య నెలకొంది. గతంలో ఒక సర్వే నెంబర్‌కు సబ్ డివిజన్‌లు ఉండగా వాటన్నింటినీ కుదించి జాయింట్ ఎల్‌పీలు కేటాయించారు. దీంతో ఆ సర్వే నెంబర్‌లో ఉన్న పలువురిలో ఎవరు భూమి అమ్ముకోవాలన్నా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అందరి పేర్లూ వస్తున్నాయి. ఎవరూ భూములు అమ్ముకోలేని దుస్థితి. వెబ్‌ల్యాండ్‌లో 1బీ, అడంగళ్లు రాకపోవడంతో భూములను తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోలేని పరిస్థితి. అప్పటి పాస్‌పుస్తకాల్లో పేర్లు, ఆధార్ నెంబర్లు, ఫోన్ నెంబర్లు తదితరాలు కూడా తప్పులు దొర్లాయి. వీటికి సంబంధించి రైతులు చెప్పులరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎలాంటి పరిష్కారం లభించ లేదు. ప్రస్తుతం వాటిని పరిష్కరించకుండా కొత్త పాస్ పుస్తకాలు ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు.

వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాలనే పొందుపర్చారు

గత ప్రభుత్వంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో అప్పటి ముఖ్యమంత్రి ఫొటోతో భూయజమానులకు నూతన పాస్‌పుస్తకాలు ఇచ్చారు. వాటి స్థానే రాజముద్రతో మళ్లీ పాస్ పుస్తకాలు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాలతో కూడిన నూతన పాస్ పుస్తకాలను ముద్రించారు. ఇప్పటికే జిల్లాకు 72వేల పాస్ పుస్తకాలు వచ్చాయి. వాటిలో కొన్ని మినహా దాదాపు అన్ని మండలాలకు పంపించాం. ప్రభుత్వం ఆదేశించిన వెంటనే పంపిణీ చేస్తాం

- ఓబులేసు, డీఆర్‌వో, ఒంగోలు

ఎర్రెర్రగా..

(5వపేజీ తరువాయి)

ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి మహాసభలకు అధిక ప్రాధాన్యత ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో ఘన కీర్తి

ఉమ్మడి జిల్లాలో సీపీఐకి గతంలో ఘన కీర్తి ఉంది. ప్రస్తుతం దీనికోసం ఆరాటపడుతున్నప్పటికీ జాతియోద్యమ కాలం నుంచే ఉమ్మడి జిల్లా పరిధిలో కమ్యూనిస్టు ప్రభావం అధికంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాల్లో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి బీజం పడింది. 1937లో కొత్తపట్నంలో జరిగిన రాజకీయ పాఠశాల కాగా ఆ పాఠశాల ఒంగోలు ప్రాంతంలో ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు భావాజాలంతో ఉన్నవారి సహకారంతోనే జరిగింది. అనంతర కాలంలో కూడా ఉమ్మడి జిల్లాలో సాగు, తాగు, నీరు, భూసమస్యల పరిష్కారం, అంటరానితనం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, రైతులు, వ్యవసాయ కార్మికుల పక్షాన నాటి కమ్యూనిస్టు నేతలు ముందుండి పోరాడారు. ఒకప్పుడు జిల్లాలోని వివిధ శాసనసభ స్థానాల నుంచి కమ్యూనిస్టు నేతలు ప్రాతినిధ్యం వహించారు. నాటి నందికొండ (నాగార్జునసాగర్) ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న వెలిగొండ ప్రాజెక్టు వరకు సీపీఐ నాయకత్వాన చేపట్టిన పోరాటాల ఫలితం అన్నది నేటి తరానికి అవగాహన లేకపోయినా చరిత్రలో గుర్తించగల అంశాలు. అలాంటి వారస్వం ఉన్న పార్టీ నేడు బలహీన పడి ఉనికి కోసం ఆరాటపడే స్థితికి చేరింది.

నగరంలో తొలిసారి మహాసభలు

నాటిపోరాట చరిత్రకు కేంద్రంగా ఉన్న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు తొలిసారి జరుగుతున్నాయి. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, వామపక్ష, అభ్యుదయ వాదులందరూ ఆప్యాయంగా 'అన్న' అంటూ పిలుచుకునే నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) ఆధ్యక్షుడుగా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో మహాసభల నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నగరం ఎరుపుమయం

నగరంలోని ప్రధాన వీధులు, కూడళ్లలో సీపీఐ జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, తోరణాలు, మహాసభలకు వచ్చే అగ్రనాయకులకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా సీపీఐ మహసభల ప్రచారంలో భాగంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము అవరణలో ఉత్సాహంగా ప్రజా కళా ఉత్సవాలు సాగుతున్నాయి. మహాసభల తొలిరోజైన శనివారం నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు బస్టాండు సెంటర్ నుంచి అద్దంకి బస్టాండు సమీపంలోని కూరగాయాల మార్కెట్ మైదాన ప్రాంగణం వరకు భారీ ర్యాలీ జరుగుతుంది. అనంతరం అక్కడ బహిరంగసభ నిర్వహిస్తారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలిరానున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొనున్నారు. ఆది, సోమవారాల్లో నగర సమీపంలోని ఎస్‌వీజీఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరగనుంది. గత పక్షం రోజులుగా జిల్లా సీపీఐ నాయకత్వంతో కలిసి ఆ పార్టీరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జి.ఈశ్వరయ్య నేతృత్వంలో పలువురు యువజన, విద్యార్థిసంఘాల రాష్ట్ర నాయకులు మహసభ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పొగాకు మార్కెట్లో కదలిక

(5వపేజీ తరువాయి)

కిలోలు అమ్మకాలు జరగ్గా మేలు రకం అత్యధిక భాగం కొనుగోళ్లు పూర్తయినట్లు సమాచారం. దీంతో ఆ బేళ్ల కోసం పోటీపడుతున్న వ్యాపారులు ప్రస్తుతం సీలింగ్ బ్రేక్ చేసి కాస్తంత ధరలు పెంచారు. ఫలితంగా రెండు రోజులుగా మార్కెట్లో ధరలు పెరుగుదల కనిపిస్తుంది. శుక్రవారం వేలం పరిశీలిస్తే కందుకూరు-2 లో గరిష్ఠ ధర కిలో రూ.297 లభించగా కందుకూరు-1లో రూ.295, ఒంగోలు-1, -2, కొండపి, వెల్లంపల్లి కేంద్రాల్లో రూ. 294, డీసీపల్లిలో రూ.290 పలికింది. అయితే గరిష్ఠ ధరలు కొంతమేర అయినా పెరగడం, రైతులకు కొంత ఊరట కలిగిస్తోంది. నోబిడ్ బేళ్ల సంఖ్య తగ్గకపోవడం మాత్రం ఆందోళన కరంగానే ఉంది. శుక్రవారం మార్కెట్లో సగటున 32శాతం వరకు బేళ్లు తిరస్కరణలు జరిగాయి. అత్యధికంగా కనిగిరి కేంద్రంలో 46.55 శాతం నోబిడ్ అయ్యాయి. ఒంగోలు-1 కేంద్రంలో 40.31శాతం కాగా, టంగుటూరులో 36.90శాతం, పొదిలిలో 33శాతం, కందుకూరు -2లో కూడా 31శాతం బేళ్లు నోబిడ్‌లు అయ్యాయి. లోగ్రేడ్ ధరను కిలో రూ.139కి తగ్గించినా నోబిడ్‌లు భారీగానే ఉండటంపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

గిరిజనుడిపై దాడి చేసిన వైసీపీ నేత

అవీఇవీ

బాధితుడిని పరామర్శించిన ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్


చికిత్స పొందుతున్న ఎర్రన్నను పరామర్శిస్తున్నదారునాయక్

కంభం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశాడన్న కారణంతో దాసరి చిన్న ఎర్రన్న అనే గిరిజనుడిపై వైసీపీకి చెందిన ఎక్కడి బాదరయ్య ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన గురువారం రాత్రి అర్ధవీడు మండలం బొమ్మిలింగం చెంచు కాలనీలో జరిగింది. అర్ధవీడు పోలీసుల కథనం ప్రకారం బొమ్మిలింగం చెంచు కాలనీకి చెందిన దాసరి చిన్న ఎర్రన్న తెలుగుదేశం పార్టీ అభిమాని కాగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బాదరయ్య చెంచు కాలనీకి వెళ్లి వైసీపీకి ఓటు వేయండని బెదిరించాడు. అయితే కాలనీలోని దాసరి ఎర్రన్నతోపాటు పలువురు చెంచులు టీడీపీ అభ్యర్థికి ఓటు వేశారు. దీనిని మనసులో పెట్టుకున్న బాదరయ్య గురువారం రాత్రి దాసరి చిన్న ఎర్రన్నపై ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక తాను వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన ఎర్రన్నను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరచారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

ఎర్రన్నను పరామర్శించిన ఎస్టీసెల్ ర్రాష్ట అధ్యక్షుడు

చెంచు కాలనీకి చెందిన దాసరి చిన్న ఎర్రన్నపై వైసీపీ నాయకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని, ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఎర్రన్నను పరామర్శించారు. అనంతరం దారు నాయక్ మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన ఎర్రన్నపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వైసీపీ నాయకుడు బాదరయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అర్ధవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావులతో పొంచి ఉన్న ప్రమాదాలు

పలు గ్రామాలలో వినియోగంలో లేని పురాతన నేలబావులు

సీసీ రోడ్లు వేయటంతో రోడ్డు అంచు కొచ్చిన వాటితో ప్రజలు బెంబేలు


కూకట్లపల్లి గ్రామంలో రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న నేలబావి

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలంలో ప్రజల దాహార్తి తీర్చిన నేల బావులు ఇప్పుడు పాడుపడిపోయి ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గ్రామాలలో చిన్నారులు, వాహన చోదకులు రాత్రుళ్ల రోడ్ల వెంబడి వెళుతుంటే ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్నిసార్లు బావులు అక్కడ ఉన్నాయన్న సంగతి కూడా మరిచి పోతున్నామని అంటున్నారు. మండలంలోని గొర్రెపాడు గ్రామ సెంటర్‌లో రోడ్డు పక్కనే ఉన్న పురాతన బావితోపాటు చుట్టూ చిల్లచెట్లతో నిండి ఉంది. ఆ బావితో ప్రజలు ప్రతి రోజూ భయాందోళన చెందుతున్నారు. పశువులు, చిన్నారులు అటు వైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. అలానే కూకట్లపల్లి గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డు అంచునే పురాతన బావి రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ బావుల్లో నీరు కూడా లేదు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న పురాతన బావులను పూడ్చి వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బడి బయటఉన్న విద్యార్థులను స్కూలులో చేర్పించాలి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు చొరవ చూపాలి

బాపట్ల జిల్లా డీఈవో యస్.పురుషోత్తం


పర్చూరులో మాట్లాడుతున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

పర్చూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి యస్. పురుషోత్తం చెప్పారు. దీంతోపాటు డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థులను కూడా వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఈనెల 25వ తేదీలోపు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. శుక్రవారం చీరాల డివిజన్ పరిధిలో ప్రధానోపాధ్యాయుల సమావేశం స్థానిక రోటరీ భవనంలో జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఎఫ్-ఏ 1 మార్కులు 25వ తేదీలోపు నమోదు చేయాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ప్రతి తరగతికి ఒకటి చొప్పున (6 నుంచి10వ తరగతులు) 31వలోపు పూర్తిచేయాలని చెప్పారు బెస్ట్ టీచర్ అవార్డుకు నామినేషన్‌లు 24లోపు పంపించాలన్నారు. విధిగా ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గంగాధర్, ఎంఈవో శివకోటేశ్వరరావు, పి.వెంకట్రామయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచు గూడాలలో నీటి సమస్యకు పరిష్కారం


చేతి పంపునకు మరమ్మతులు చేసి పరిశీలిస్తున్న సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి గిరిజన గూడెంలో మరియు పందివానిపల్లి లో చెంచు కుటుంబాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ వారు శుక్రవారం సమస్యను పరిష్కారం చూపారు. ఆయా గూడాలలో నీటి ఎద్దడి విషయం తెలుసుకున్న సంస్థ ఎర్రగొండపాలెం కో ఆర్డినేటర్ డి వెంకట్రావు అధికారులు, నాయకులు దృష్టికి తీసుకెళ్ళారు. వారి సహాయ సహకారాలతో ఆ రెండు ప్రాంతాలలో నీటి సరఫరా చేసి నీటి సమస్యను తీర్చినట్లు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్‌లు డి సుబ్బారెడ్డి, అరుణా బాయ్, పంచాయితీ కార్యదర్శి రామ సుబ్బయ్య, మరియు సంస్థ సిబ్బంది బి కామ్లానాయక్, డి బాల లక్ష్మీ బాయ్, ఆయా గ్రామాల విటిడిఏ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోరటి వెంకన్న

ప్రజాకళలతోనే సమాజ మార్పు సాధ్యం

మీడియా సమావేశంలో గాయకులు గోరటి వెంకన్న

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : అక్షరాన్ని నిషేధిస్తే ఆగదని, ప్రజాకళలతోనే సమాజ మార్పు సాధ్యమని ప్రజాకవి, రచయిత, గాయకులు గోరటి వెంకన్న చెప్పారు. సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కళా ఉత్సవాలలో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం ఒంగోలు విచ్చేశారు. స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళలు, సాంకేతికత, పెట్టుబడి ఇవి మూడు కలవకూడదన్నారు. కళ అనేది అంతర్లీనంగా ఉంటూ ప్రజలను ఆలోచింపచేసేలా, ఆనందింప చేసేలాఉండాలన్నారు. నేటి సినిమాలు బూతు సాహిత్యంతో నిండుకొని, ఇవే అసలైన కళలు అనే తీరుగా భ్రమింపచేస్తున్నాయని విమర్శించారు. సినిమా చాలా గొప్పదని, అదే సినీరంగంలో తమన్, బోస్, సత్యజిత్‌రే, హృతిక్ ఘటక్ వంటి గొప్ప కళాకారులు, దర్శకులు కూడా ఉన్నారని చెప్పారు. నేటి తరంలోని కొన్ని సినిమాలు వికృతం, భయానకం, రాచరికంతో కూడిన హింసా సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయన్నారు. నిజమైన కళకు, మంచి పుస్తకానికి, ఆలోచింపచేసే రచనలకు ఎల్లపుడూ ఆదరణ ఉంటుందని వెంకన్న తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ సీపీఐ 100ఏళ్ల పోరాట చరిత్రను పురస్కరించుకుని ఒంగోలులో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభల సందర్భంగా కళా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 23వ తేదీన భారీ ప్రజా ప్రదర్శనలో బహిరంగ సభకు వెయ్యి మంది కళాకారులతో, 100 గొంతుకలతో, వంద పాటలతో, వంద డప్పులతో, వంద కోలాట కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణతోపాటు పలువురు ముఖ్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామకృష్ణ, పాట వెంకన్న, శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

నేటిలోపు అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ఒంగోలు విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని 2025 సంవత్సరానికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు అర్హులు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులుచేసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ రంగ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు పట్ల ఆసక్తి ఉన్న టీచర్లు, ప్రధానోపాధ్యాయులు తమ దరఖాస్తులను మండల విద్యాధికారులకు అందజేయాలని వివరించారు. వాటిని పరిశీలించి ఈనెల 25వతేదీ నాటికి సంబంధిత ఉప విద్యాధికారులకు అందజేయాలని తెలిపారు. ఉప విద్యాధికారులు వాటిని మరోమారు పరిశీలించి ఈనెల 27న డీఈవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కనీసం 15 ఏళ్ల బోధన అనుభవం కలిగి ఎటువంటి అభియోగాలు, క్రమశిక్షణ చర్యలకు గురికాని టీచర్లు అర్హులని తెలిపారు. సెప్టెంబరు 5 జరిగే గురుపూజోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేస్తారని వివరించారు.

రేపు సాఫ్ట్‌బాల్ మహిళా జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అడ్‌హక్ కమిటీ నియమించినట్లు అసోసియేషన్ ప్రతినిధి రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నరసింహారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ పి.రామ్‌ప్రసాద్‌లను అడ్‌హక్ కమిటీగా నియమించారు. ఈమేరకు నూతన కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణి ఇంజనీరింగ్ కాలేజీలో 12వ సీనియర్స్ మహిళ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు రమేష్‌బాబు తెలిపారు. ఒరిజినల్ ఆధార్ కార్డు, రెండుపాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని, వివరాలకు9398479248 నంబరు ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఆపరేషన్ కోసం దాచిన నగదు చోరీ

ఒంగోలు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కోసం తెచ్చుకుని దాచుకున్న డబ్బులను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ సంఘటన ఒంగోలు నగరంలోని బత్తులవారికుంటలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... ఓ ప్రైవేటు మార్కెటింగ్ కంపెనీలో పనిచేస్తున్న ఈర్ల సురేష్ తన తల్లి రత్నకుమారి మోకాలు ఆపరేషన్ కోసం ఈనెల 20న ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. 21వ తేదీ ఉదయం సురేష్ ఆయన తండ్రితో పాటు ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. రాత్రికి తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపు తాళం పగులకొట్టి లోపల బీరువా పెకలించి ఉంది. అందులో ఉన్న రూ.50 వేలు నగదు, హుండీలో ఉన్న రూ.10 వేలు మొత్తం రూ.60 వేలను దొంగలు అపహరించుకెళ్లారు. ఈ మేరకు ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపికైన కానిస్టేబుల్స్ సర్టిఫికెట్ల పరిశీలన

349 మందికి గాను 327 మంది హాజరు

ఒంగోలు క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుళ్లగా ఎంపికైన వారి నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ నేతృత్వంలో వాటిని పరిశీలించారు. మొత్తం 349 మంది హాజరు కావాల్సి ఉండగా 327 మంది హాజరయ్యారు. కానిస్టేబుళ్లగా ఎంపికైన వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలిచారు. వారి వద్ద నుంచి మూడు సెట్‌లు జిరాక్స్‌లు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో ఏవో పీఈ విజయకుమార్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో శుక్రవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వీటి పరిష్కారంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, విద్యాశాఖ, సీపీడీసీఎల్, మునిసిపల్, రిజిస్ట్రేషన్, దేవదాయ తదితరశాఖలకు సంబంధించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. అర్జీలు తిరిగి రీఓపెన్‌కాకుండా సంబంధిత అధికారులు కరెక్టు ఎండార్స్‌మెంట్ ఇచ్చారా లేదా అనేది ఆడిట్ టీం కచ్చితంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు 47,200 అర్జీలను పరిష్కరించగా 42,487 అర్జీలను అడిట్ చేశామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 16,834 అర్జీలను పరిష్కరించగా 16,796 అర్జీలు ఆడిట్ చేయగా, రీ సర్వేకు సంబంధించి 8,624 అర్జీలు పరిష్కరించగా 8,609 అర్జీలు ఆడిట్ చేయించామని పీజీఆర్ఎస్ నోడల్ అధికారి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషు, వివిధ శాఖల అధికారులు గౌస్‌బాషా, పానకాలంరావు, డాక్టర్ శ్రీనివాసనాయక్ తదితరులు ఉన్నారు.

ధైర్యం.. త్యాగంతో ప్రకాశం..!



స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో బ్రిటీష్ తుపాకికీ ఎదురు నిలిచి గుండె చూపిన ధైర్యశాలి.. ధనికుల ఇళ్లల్లో వారాలు గడుపుతూ చదివి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మహోన్నతుడు... అకుంఠిత ధైర్యసాహసాలకు, అసమాన త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు పేరువినగానే ముందుగా గుర్తొచ్చేది ప్రకాశం జిల్లా, రెండోది ప్రకాశం బ్యారేజి.! ఉమ్మడి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం జిల్లా వాసిగా చెప్పుకోవడం జిల్లా ప్రజలందరికీ గర్వకారణం. ఆయన కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిన ఘనత తెలుగోళ్లది. శనివారం తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం. ప్రకాశం పంతులు జయంతి వేడుకలను అధికారపూర్వకంగా జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

అపర భగీరథుడు 'టంగుటూరి' 153వ జయంతి నేడు

ఆంధ్రుల ఆవేశం.. ఆత్మవిశ్వాసానికి ప్రతీక ప్రకాశం పంతులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలోని వినోదరాయునిపాలెంలో సుబ్బమ్మ, గోపాలకృష్ణయ్య దంపతులకు ఆగస్టు 23న 1872లో ప్రకాశం పంతులు జన్మించారు. ఆరుగురు సంతానంలో ప్రకాశం ఒకరు కాగా, 11ఏళ్లకే తండ్రి మరణించడంతో తల్లి సుబ్బమ్మ పూటకూళ్ల ఇళ్లు నడుపుతూ బిడ్డలను సాకింది. ఈయన కూడా వారాలకు కుదిరి రోజుకో ఇంట్లో అన్నం తింటూ గడిపిన టంగుటూరి ప్రకాశం బాల్యమంతా ఒంగోలు, అద్దంకి, నాయుడుపేట ప్రాంతాల్లోనే గడిచింది. రాజమండి ఆర్ట్స్ కళాశాలలో పట్టభద్రుడయ్యాక ఆయన దృష్టి స్వాంతంత్ర్య ఉద్యమం వైపు మళ్లింది. 1928లో ముంబయి చేరుకున్న సైమన్ కమిషన్‌పై ఉద్యమించిన టంగుటూరి 'ఆంధ్రకేసరి'గా గుర్తింపు పొందారు. ఉమ్మడి మదారసు నుంచి మన రాష్ట్రం విడిపోయాక కర్నూలు రాజధానిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. దీనికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టంగుటూరి ప్రకాశం.. బెజవాడ కేంద్రంగా కీలక రాజకీయాన్ని నెరిపి అక్కడ నుంచే పాలన కొనసాగించారు.

● జిల్లాతో అనుబంధం

అప్పటి గుంటూరు జిల్లాలోని టంగుటూరు ప్రకాశం పంతులు వారి కుటుంబం వంశపారపర్యంగా గ్రామ కరణం వృత్తిలో ఉండేది. ప్రకాశం పంతులు ముత్తాత టంగుటూరులో కరణీకం చేస్తూ ఉండేవారు. ఆయనకు అప్పాస్వామి, నరసరాజు అనే ఇద్దరు కుమారులు. ఆయన ముత్తాత అనంతరం అప్పాస్వామి టంగుటూరులో, ఆయన తమ్ముడు నరసరాజు టంగుటూరుకు దగ్గరలో ఉన్న వల్లూరులో కరణీకం చేసేవారు. నరసరాజే ప్రకాశం పంతులు తాత. టంగుటూరి ప్రకాశం పంతులు తండ్రి గోపాలకృష్ణయ్య మరణించడంతో పిల్లలను తీసుకుని తల్లి సుబ్బమ్మ ఒంగోలు చేరింది. ఒంగోలులో భోజనశాల నడుపుతుండగా నాటి రోజుల్లో ఇలాంటి వృత్తి చేసేవారిని చులకనగా చూసేవారు. దీంతో తల్లి చేస్తున్న పూటకూళ్ల వ్యాపారంతో సంపాదన చాలకపోవడంతో ప్రకాశం పంతులు ధనికుల ఇళ్లలో వారాలకు దిగారు. కేవలం చదువులోనే కాకుండా నాటకాలు వేయడం, ఆటల్లోనూ చురుకుగా పాల్గొనేవారు. ఆయనకు క్రికెట్ అంటే అప్పట్లోనే ఇష్టమని పలువురు చెప్పుకునేవారు.



కలెక్టరేట్‌లో ప్రకాశం విగ్రహం

● ప్రకాశం జిల్లాగా ఏర్పాటు

స్వాతంత్ర్య సమర యోధునిగా ప్రకాశం ఉదారత్వం నేటికీ ఆంధ్రదేశంలో వెలుగొందుతూనే ఉంది. టంగుటూరి ప్రకాశం పంతులు జాతికి చేసిన సేవలకు గుర్తింపుగా 1972 డిసెంబరు 5న ఒంగోలు జిల్లాను ప్రకాశం జిల్లాగా పేరు మార్చారు. గుంటూరు జిల్లాలో మూడు తాలూకాలైన అద్దంకి, చీరాల, ఒంగోలు, నెల్లూరు జిల్లాలోని నాలుగు తాలూకాలైన కందుకూరు, కనిగిరి, పొదిలి, దర్శి, కర్నూలు జిల్లాలోని రెండు తాలూకాలైన మార్కాపురం, గిద్దలూరును కలిపి ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేశారు. కాగా గత వైసీపీ పాలనలో జిల్లాను రెండుగా విభజించడంతో ప్రస్తుతం ఈ ప్రాంతాలన్నింటినీ కలుపుకుని ఉమ్మడి ప్రకాశం జిల్లాగా పిలుస్తున్నారు.


విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న ప్రకాశం భవన్

టంగుటూరి జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు

● న్యాయవాద వృత్తిలో స్థిరపడాలని కలలుగన్న ప్రకాశం పంతులకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేక రాత్రికి రాత్రి 50 కిలోమీటర్లు నడిచి మేనమామ దగ్గరకు వెళ్లినా ఫీజుకు అవసరమైన రూ.3లభించలేదు. ఈ విషయం తెలుసుకున్న ఆయన తల్లి తన పట్టు వస్త్రాన్ని తాకట్టు పెట్టి ఫీజు చెల్లించింది. ఈ ఘటన ఆంధ్రకేసరి మనసులో చిరస్థాయిగా మిగిలిపోయింది. తాను సీఎంగా పనిచేసిన రోజుల్లో పేద విద్యార్థుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం ప్రధాన ఘట్టం.

● తన గురువు హనుమంతరావును చూసేందుకు ఒంగోలు నుంచి రాజమండ్రి వెళ్లే ప్రయాణంలో విజయవాడ వద్ద కృష్ణా నదిని దాటలేక వెనక్కి వెళ్లారు. ప్రియశిష్యుడు వెళ్లిపోవడంతో బాధపడుతూ కూర్చున్న గురువు హనుమంతరావు తిరిగొచ్చి ప్రకాశం పంతులను చూసి పులకించిపోయి రాజమండ్రిలోనే తన దగ్గర ఉంచుకుని చదివించారు.

● 1949లో కారులో కృష్ణా నది వరకు చేరుకున్న ప్రకాశం పంతులు నాలుగు అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్న నదిని దాటి మద్రాసు వెళ్లాల్సి వచ్చింది. కారు డ్రైవర్ ముందుకు పోనిచ్చేందుకు వెనకడుగు వేసి, భయపడుతున్నా, ఆయనకు ధైర్యం చెప్పి కారును నీళ్లలోనే పోనిచ్చి అవతలి ఒడ్డుకు చేరుకున్న ప్రకాశం పంతులు ధైర్యాన్ని అప్పట్లోనే ప్రజలు అభినందించారు.

● 1951లో జూలై 23న బెజవాడలో ప్రకాశం పంతులు అభిమానులు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, కార్యక్రమానికి ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరిన ప్రముఖులందరూ వర్షం వలన నాగపూర్‌లోనే ఆగిపోయారు. మరుసటి రోజు బెజవాడ చేరుకున్న వీరంతా విగ్రహాన్ని చూసి సంతోషం వ్యక్తం చేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

నందనవనం కొండపై విగ్రహాల ధ్వంసం

నెలరోజులుగా రెక్కీ వేసిన ముఠా

పోలీసుల అదుపులో ముఠా నాయకులు

కనిగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామ కొండపై ఉన్న రంగనాయకస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున గుప్తనిధుల కోసం దేవతా విగ్రహాలను ధ్వంసం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. నందనవనం గ్రామ శివారు కొండపై కొలువైఉన్న రంగనాయక స్వామి, శివాలయంలో గుప్తనిధుల కోసం ముఠా ప్రత్యేక పూజలు చేపట్టింది. పూజా కార్యక్రమం నిర్వహించే క్రమంలో టెంకాయలు లేకపోవడంతో వాటిని కొనుగోలు చేసేందుకు గ్రామంలోని ఓ చిల్లర దుకాణానికి కొత్త వ్యక్తులు రావటంతో గ్రామస్థులకు అనుమానం కలిగింది. దీంతో వారిని వెంబడించి ఓ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పచెప్పగా విచారణలో అవాక్కయ్యే వాస్తవాలు బయటపడినట్లు సమాచారం.

నెలరోజులుగా రెక్కీ వేసిన ముఠా

కొండవద్ద ఉన్న రంగనాయకస్వామి ఆలయంలో ఉన్న గుప్త నిధులు ఉన్నట్లు ఆధారాలతో ఓ ముఠా గ్రామంలోకి వచ్చింది. నెలరోజులుగా రోజూ గ్రామంలోని ఆయా మార్గాల్లో ప్రజలు ఏయే సమయాల్లో సంచరిస్తారో ముఠా వ్యక్తులు రెక్కీ వేశారు. ఎలాంటి అనుమానాలు రాకుండా అపరాలు కొనుగోలు చేసే వ్యక్తులుగా, వివిధ వ్యాపారాలు నిర్వహించే వ్యక్తులుగా అవతారాలెత్తి గ్రామంలో సంచరించినట్లు గ్రామస్థులు చెప్తున్నారు. 15మంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి కొండపైన ఆలయంలో తవ్వకాలకు పాల్పడ్డారు.

పోలీసుల అదుపులో నిందితుడు

శుక్రవారం వేకువజామున నందనవనం గ్రామంలోని చిల్లర దుకాణం నుంచి టెంకాయలు కొనుగోలు చేసి వెళ్తున్న ఓ వ్యక్తి కొండ దిగువ ప్రవేశమార్గం వద్ద ఉన్న మరో వ్యక్తికి టెంకాయలు అప్పచెప్పాడు. ఈ విషయాన్ని గ్రామస్థుడు రామకృష్ణ అనే వ్యక్తి వెంబడించి గుర్తించాడు. ఈక్రమంలో ముఠాలోని ఇరువురు వ్యక్తులు టెంకాయలు కొనుగోలు చేశామనే విషయాన్ని ఫోన్ ద్వారా కొండపై ఉన్న ముఠాకు తెలియచేశాడు. గ్రామస్థుడు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒకరు పారిపోగా, మరొకరు చిక్కాడు.


తవ్వకం జరిగిన ప్రదేశం

ఈలోపు పారిపోయిన వ్యక్తి ముఠాకు సమాచారం అందించగా వారు కొండపై నుంచి పలాయనం చిత్తగించారు. గ్రామస్థులు కొండపైకి వెళ్ళి చూడగా విగ్రహాలు పెకలించి ఉన్నట్లుగా, పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లుగా ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

బీజేపీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్‌గా సూర్యకల్యాణ్‌చక్రవర్తి



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ రాష్ట్ర స్థాయిలో వివిధ సెల్స్ కో కన్వీనర్‌గా ఒంగోలుకు చెందిన డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తిని నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పార్టీకి కీలకనేతగా ఉన్న కల్యాణ్ ఇప్పటివరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మాధవ్‌కు ఘన స్వాగతం పలకడంతో ఒంగోలులో జరిగిన కార్యక్రమాల నిర్వహణలో డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి కీలక పాత్రపోషించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి సూర్యకల్యాణ్ చక్రవర్తి ఒక్కరే ఎంపిక కావడం విశేషం. కమిటీల్లో వివిధ పదవులు ప్రకటించినా అందులో జిల్లాకు స్థానం లేదు. వివిధ విభాగాల కన్వీనర్లను నియమించారు. సూర్యకల్యాణ్‌చక్రవర్తికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త

బంధువులకు సమాచారం ఇచ్చి పారిపోయిన వైనం

కేసు నమోదు చేసిన పోలీసులు

బేస్తవారపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానంతో నమ్మించి పొలం తీసుకెళ్లి భర్త దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన బేస్తవారపేట మండలంలోని పచ్చర్ల వెంకటాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పచ్చర్ల వెంకటాపురం గ్రామానికి చెందిన పగ్గాల తిరుపతమ్మ(50) భర్త చేతిలో దారుణంగా హత్యకు గురైంది. కొంత కాలంగా కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. తిరుపతమ్మపై అనుమానం పెంచుకున్న భర్త వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం మోటార్ బైక్‌పై ఎక్కించుకొని మొక్కజొన్నకు నీరు పెట్టాలని పొలం తీసుకెళ్లాడు. అక్కడ దాచి ఉంచిన మొద్దు కత్తితో తిరుపతమ్మ మెడను అతి దారుణంగా నరికి హత్య చేసి పరారయ్యాడు. సాయంత్రం వారి సమీప బంధువులకు వెంకటేశ్వర్లు ఫోన్ చేసి తన భార్యను చంపానని, మృతదేహం మొక్కజొన్న తోట వద్ద ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే వారి బంధువులు పోలీసులకు తెలిపారు. దీంతో శుక్రవారం రాత్రి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తిరుపతమ్మ మృతదేహం

క్రీడలతో మానసిక వికాసం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం చేకూరుతుందని సీబీఎస్ఈ తైక్వాండో టోర్నమెంట్ అబ్జర్వర్ డా. సి.దొరై అన్నారు. మార్కాపురంలోని కమలా హైస్కూల్‌లో సీబీఎస్ఈ సౌత్ జోన్-1 తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలు ప్రారంభించి దొరై మాట్లాడుతూ విద్యార్థులలో చదువుతో పాటు ఆటలు కూడా నేర్చుకునే ఆసక్తి ఉండాలన్నారు. కమలా విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.పవన్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ తదితర రాష్ట్రాల నుంచి 1,200 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, అండర్-14, 17, 19 కేటగిరిలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ముఖేష్‌కుమార్, తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ సలాం, ఆర్గనైజింగ్ కమిటీ ప్రెసిడెంట్ అఖిల్, కమలా విద్యాసంస్థల డైరెక్టర్ పి.సింధూజ, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్‌రంజన్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సీబీఎస్ఈ తైక్వాండో టోర్నమెంట్ అబ్జర్వర్ దొరై

ఎమ్మెల్యేకు సమస్యల వినతి


వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు 40 వినతి పత్రాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఆయా సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలు


అమ్మనబ్రోలులో జరిగిన వ్రతంలో పాల్గొన్న ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణశుక్రవార వ్రతాలను మండల పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. అమ్మనబ్రోలు చెన్నమల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీవ్రతాలలో ఎస్ఐ రజియాసుల్తానా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఒంగోలు(రూరల్): కొప్పోలులోని శ్రీచెన్నకేశ స్వామి దేవాలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో శ్రీవరలక్ష్మీవ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు పరాంకుశంసమీర్‌కుమార్ అధిక సంఖ్యలో హాజరైన మహిళలతో వ్రతాలను ఆచరింపజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి

● వైస్ చాన్స్‌లర్ మూర్తి


మొక్కను నాటుతున్న వైస్‌చాన్స్‌లర్ మూర్తి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇక్కడి పరిసరాలను పచ్చదనంగా తీర్చుదిద్దుతామని వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి అన్నారు. స్థానిక యూనివర్శిటీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ప్రిన్సిపాల్ ఎన్.నిర్మలామణి, ఫైనాన్స్ అధికారి కృష్ణారావులతో కలిసి మొక్కలు నాటారు. అందరూ మొక్కలు నాటి హరితవనాలను రూపొందించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆక్వా కల్చర్ విభాగం సహాయక ఆచార్యుడు సురేష్, అశ్వర్థనారాయణ, గార్డెనర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావగూడూరులో జరుగుతున్న ప్రభుత్వ భూముల రీసర్వే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులతో జేసీ సర్వే కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ మ్యాప్‌లను పరిశీలించారు. సర్వే పక్కాగా చేయాలని, అందుకు అనుసరించాల్సిన పద్ధతులను జేసీ సర్వేయర్‌లకు సూచించారు. వివరాలను తహసీల్దార్ పి.మురళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ సేవలను పరిశీలించి జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. జేసీ వెంట ఒంగోలు డీఐవో శ్రీనివాసరావు, రీసర్వే డీటీ రాజ్యలక్ష్మి, మండల ఇన్‌చార్జి సర్వేయర్ కోటేశ్వరరావు, గ్రామ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

సంతనూతలపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా పంటలసాగుపై శుక్రవారం పేర్నమిట్టలో ఆత్మ ఒంగోలు వారి సౌజన్యంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగు విషయంలో తీసుకోవాలిసిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.చిరంజీవి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానవతా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వహకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవత దినోత్సవాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నిర్మల్‌నగర్ పార్కు సమీపం నుంచి మంగమూరురోడ్డులోని జంక్షన్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ 2004 ఆగస్టు 22న జంగారెడ్డిగూడెంలో తమ మానవతా సేవా సంస్థను ప్రారంభించామని చెప్పారు. ఒంగోలు నగరంలో మరణించిన వారికి మార్చురీ బాక్సులు, అంతిమయాత్ర వాహనంతో పాటు పేదలకు మట్టి ఖర్చులకు ఆర్థికంగా సంస్థ అందిస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ వైస్‌చైర్మన్ మంగళగిరి నరసింహారావు, అధ్యక్షుడు పి.శరభలింగాచారి, కోశాధికారి మాదాల భోజిరెడ్డి, ప్రతినిధులు టమటం రామిరెడ్డి, వెంకటరెడ్డి, కోసూరి శ్రీదేవి, చిలుకూరి ఆదిలక్ష్మి, ఎస్.కనకదుర్గాదేవి, ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకటరెడ్డి, తన్నీరు సురేష్, ఎం.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపులో అవకతవకలపై విచారణ

పామూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోపాలపురం గ్రామానికి చెందిన వీవోఏ పల్లాపు బేబి బ్యాంకు లింకేజీ, సీసీఎల్, స్త్రీనిధి, సీఏఫ్, ఉన్నతి రుణాలకు సంబంధించి సుమారు రూ.36.75 లక్షలు దుర్వినియోగం చేశారు. దీనిపై కలెక్టర్, డ్వామా పీడీ ఆదేశాల మేరకు శుక్రవారం విచారణ చేపట్టినట్టు ఏపీడీ కె.కృష్ణారెడ్డి తెలిపారు. అయితే వీవోఏ కలెక్టర్ గ్రీవెన్స్‌లో నిధుల దుర్వినియోగంపై పామూరు వెలుగు అధికారులు తనను తప్పుదోవ పట్టించారని, తనకు న్యాయం చేయాలని కోరారు. అంతకుముందు వెలుగు జిల్లా అధికారుల సమక్షంలో నిధులు తానే చెల్లిస్తానని ఒప్పుకున్నారు. ఈ క్రమంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి చెల్లింపులకు సంబంధించి విచారిస్తున్నట్టు ఏపీడీ తెలిపారు. విచారణ పూర్తిచేసి సమగ్ర నివేదిక ఉన్నాతాధికారులకు అందజేస్తామని ఆయన చెప్పారు.

పొలాలకు వెళ్లాలంటే కుక్కల భయం!

ఇటీవల ఇద్దరిపై దాడి ● బెంబేలెత్తిపోతున్న రైతులు


పొలాలకు కర్రలు పట్టుకొని వెళ్తున్న పోలిరెడ్డిపాలెం గ్రామస్థులు

కొండపి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినకండ్లగుంట పంచాయతీ పరిధి పోలిరెడ్డిపాలెం గ్రామ రైతులు పొలాలకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ఆ ప్రాంతంలో స్థావరం ఏర్పాటు చేసుకున్న దాదాపు 20 కుక్కలు ఒంటిరిగా వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం ఇద్దరిని గాయపరిచాయి. నాలుగు కుక్కలు చుట్టుముట్టడంతో చచ్చిపోతానేమోనని భయపడిపోయానని గ్రామానికి చెందిన కొత్తా సాయిరెడ్డి వాపోయాడు. కర్రలతో రక్షించుకుంటూనే ఫోన్‌లో గ్రామంలోని బంధువులకు తెలియజేయడంతో మోటారు సైకిళ్లపై వచ్చి తరమడంతో బయటపడ్డానని చెప్పారు. ప్రస్తుతం పొలాల్లో వరి నారుమళ్లు, పొగ నారుమడులు పెట్టారు. పశువులకు మేతను తెచ్చుకొనేందుకు కొందరు వెళ్తున్నారు. వారంతా ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయోనని హడలిపోతున్నారు. గుంపులుగుంపులుగా పొలాలకు వెళ్తున్నామని గ్రామస్థులు వివరించారు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరారు.

భూగర్భ జలమట్టం పెంచేలా ప్రణాళికలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భజలమట్టం మరింత పెరిగేలా గ్రామస్థాయిలో వాటర్‌మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి భూగర్భ జలవనరులశాఖ, డ్వామా తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో భూగర్భజలాలు పెరగడానికి గ్రామస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకొని 20 మీటర్ల కంటే ఎక్కువ భూగర్భజలం మట్టం ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అధికారులు వరలక్ష్మి, జోసెఫ్‌కుమార్, బాలశంకరరావు, శ్రీనివాసరావు, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భద్రత కల్పించాలి

పాఠశాలల్లో బోధనతో పాటు విద్యార్థులకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎంతమంది విద్యార్థులకు జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు లేవో గుర్తించాలని డీఈవోను ఆదేశించారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంఈవోలు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాలని చెప్పారు. తరగతి గదుల్లో స్లాబు నుంచి పెచ్చులు ఊడిపడటం, శిథిలావస్థకు చేరడం లాంటి పరిస్థితి ఎక్కడ ఉందో గుర్తించి మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. మనబడి-మన భవిష్యత్ పథకంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్, ఆర్ఐవో ఆంజనేయులు, జిల్లా డిప్యూటీ విద్యాధికారులు శ్రీనివాసులు, చంద్రమౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సమన్వయంతో అభివృద్ధి చేసుకోవాలి

● ఎంపీడీవో రవికుమార్


మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. శుక్రవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి స్థాయిలను గుర్తించేందుకు అనువుగా కేంద్ర ప్రభుత్వం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ యాప్‌ను రూపొందించిందని చెప్పారు. ఈ యాప్‌లో గ్రామ పంచాయతీలలో 9 అంశాలపై 554 సూచికలకు సంబంధించిన పథకాల పురోగతి నమోదు చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది తగిన జాగ్రత్తలతో సమాచారం అందించడం ద్వారా దేశంలోని 2.50 లక్షల గ్రామాల అభివృద్ధికి అంచనా వేస్తారని చెప్పారు. గ్రామస్థాయి సమాచారం ఇప్పటికే ఒకసారి సేకరించగా గుజరాత్, కేరళ రాష్ట్రాలు మాత్రమే ముందంజలో ఉన్నాయని, ప్రస్తుతం రెండో విడత సర్వేలో కచ్చితమైన సమాచారం నమోదు జరిగేలా మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంఈవో రవి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమైక్యంగా పని చేయాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికవసతుల కల్పనలో నూరుశాతం సాధ్యమైతే సుస్థిర పురోగతి సాధించినట్లేనన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.రమణమ్మ, ఎంపీపీ బి.విజయ, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఈవోఆర్డీ రమణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పీఏఐ శిక్షణ

కొండపి: మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ-1.0)పై శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ సమావేశం హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రామకృష్ణ, ఈవోఆర్డీ అంజలీదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 265 పోలింగ్ కేంద్రాలు

కొత్తగా 9 కేంద్రాల ఏర్పాటు

ఆమోదం తెలిపిన రాజకీయ పార్టీలు


మాట్లాడుతున్న ఈఆర్వో వరకుమార్

చీమకుర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గంలో కొత్తగా 9 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఖరారు అయింది. ప్రస్తుతం 256 ఉండగా నూతనంగా ఏర్పాటు చేసిన 9తో పోలింగ్ కేంద్రాల సంఖ్య 265కు చేరుకోబోతుంది. దీనికి సంబంధించిన ప్రాథమిక కసరత్తు పూర్తి చేసిన అధికారులు శుక్రవారం చీమకుర్తిలో జరిగిన సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధుల ముందు ఆమోదం నిమిత్తం ఉంచారు. ఈ ప్రతిపాదనలకు సమావేశంలో పాల్గొన్న అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు ముక్తకంఠంతో ఆమోదం తెలుపటంతో పోలింగ్ కేంద్రాల పెంపు ప్రక్రియ లాంఛనమే కానుంది. ఈ సందర్భంగా ఈఆర్వో వరకుమార్ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలు, అపోహలకు తావులేకుండా పోలింగ్ కేంద్రాల వికేంద్రీకరణ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రానికి 1200 ఓటర్లు మించకుండా కూర్పు చేయటం జరిగిందన్నారు. దీనిలో భాగంగా చీమకుర్తి మండలంలో దేవరపాలెం, బండ్లమూడి, ఆర్ఎల్‌పురం, చీమకుర్తి టౌన్‌తో కలిపి నాలుగు, సంతనూతలపాడు మండలపరిధిలో పేర్నమిట్టలో నాలుగు, బొడ్డువానిపాలెంలో ఒకటి చొప్పున ఐదు వెరసి నియోజకవర్గ పరిధిలో మొత్తం 9 పోలింగ్ కేంద్రాలు నూతనంగా ఏర్పాటు కానున్నాయి. మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో ఎటువంటి మార్పు చోటుచేసుకోలేదు. పోలింగ్ కేంద్రాల పునర్విభజన ప్రక్రియకు సంపూర్ణ సహకారం అందజేసిన అన్ని రాజకీయపక్షాలకు ఈఆర్వో ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్‌లు బ్రహ్మయ్య, నారాయణరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కొండపిలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

● ఏర్పాట్లు పరిశీలించిన నాయకులు


కల్యాణ మండపంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కొండపి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొండపి నియోజకవర్గస్థాయి టీడీపీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం కొండపిలోని కామేపల్లి రోడ్డులోని కల్యాణ మండపంలో జరుగునున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఏర్పాట్లను టీడీపీ నాయకులు పరిశీలించారు. విస్తృతస్థాయి సమావేశంలో మండల కమిటీలను కూడా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ క్యాడర్ భావిస్తున్నారు. సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్టీ జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరవుతారని నాయకులు తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు బత్తుల నారాయణస్వామి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరాయుడు, టీడీపీ నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, గుండపనేని రామ్మూర్తి నాయుడు, మూలె రామారావు పరిశీలించారు.

పరీక్షల్లో బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలి

● ఏపీటీఎఫ్ నాయకుల విజ్ఞప్తి


వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒంగోలులో జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుక్‌లెట్ విధానం వల్ల పాఠశాల పనివేళల్లో జరగాల్సిన బోధన సమయం హరించుకపోతుందన్నారు. గతంలో పరీక్షలు పేపర్లలో నిర్వహించినందున టీచర్లు పేపర్లను ఇళ్ళకు తీసుకెళ్ళి దిద్దేవారని, ప్రస్తుతం ఆ పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్ళే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు బోధించాల్సిన పనిగంటలు తగ్గిపోతాయన్నారు. అందువల్ల ఈ బుక్‌లెట్ విధానాన్ని తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, బి.శేషారావు, హనుమంతరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు బీమా చెక్ అందజేత

పీసీపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో మహిళ మృతి చెందడంతో ఆమె భర్తకు టీడీపీ బీమా చెక్కును శుక్రవారం అందజేశారు. భట్టుపల్లి గ్రామానికి చెందిన బొట్లే యోగయ్య, కొండమ్మ దంపతులు. ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో కొండమ్మ మృతి చెందింది. ఆమె టీడీపీ సభ్యత్వం కలిగి ఉండగా ఈ విషయాన్ని నాయకులు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.5లక్షల బీమా మంజూరు చేయించారు. ఈ చెక్కును శుక్రవారం భట్టుపల్లికి వెళ్లి మృతురాలు కొండమ్మకు నామినీగా ఉన్న ఆమె భర్త యోగయ్యకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్రబాబు, ప్రతాప్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, జోసెఫ్, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రకాశంపంతులు జయంతి వేడుకలు

ఒంగోలు(రూరల్), ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు ఉప్పు సత్యాగ్రహ విజయస్థూపం వద్ద ఈనెల 23న స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకాశంపంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఎంపీడీవో శేషుబాబు, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ కోచ్ దుర్గాప్రసాద్ మృతికి సంతాపం


దుర్గాప్రసాద్(ఫైల్)

ఒంగోలు(రూరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, కబడ్డీ కోచ్ దుర్గాప్రసాద్ శుక్రవారం అనారోగ్యంతో చీరాలలో తన స్వగృహంలో మృతి చెందడంపై జిల్లా కబడ్డీ అసోషియోన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ఇతర సభ్యులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దుర్గాప్రసాద్ గత 30 సంవత్సరాలుగా కోచ్‌గా ఎందరో క్రీడాకారులను తయారు చేశారని కొనియాడారు. కాకినాడలోని స్పోర్ట్ హాస్టల్ కోచ్‌గా ఉండి విద్యార్థులను క్రమశిక్షణ గల క్రీడాకారులు తీర్చిదిద్దారని చెప్పారు. అంతేగాకుండా ప్రకాశం జిల్లా డీఎస్‌డీవోగా పని చేశారన్నారు. ఆయన లేని లోటు క్రీడాకారులకు తీరని లోటని పేర్కొన్నారు.

క్విస్‌లో 110మంది రక్తదానం


రక్తదానం చేసిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్, బ్రహ్మకుమారీస్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం జరిగింది. సుమారు 110 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. దాది ప్రకాశమణి 18వ వర్ధంతి సందర్భంగా భారత, నేపాల్‌లలో ఒకే రోజు 2 లక్షల యూనిట్ల రక్తం సేకరించారన్నారు. రక్తసేకరణలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించినట్లు బ్రహ్మకుమారీస్ తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో నవనీత్ కృష్ణన్, రేవతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి యువత ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినోత్సవం ఒంగోలులోని శివంఫౌండేషన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకుడు అడుసుమల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పైడి యుగంధర్, ఎస్‌కే.కరీముల్లా, ఎం.సుబ్బయ్య, నున్నా జానకీరామ్, ఎం.సుబ్బారావు, దలవాయిబాబు, పాపిశెట్టి సంతోష్, ముత్యాల రామకృష్ణ, మోహన్, శ్రీనివాస్, బద్దుల నాగరాజు, భూపతి రమేష్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నియామకాల్లో నూతన విధానం ఉపసంహరించుకోవాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాలను ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. డీఎస్సీ మెరిట్ లిస్టులు, జిల్లాల వారీగా కటాఫ్ ప్రకటించిన తర్వాతనే ఎంపికైన తుది జాబితాను విడుదల చేయాలన్నారు. ఈ మేరకు ఒంగోలులో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత మెరిట్ జాబితాలు విడుదల చేశారని, ఏ సబ్జెక్టులో ఏ అభ్యర్థికి ఎన్ని మార్కులు వచ్చాయో తెలిసేదన్నారు. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందని చెప్పారు. అందువల్ల ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిచంద్రశేఖర్, పవన్, తేజ పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న పోలీసులకు సత్కారం

ఒంగోలు క్రైం, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీలో భాగంగా ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న సిబ్బందిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక తాలుకా పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ మల్లునాయక్, శ్రీనివాసరావు, కానిస్టేబుళ్ళు శేషిరెడ్డి, రమేష్‌నాయక్, నాసరయ్యలను సీఐ టి.విజయకృష్ణ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. సందర్భంగా సీఐ మాట్లాడుతూ విధినిర్వహణలో జవాబుదారితనంగా వ్యవహరించి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఫణిభూషణ్, సందీప్ పాల్గొన్నారు.

26న మండల సమావేశం

ఒంగోలు (రూరల్) ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్టాండ్ స్థల ఆక్రమణపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న డీఎం శ్రీనివాసరావు

సంతనూతలపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్‌కు సంబంధించిన స్థలం ఆక్రమణపై ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక తహసీల్దార్ నారాయణరెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ బస్టాండ్ స్థలం ఎంతమేర ఆక్రమణకు గురయిందో పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఒంగోలు డిపో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

27న గొర్రెల పెంపకందారుల రాష్ట్ర మహాసభ


మాట్లాడుతున్న తిరుపతిరావు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల రాష్ట్ర మహాసభలు ఈనెల 27వ తేదీన ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతుందని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కరవది, ఉలిచి గ్రామాల్లోని గొర్రెల పెంపకందారులతో సమావేశాలను ఏర్పాటు చేసి మాట్లాడారు. గొర్రెల పెంపకందారులు సమస్యలపై ఈ మహాసభలో చర్చిస్తామని, పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఆయన వెంట సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



పురవీధుల్లో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

రాచర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం అట్టహాసంగా ముగిశాయి. ఈనెల 16వ తేదీన అనుములపల్లి గ్రామంలోని లీల నారాయణ ఇంటివద్ద శ్రీకృష్ణుని ప్రతిమను నెలకొల్పి ఏడు రోజులపాటు ఉదయ, సాయంత్రాలు నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేసి అనంతరం కొలువు ప్రాంతం నుంచి గ్రామంలోని పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామ పెద్దలు శిరిగిరి రమేష్, వెంకటపతి, యేలెం గోవిందయ్య, రాధాకృష్ణలు పాల్గొని కాయ కర్పూరాలు సమర్పించారు. కమిటీ సభ్యులు శివకుమార్, భాగ్యం, లీల నారాయణ, శ్రీకాంత్, ఖాదర్, పుల్లమ్మ, పార్వతి, లక్ష్మీదేవీ, సుభాషిని, స్వాతి పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను అభినందిస్తున్న సంజీవరెడ్డి

ప్రజాసమస్యలపై దృష్టి సారిద్దాం

కొమరోలు, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండలంలో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని కొమరోలు సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి జిల్లా ఉత్తమ తహసీల్దార్ అవార్డు తీసుకున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ స్థానిక కార్యాలయంలో సిబ్బందికి సరిపడా గదులు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. అంతకు ముందు జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా దేవరశెట్టి భాగ్యలక్ష్మిని పార్టీనాయకులు, కార్యాకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, నాయకులు బిజ్జాం నరసింహులు, పులకుర్తి సుబ్బరాయుడు, పాలేబోయిన రమణయ్య, మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి, గోడి శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలకు నగదు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

మసీదు మరమ్మతులకు రూ.2లక్షలు

● అందజేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపాడు గ్రామంలో మసీదు మరమ్మతులకు రూ. 2లక్షల నగదును శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ముస్లిం పెద్దలకు అందజేశారు. ఈనెల 14వ తేదీన గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్యతో కాలిపోయిన మసీదు మరమ్మతులకు సొంతంగా ఆర్థిక సహాయాన్ని ఆయన ప్రకటించారు. ఆ మొత్తాన్ని వారికి అందజేసి సంఘటనకు కారకులను త్వరలోనే గుర్తించాలని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించానని చెప్పారు. ముస్లింపెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

మానవతా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రెడ్డి కాలేజీ నుంచి పురవీధుల్లో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, సంస్థ సభ్యులు గుంటక వనజాక్షి, బలరామిరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని కోరుతూ ర్యాలీ

గిద్దలూరు టౌన్: ప్రపంచ శాంతిని కోరుతూ శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు సాగింది. ఈసందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ పాలుగుళ్ళ వెంకట శివారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ విలువలతో కూడుకున్న శాంతిసమాజం నిర్మాణమే మానవతా ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మాలపాటి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి యల్లా శ్రీనివాసులు, కోశాధికారి దగ్గుపాటి వెంకటేశ్వర్లు, సభ్యులు ఈ.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి మహిళా స్పందన

వారంలో 50శాతానికి పెరిగిన ప్రయాణికులు

మార్కాపురం డిపో పరిధిలో గతంలో 8వేల మంది, ప్రస్తుతం రోజూ 15వేల మంది ప్రయాణం

త్రిపురాంతకం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల్లో పెరుగుతున్న ఆసక్తితో ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మొత్తం ప్రయాణికుల్లో గతంలో 30 శాతం ఉండే మహిళలు ఇప్పుడు 50 శాతానికి మించి ప్రయాణిస్తున్నారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మార్కాపురం డిపో పరిధిలో తిరిగే అన్ని బస్సుల్లో ఈ పథకం ప్రారంభానికి ముందు ప్రతిరోజు దాదాపు 8 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటే ఇప్పుడు స్త్రీశక్తి ద్వారా ఆ సంఖ్య రోజుకు 15వేలకు మించినట్టు అధికారులు చెబుతున్నారు. మార్కాపురం డిపో నుంచి ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని రూట్లతోపాటు మాచర్ల, వినుకొండ



దోర్నాల బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులు

తదితర ప్రాంతాల వైపు వెళ్లే బస్సుల్లో కూడా మహిళా ప్రయాణికుల సంఖ్య ఇప్పుడు మొత్తం ప్రయాణికుల్లో 50 శాతం అంటే సగం మంది మహిళలే ప్రయాణిస్తున్నారని, ఇది ఇంకా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జీరో ఫేర్ టికెట్‌తో ఉచిత ప్రయాణం చేస్తూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం చాలా సంతోషాన్నిచ్చిందని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ప్రయాణిస్తున్నాం

- కె.దానమ్మ, గంగవరం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ప్రభుత్వం కల్పించటంతో సంతోషంగా ఉంది. గతంలో ప్రయాణానికి ఖర్చయ్యే డబ్బు చూసుకుని భయపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఎక్కడికైనా హాయిగా ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మహిళలు రుణపడి ఉంటారు.

ఎక్కడికైనా ఉచితంగా వెళ్లగలగటం అదృష్టం

- ఈదర నాగమ్మ, హసనాబాద్



రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించటాన్ని మహిళల అదృష్టంగా భావిస్తున్నా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఉచిత ప్రయాణం కల్పించడం ఆనందంగా ఉంది.

బస్టాండ్ కూడలిలో మరుగుదొడ్ల నిర్మాణం

స్థలం తమదంటూ అడ్డుకున్న కొందరు మహిళలు

ఘాటుగా స్పందించిన కమిషనర్



స్థలం తమదంటూ కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న మహిళలు

పొదిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్దబస్టాండ్ సెంటర్‌లో గతంలో కూల్చివేసిన మరుగుదొడ్ల నిర్మాణ స్థలంలో ఎట్టకేలకు పునర్ నిర్మాణానికి శుక్రవారం నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మరుగుదొడ్లు లేక మహిళలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 17వతేదీన మరుగుదొడ్ల నిర్మాణం జరిగేనా ? శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. 15 సంవత్సరాల క్రితం అప్పటి మేజర్ పంచాయతీ సర్పంచ్ స్వర్ణ గీత ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో పే అండ్ యూజ్ విధానంలో మరుగుదొడ్ల నిర్వహణను ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చిన విషయం అందరికి తెలిసిందే. అనంతరం సంబంధిత లీజుదారుడు మరుగుదొడ్ల నిర్మించి 25 ఏళ్లపాటు నిర్వాహణ బాధ్యతలపై ఒప్పందం కుదుర్చుకున్నారు. లీజు అయిపోయిన తరువాత మరుగుదొడ్లను పంచాయతీకి వదిలి వెళ్లేవిధంగా ఒప్పందం కుదుర్చుకొని 12 సంవత్సరాలపాటు నిరాటంకంగా నిర్వహిస్తూ వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది అక్రమ రిజిస్ట్రేషన్‌లతో ఆస్థలం తమదంటూ రాత్రికి రాత్రి మరుగుదొడ్లను నేలమట్టం చేశారు. కోట్ల విలువైన పంచాయతీ స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. అప్పట్లో వైసీపీ నాయకులు వారికి పూర్తిగా మద్దతు ఇచ్చారు. లీజుదారుడు లీజు కాలం ముగియకముందే మరుగుదొడ్లు కూల్చివేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి అప్పటి అధికారపార్టీ నేతల ఒత్తిడితో అటు పోలీసులు కాని ఇటు నగరపంచాయతీ అధికారులు గాని ఆవైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోయారు. దీంతో మూడేళ్లుగా మరుగుదొడ్లు లేక మహిళలు, ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి నగరపాలక అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. పనులు జరుగుతుండగా కొంతమంది ముస్లిం మహిళలు ఆస్థలం తమదంటూ వచ్చి హడావిడి చేశారు. ఈస్థలం ఏ రికార్డులో చూసినా నగరపంచాయతీకి చెందినదని మీకు అమ్మిన వ్యక్తి బోగస్ సర్వే నెంబర్లు వేసి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని నగరపంచాయతీకి చెందిన స్థలంపై ఎలాంటి హక్కులు లేవని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి వారికి తేల్చి చెప్పారు. మరోమారు ఇక్కడకు వచ్చి సమస్యలు సృష్టిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. నిర్మాణ పనులను ఎట్టిపరిస్థితుల్లో ఆపబోమని, మరుగుదొడ్లు నగరపంచాయతీ స్థలంలోనే నిర్మిస్తామని కమిషనర్ తెలిపారు. మొత్తం మీద కూడలి ప్రాంతమైన బస్టాండ్ సెంటర్లో మరుగుదొడ్లు నిర్మాణ పనులు ప్రారంభకావడంతో పట్టణ ప్రజలు కమిషనర్‌ను అభినందిస్తున్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని చెన్నకేశవస్వామి, మార్కండేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ మాస అమవాస్య సందర్భంగా శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేసి ఆలయంలో రథోత్సవం నిర్వహించారు. జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ శర్మలు జగదాంబ మాత మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. వివిధ పూజల అనంతరం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

శ్రావణమాస పూజలు

గిద్దలూరు : శ్రావణమాసంలో చివరి శుక్రవారం పూజలను ముఖ్యంగా మహిళలు భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. ఇళ్లలో శ్రావణ మాస పూజలను నిర్వహించి ఇరుగుపొరుగు వారికి తాంబూలాలను ఇచ్చారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ శుక్రవార పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఉభయ దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ

ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయునిపేట, వెల్లుపల్లి గ్రామాలలో ఆత్మ పథకంలో భాగంగా ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేశారు. పత్తిపంటలో రసం పీల్చే పురుగుల నివారణ కోసం పసుపు పచ్చ, బులుగు, తెలుపు జిగురు అట్టలను ఉపయోగించడం వలన కలిగే ఉపయోగాల గురించి వివరించారు. పేనుబంక, ఆకుతొలుచు పురుగు, పచ్చ, తెల్లదోమలను నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వెల్లుపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన క్షేత్రంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ జీవ ఎరువులు, నానో ఎరువులు, నానో యూరియా, నానో డీఏపీ వాడకం ఉపయోగాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు శంకరమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కందిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెద్దారవీడు : కంది పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. పెద్దారవీడులో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనా తీసే విధానాన్ని గ్రామ వ్యవసాయ సహాయకురాలు లావణ్య వివరించారు. విత్తనశుద్ధి, మొలక శాతం తెలుసుకునే పద్ధతులను ఏఈవో సునీల్ నాయక్ వివరించారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



ఎస్ఐ బ్రహ్మనాయుడు

తర్లుపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ బ్రహ్మనాయుడు అన్నారు. తర్లుపాడు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాలకు విద్యుత్, అగ్నిమాపక శాఖలు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాలు ఏర్పాటు చేసే స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10 తర్వాత మైక్ పర్మిషన్ కూడా ఉండదన్నారు. మండపాలు ఏర్పాటు చేయువారు గణేష్ ఉత్సవ్ నెట్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో క్రమశిక్షణ, భక్తి శ్రద్ధలతో విగ్రహాలను నిమజ్జనం చేయాలని కోరారు.

వైజ్ఞానిక అంశాలపై అవగాహన

కంభం : వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమంలోని వైజ్ఞానిక అంశాలను సంస్కృత అధ్యాపకుడు కేవీ రమణారెడ్డి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారు. 9వ తరగతి సంస్కృత పాఠ్యపుస్తకంలోని గణేశ చతుర్థి వైజ్ఞానికతా అను పాఠ్యాంశ బోధనలో భాగంగా శుక్రవారం క్షేత్ర పర్యటన చేసి, మొక్కల నుంచి 21రకాల పత్రాలను సేకరించి ఏకవింశతి పూజా వ్రతవిశేషాలను ఆ పత్రాలలోని ఔషధ గుణాల రహస్యాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు.

13న జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయా ధికారి, మండల న్యాయసేవల కమిటీ చైర్మన్ ఎ.ఓంకార్ అన్నారు. శుక్రవారం కోర్టులో రెవెన్యూ, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి ఓంకార్ మాట్లాడుతూ కోర్టులలోని అన్ని రకాల సివిల్, చెక్‌బౌన్స్, భరణం, గృహహింస కేసులతో పాటు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని ఆయన తెలిపారు.

జార్జి ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ డే

మార్కాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తర్లుపాడు రోడ్డులోని జార్జి ఫార్మసీ కాలేజీలో 21వ గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ హరిబాబు ముఖ్య అతిథిగా హాజరుకాగా కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎ.సతీష్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయండి

● శిక్షణలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

రాచర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల పురోగతికి అధికారులందరూ ప్రత్యేక కృషి చేయాలని ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి అన్నారు. పంచాయతీ పురోగతి సూచిక అనే కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాలులో శుక్రవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సవాల్‌గా తీసుకోవాలని, గ్రామాల అభివృద్ధి, పురోగతి, కొలమానాలు పరిగణనలోకి తీసుకుని అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో మమేకమై ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధికి సంబంధించిన అంశాలను ముందుగా గుర్తించి వాటిని కొనసాగించేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఐ. వెంకటేష్, కార్యాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడులో..

తర్లుపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ పంచాయతీల పురోగతిపై ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు తయారు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ పోలయ్య

ఆగిపోయిన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

రాచర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :ఆగిపోయిన గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మండల గృహనిర్మాణ శాఖ ఏఈ బి. పోలయ్య అన్నారు. వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాలను శుక్రవారం ఆయన రాచర్లలో పరిశీలించారు. నిర్మాణాలు చేపట్టిన అనంతరం లబ్ధిదారులు కొన్ని గృహాల నిర్మాణాలు అర్ధంతరంగా ఆపివేశారని వాటిని త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు త్వరగా వస్తాయని లేకపోతే నష్టపోతారని అన్నారు. ఏఈ వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నబాబు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ స్థానిక 35వ వార్డులో బోర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న హసినాపై కొంతమంది దాడి చేశారని తెలిపారు. డీప్ బోరు ఆపరేటర్‌గా పనిచేస్తున్న హసినా అక్కడికి వెళ్లగా మోటర్ వేయమని కొంతమంది మహిళలు చెప్పారని, సాగర్ జలాలు వస్తున్నాయి కదా అవి బంద్ అయిన తర్వాత బోరు నీళ్లు వదులుతానని తెలుపగా అక్కడున్న ఇద్దరు మహిళలు దౌర్జన్యంగా బోరు వేశారని, వారించిన హసినాను కొట్టారని తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిరసన చేస్తున్న సమయంలో దాడి చేసిన వారి కుటుంబ సభ్యులు వచ్చి తాము ఆ విధంగా ప్రవర్తించటం తప్పని, ఆ ఆ మహిళలతో క్షమాపణలు కూడా చెప్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో హసినా, హరికృష్ణ, రమణ, అల్లూరయ్య, కేశవ, సలాంఖాన్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇరువురి అరెస్ట్

రాచర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని జేపీచెరువు చర్చి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇరువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తమకు పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి తమకు పట్టుబడితే తప్పకుండా జరిమానాతోపాటు జైలుశిక్ష ఉంటుందని అన్నారు. కాబట్టి వాహనాలు నడిపేవారు నిబంధనలకు లోబడి నడపాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు ఉంటాయని అన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

తర్లుపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డపల్లె శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నున్న రూ.3,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది, శివ, రఘు పాల్గొన్నారు.

రెండు సెల్‌ఫోన్లు రికవరీ

పుల్లలచెరువు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను పుల్లలచెరువు పోలీసులు రికవరీ చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రికవరీ చేసిన ఫోన్లను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులు పుల్లలచెరువుకు చెందిన మేడికొండ సత్యనారాయణ ,మర్రివేములకు చెందిన ఎర్రపాటి సైదులుకు ఎస్ఐ ఎల్. సంపత్‌కుమార్ అందజేశారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు చెప్పారు.

ధర్నాను జయప్రదం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పట్టణ రజక వృత్తిదారు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. బాలచంద్ర, కాశయ్య, సుబ్బారావు, కాశీనాథ్, దుర్గా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు కుర్చీల బహూకరణ

కంభం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవా గుణం కలిగి ఉండడం చాలా గొప్ప విషయమని అర్ధవీడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్ బాబు తెలిపారు. అర్ధవీడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-25 విద్యాసంవత్సరం చదివిన విద్యార్థులు శుక్రవారం కళాశాలకు 30కుర్చీలను బహూకరించారు.

ముఖాముఖి

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

టి.త్యాగరాజు, ఎస్ఐ, దొనకొండ



ప్రశ్న: వినాయక చవితి వేడుకలకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జవాబు: గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించే నిర్వాహకులు ముందుగా పోలీస్ అనుమతుల కోసం పోలీస్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. మండపాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పబ్లిక్ స్థలాల్లో కాకుండా ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటుచేసుకోవాలి. మండపాల వద్ద మత్తు పానీయాలు సేవించరాదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్ర: మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జ: తరచూ ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: గ్రామాల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా ?

జ: ఇప్పటివరకు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ఏర్పాటుచేసిన దాదాపు 75 సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయి. ఇంకా కొన్నిగ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. ఇటీవల సాగర్ కెనాల్లో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించాం.

పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి

పామూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టి అవినీతికి తావు లేకుండా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని దాదిరెడ్డి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీపై గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పువ్వాడి మాట్లాడుతూ జాబుకార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు చూపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దిపూడి శారమ్మ, ఉపసర్పంచ్ కె.రామ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, పాలపర్తి వెంకటేశ్వర్లు, కల్లూరి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నోటీసుల జారీ

పామూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోటా కింద పెన్షన్‌లు పొందుతున్న 152 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. పామూరు మండలంలో 59 మంది, సీఎస్‌పురం మండలంలో 93 మందికి నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. నోటీసులు అందుకున్నవారు పెన్షన్‌కు తాము అర్హులని తెలిపేలా సంబంధిత సర్టిఫికెట్లతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అధికారుల నుంచి వచ్చిన జాబితాలో 60 సంవత్సరాలు వయస్సు దాటినవారు ఉంటే వారికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తామని తెలిపారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటుచేసే గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్ పేర్కొన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు అన్ని నిబంధనలతోపాటు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటు కోసం పోలీస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పామూరులో శాంతి ర్యాలీ

పామూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ సభ్యత్వాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని గౌరవాధ్యక్షుడు కె.రామిరెడ్డి తెలిపారు. సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని లక్ష్మీనరసాపురం, మోపాడు, వగ్గంపల్లి, మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎంలు పేట తిరుపతిరెడ్డి, ఎంవిజయలక్ష్మి, ఏవీ సుబ్బరాజు, చావా శ్రీనివాసులు, పలువు ఉపాధ్యాయులు సభ్యత్వాలు తీసుకున్నారు. అనంతరం మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.ముసలయ్య, ఎం.తిరుపతిరెడ్డి, వి.వెంకటేశ్వరెడ్డి, టి.రమేష్, టి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

తాళ్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సానికొమ్ము సత్యం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశం హాలులో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త వేయకుండా చూడాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీయించాలన్నారు. మురుగు నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» **ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు**



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ సమావేశం హాలులో శుక్రవారం పంచాయతీల పురోగతి సూచికపై జరిగిన శిక్షణకు ఎంపీడీవో ఎస్.సత్యం అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలకు నిధులు రాక నిర్వీర్యమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించి నిధులు విడుదల చేశారన్నారు. గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, సైడు కాలువలు నిర్మించారన్నారు. మండలంలో గత పాలనలో నిలిచిపోయిన మొగిలిగుండాల రిజర్వాయర్ నిర్మాణ పనులు, 133/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కూటమి పాలన ఏడాది కాలంలో శరవేగంగా జరగటమే నిదర్శనమన్నారు. సూపర్ సిక్స్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకుసాగితే గ్రామాలు అభివృద్ధివైపు పయనిస్తాయన్నారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో సానికొమ్ము సత్యం, ఎంఈవో జి.సుబ్బయ్య, ఎంఈవో2 సుధాకర్‌రావు, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం దేవరాజ్, సచివాలయాల సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి దోహదపడాలి

దొనకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కృషిచేయాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల పురోగతి సూచిక కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలో సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. అందుకు అధికారులు ప్రణాళికలు తయారుచేసుకోవాలన్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించిన పుడే గ్రామ పంచాయతీల్లో సుపరిపాలనకు వీలుకలుగుతుందన్నారు. అనంతరం తమ శాఖల పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అడ్మిని స్టేషన్ అధికారి షేక్ దావూద్, ఎంఈవో సాంబశివ రావు, ఏవో బాలకృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపులో అవకతవకలపై విచారణ



నిధుల దుర్వినియోగంపై విచారిస్తున్న వెలుగు బృందం

పామూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పొదువు గ్రూపులో అవకతవకలపై శుక్రవారం విచారణ చేపట్టినట్లు ఏపీడీ కె.కృష్ణారెడ్డి తెలిపారు. పామూరు క్లస్టర్ పరిధి లోని గోపాలపురం గ్రామానికి చెందిన వీవోఏ పల్లాపు బేబి తన పరిధిలోని బ్యాంకు లింకేజి, సీసీఎల్, స్త్రీనిధి, సీఏఎఫ్, ఉన్నతి రుణాలకు సంబంధించి సభ్యులకు తెలియకుండా సుమారు రూ.36 లక్షల 75 వేలు దుర్వినియోగం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, డ్వామా పీడీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీవోఏ గత మే నెలలో, పదిరోజుల క్రి తం కలెక్టర్ గ్రీవెన్స్‌లో నిధుల దుర్వినియోగంపై పామూరు వెలుగు అధికారులు తనను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. అంతకుముందు వెలుగు జిల్లా అధికారుల సమక్షంలో నిధులు తానే చెల్లిస్తానని ఒప్పుకున్నారు.

వాస్తవాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకొనేందుకు మూడు బృందాలుగా ఏర్పడి బ్యాంకు స్టేట్‌మెంట్లు, గ్రూపు సభ్యుల చెల్లింపుల కు సంబంధించి రశీదులను పరిశీలించి విచారిస్తున్నట్లు ఏపీడీ కృష్ణారెడ్డి తెలిపారు. నిధుల దుర్వినియోగంలో రూ.20 లక్షల సీసీఎల్ రుణాల్లోనే అవకతవకలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అవసరమైతే మూడు రోజుల పాటు వెలుగు కార్యా లయంలోనే ఉండి విచారణ పూర్తిచేసి సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఈ విచారణలో డీపీఎం డి.దానం, జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్, ఒంగోలు డీపీఎం యూ, ఏపీఎంలు నారాయణ, ఆదిశేషు, మండల స్త్రీ నిధి మేనేజర్లు శ్రీనివాసరావు, సంపత్, డీజీఎం జిలాని, తదితరులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న సచివాలయ ప్రాంగణం

చెరువు కాదు.. సచివాలయం

వెలిగండ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి మండల కేంద్రంలో ఉన్న సచివాలయం, రైతు సేవా కేంద్రం ఆవరణ చిన్నపాటి చెరువును తలపిస్తుంది. దీంతో కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో పాటు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

రైతు సేవా కేంద్రం ఆవరణంలో రైతులు కంది పంటను ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. వర్షపు నీరు నిలిచిఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లింగాలపాడు-మన్నేపల్లి మార్గంలో తాత్కాలిక మరమ్మతులు



డోజర్‌తో జరుగుతున్న తాత్కాలిక మరమ్మతులు

తాళ్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): లింగాలపాడు- మన్నేపల్లి రోడ్డులో పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి (సమర) శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేయించాడు. లింగాలపాడు- మన్నేపల్లి మార్గంలోగల రోడ్డు అధ్వానస్థితికి చేరింది. అడుగుకో గుంతలు ఏర్పడ్డాయి. ఈమార్గంలో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సొసైటీ అధ్యక్షుడు తన వంతుగా సొంత నిధులతో శుక్రవారం డోజర్ సహాయంతో పెద్దగుంతలను చదును చేయించాడు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులుగా ఉన్న గుంతలు పూడ్చించాడు.

ఈరోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసినా టెండర్ల ప్రక్రియ పూర్తి కాక పోవటంతో పనులు చేపట్టలేదు. తమ కష్టాలను తీర్చిన రమణారెడ్డికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



హౌసింగ్ కార్యాలయం ప్రాంగణంలో వృథాగా పడిఉన్న ఇనుప చువ్వలు

వృథాగా ఇనుప సామగ్రి

పామూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పక్కాగృహాలు నిర్మించేందుకు ఇనుప సామగ్రి సరఫరా చేశారు. ప్రస్తుతం ఇది తుప్పుపట్టి పనికిరాకుండా పోతుంది. జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకొనేందుకు లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి అప్పటి ప్రభుత్వం రూ.35 వేలు విలువకలిగిన 486 కేజీల ఇనుము, రూ.24 వేలు మేర 90 బస్తాల సిమెంటు, రూ.7,500 విలువ కలిగిన 20 టన్నుల ఇసుకను అందజేసింది. అయితే, లబ్ధిదారులు వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఇనుప చువ్వలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతున్నా పట్టించుకొనేవారే లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ పను లకైనా ఇనుమును వినియోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.

వితలాపురం రైతుకు గ్రామ ఐకానిక్ అవార్డు

తాళ్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ ఐకానిక్ అవార్డు-2025ను మండలంలోని వితలాపురం గ్రామానికి చెందిన మారం అనంతరెడ్డి అందుకున్నారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అనంతరెడ్డి గ్రామ ఐకానిక్ అవార్డును అందుకున్నారు.

ఈఅవార్డును సీఎండీ చైర్మన్ డాక్టర్ పంజాబ్ శుక్లా చేతులమీదుగా అందుకున్నారు. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా పాల ఉత్పత్తితో పాటు దేవాలయాల నిర్మాణాలు, తదితర సేవలకు గుర్తింపుగా ఈఅవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా అనంతరెడ్డిని గ్రామస్థులు, రైతులు అభినందించారు.



సీఎండీ చైర్మన్ డాక్టర్ శుక్లా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న అనంతరెడ్డి

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

దర్శి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం దర్శిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ ఆస్పత్రుల ప్రతినిధులు సంయుక్తంగా మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలందించటం ఆనందదాయకమన్నారు. ఈశిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, గ్యాస్ ట్రబుల్, కీళ్లు, ఎముకలు, మహిళలకు సంబంధించిన వ్యాధులకు ప్రముఖ డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

శిబిరంలో 850 మంది రోగులకు వైద్య సేవలందించినట్లు రోటరీక్లబ్ రీజనల్ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎస్ఐ ఎం.మురళీ, రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి ఏ.నారాయణరెడ్డి, కె.రమణారెడ్డి, ఎం.కోటిరెడ్డి, కేవీ రెడ్డి, డాక్టర్ కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి

కనిగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ టి.శ్రీరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరి మండలంలోని వివిధ గ్రామాలు, కనిగిరి నగరపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను ఏర్పాటుచేసేవారు శనివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌కు సంబంధిత వివరాలతో కూడిన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లోనే ఆన్‌లైన్ ద్వారా వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

కనిగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కనిగిరిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకుడు బాషా, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దొరస్వామి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, చిరంజీవి అభిమానులు ఖాదర్, రంగారావు, ఖాజా, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలను సిద్ధంచేయాలి

పీసీపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లోని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి హనుమంతరావు అన్నారు. పంచాయతీ పురోగతి సూచికపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. వాటి పరిష్కారానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తయారుచేసిన ప్రణాళికల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులు, అధికారులను కోరారు. సమావేశంలో ఈవోపీఆర్డీ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీవో కొండయ్య, ఏపీఎం సత్యానందం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలి

పామూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి తోడ్పడేలా రూపకల్పన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం పామూరు, సీఎస్‌పురం మండలాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులకు పీఏఐపై ఒక్కరోజు శిక్షణను పామూరులో నిర్వహించారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ పంచాయతీల పురోగతికి ప్రణాళికలు తయారు చేయడం, ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడం, సుస్థిరాభివృద్ధికి, లక్ష్య సాధనకు ఈశిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు కె.సుందరరావు, రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు వై.రమేష్, వద్ది సురేష్, ఏవో టి.అబ్రహం లింకన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదినం

దర్శి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను దర్శిలో కూటమి నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ కేకు కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ హీరో చిరంజీవి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ దారం నాగవేణి, సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె.వెలుగొండారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, జనసేన కార్యాలయంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పామూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మొక్కలునాటి సంరక్షించాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శివరామకృష్ణ అన్నారు. తద్వార పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. శుక్రవారం మండలంలోని దూబగుంట కొండ ప్రాంతంలో ఐటీసీ సౌజన్యంతో ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా కొండ దిగువన విత్తనాలు చల్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ .బ్రహ్మయ్య, ఏపీడీ భాస్కరరావు, ఏపీవో బి.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా దేవదాయ, ధర్మాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం భైరవకోన దేవస్థానాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోలు నరసింహబాబు, వంశీకృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవేశ్వర స్వామి దేవస్థాన క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, ట్రస్టుబోర్డు చైర్మన్ ముప్పాల శ్యాంసుందర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు బీమా చెక్ అందజేత

పీసీపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి మృతి చెందిన మహిళ భర్తకు టీడీపీ బీమా చెక్కును శుక్రవారం నాయకులు అందజేశారు. మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన బొట్టే యోగయ్య, కొండమ్మ దంపతులు. ఇటీవల నెల్లూరు జిల్లా వరికుంటపాడు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో కొండమ్మ మృతిచెందింది. ఆమె తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉంది. ఈవిషయాన్ని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ. 5లక్షల బీమా మంజూరు చేయించారు. ఈచెక్కును టీడీపీ నాయకులు శుక్రవారం భట్టుపల్లికి వెళ్లి మృతురాలు కొండమ్మకు నామినీగా ఉన్న ఆమె భర్త యోగయ్యకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేంద్రబాబు, ప్రతాప్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, జోసెఫ్, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. దొడ్డవరం, ఇలపావులూరు మధ్య విద్యుత్తులైన్ ఏర్పాటుదృష్ట్యా గుళ్లాపల్లి వద్ద సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దీంతో తాళ్లూరు, శివరాంపురం, మాధవరం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని కొర్రపాటివారిపాలెం, శివరాంపురం, రజానగరం, తాళ్లూరు, వితలాపురం, కొత్తపాలెం, మాధవరం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఆతర్వాత రాత్రి 7 నుంచి ఆదివారం ఉదయం వరకు విద్యుతు సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ అధికారులకు రైతులు సహకరించాలని ఆయన కోరారు.

మొక్కుబడిగా మండల సమావేశం

వెలిగండ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వెలిగండ్ల మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎంపీపీ రామన మహాలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశానికి మండల పరిధిలో పది ఎంపీటీసీ సభ్యులకు గాను నలుగురు, 21 సర్పంచ్‌లకు గాను ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. వివిధ శాఖల అధికారుల్లో ఎక్కువమంది గైర్హాజరయ్యారు. సమావేశంలో కనీసం అభివృద్ధి పనులపై సమీక్ష జరగలేదు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారం గురించి కూడా ఆరా తీయలేదు సమావేశంలో ఎంపీడీవో మహబూబ్ బాషా, రామణ తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కనిగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాలని మానవతా సంస్థ ప్రతినిధి సోమిశెట్టి శ్రీనివాసులు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉత్తమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విజేత విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి అరుణోదర్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, మాంటిస్సోరి పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్వామిత్వ సర్వేలో వేగం పెంచాలి : కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేలో వేగం పెంచి త్వరగా హక్కు పత్రాలు అందజేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై శుక్రవారం అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో డ్రోన్‌సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వేలో తలెత్తే వివాదాలు, అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రజలకు తమ ఆస్తులపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని తద్వారా వారు బ్యాంక్‌ల నుంచి సులభంగా రుణాలు పొందవచ్చు అని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ కనక ప్రసాద్, ఆర్డీవో పి.గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల డిపోలో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

స్త్రీశక్తితో మహిళల్లో సంతోషం

బాపట్లలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన స్త్రీశక్తి పథకం సజావుగా కొనసాగుతుందని ఉచిత ప్రయాణంపై మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. శుక్రవారం ఆయన బాపట్ల డిపో, గ్యారేజిలను సందర్శించి డిపోలో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. ఉచిత బస్సు సర్వీసులపై డిపోలోని ప్రయాణికులు రమాదేవి, పూజామణిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంపై ముందస్తుగా అధ్యయనం చేసి పొరపాట్లు జరగకుండా అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆదా అవుతుందన్నారు. స్త్రీ, పురుషుల నిష్పత్తి గతంలో 40-60గా ఉండేదని, ఉచిత ప్రయాణంతో అది 65-35గా మారిందన్నారు. దీనివల్ల ఆర్టీసీకి ఆదాయం తగ్గినా మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మహిళా ప్రయాణికులకు త్వరలో స్మార్ట్‌కార్డులు అందజేస్తామని, వాటితో ఆధార్‌కార్డుతో అవసరం లేకుండా ప్రయాణించవచ్చన్నారు. బస్టాండ్లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ పరిశుభ్రత, ప్రయాణికులు కూర్చొనేందుకు సీట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో డి.సామ్రాజ్యం, ఈడీ నాగేంద్రప్రసాద్, ఇన్‌చార్జి డీఎం జె.శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ గ్యారేజిని పరిశీలించి కార్మికులతో కూడా సమావేశమయ్యారు.



డిపోలో వసతులను పరిశీలిస్తున్న ద్వారకా తిరుమలరావు

సర్‌ఛార్జి.. పెండింగ్

- 1172 పంచాయతీలకు రూ.30 కోట్లు..
- నెలలు తరబడి నిలిచిపోయిన చెల్లింపులు
- సర్‌ఛార్జి కోసం స్థానిక సంస్థల ఎదురుచూపు
- సీఎఫ్ఎంఎస్‌తో నిధుల విడుదలకు అంతరాయం

ప్రభుత్వం నుంచి నిధులు రాక.. ఆర్థిక సంఘం నిధుల విడుదలలో జాప్యంతో.. న్యాయబద్ధంగా రావాల్సిన సర్‌ఛార్జి కూడా అందక పంచాయతీలు ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక సంస్థల ప్రధాన ఆదాయ వనరుల్లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వచ్చే సర్‌ఛార్జి(ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) ముఖ్యమైనది. ప్రతి రిజిస్ట్రేషన్‌లోనూ వసూలు చేసే 1.5 శాతం సర్‌ఛార్జిని జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు జమ చేయాలి. గతంలో రిజిస్ట్రార్లు ఎప్పటికప్పుడు లెక్కలు వేసి దామాషా పద్ధతిలో చెల్లింపులు చేసేవారు. సీఎఫ్ఎంఎస్(కాంప్రహెన్సివ్ ఫైనాన్స్ సిస్టం) అమల్లోకి వచ్చిన తర్వాత ఆ స్టాంప్‌డ్యూటీ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి వెళ్తుంది. అక్కడ నుంచి స్థానిక సంస్థలకు చెల్లింపులు జరగాలి. అయితే ఈ ప్రక్రియ సక్రమంగా జరగడంలేదు. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలకు సర్‌ఛార్జి ఎంత బకాయి ఉన్నదో చెప్పేందుకు కూడా రిజిస్ట్రేషన్ శాఖ తటపటాయిస్తోంది.

జడ్పీకి రూ.28 కోట్ల బకాయి

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు సర్‌ఛార్జి చెల్లింపులు పెండింగ్ పెట్టారు. ఆరేళ్ల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు సర్‌ఛార్జి రూపేణా సుమారు రూ.65 కోట్ల వరకు రావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం రూ.37 కోట్లు మాత్రమే చెల్లించినట్లు లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన రూ.28 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అసలు ఏ సంవత్సరం వరకు సర్‌ఛార్జి జమ అయ్యిందో కూడా సమాచారం లేదని సంబంధిత పాలకవర్గాలు వాపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 గ్రామ పంచాయతీలకు సర్‌ఛార్జి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పంచాయతీలకు ఏడాదిగా సర్‌ఛార్జి రాలేదు. గ్రామ పంచాయతీలకు సుమారు రూ.30 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. సర్‌ఛార్జి నిధులు జమ కాకపోవడంతో పంచాయతీల్లో కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులతో పాటు ఇతర కార్యకలాపాలు జరగని దుస్థితి నెలకొంది.

మాదేమీ లేదంటున్న రిజిస్ట్రార్లు

సర్‌ఛార్జి చెల్లింపుల కోసం జిల్లా రిజిస్ట్రార్లను పలువురు సర్పంచ్‌లు కలుస్తున్నారు. నిధులు జమలో తమకు సంబంధం లేదని ఐజీ (మిగతా 6వ పేజీలో)





శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం చందోలులోని శ్రీబగళాముఖి అమ్మవారిని శ్రావణ స్కందమాతగా అలంకరించారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆవులదొడ్డికొత్తగొల్లపాలేనికి రూ.25 లక్షలు మంజూరు



చినగంజాం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు హామీతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో పెదగంజాం పంచాయతీ ఆవులదొడ్డికొత్తగొల్లపాలెంలో ఏళ్లనాటి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. డీఎంఎఫ్ నిధులను రూ.25 లక్షలు మంజూరు చేస్తూ కలెక్టర్ జె.వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేశారు. పేదల సేవలో భాగంగా 2025 ఏప్రిల్ 1న ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం పర్యటన సమయంలో గ్రామం లోని నీటి సమస్యను ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కోరారు. దీనికి స్పందించిన సీఎం నిధులు మంజూరు చేయాలని అధికారులను అప్పట్లో ఆదేశించారు. ఈ క్రమంలో తాజాగా విడుదలైన నిధులతో ఇంటింటికి తాగునీరు అందేలా పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు. పనులు పూర్తి అయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

భూగర్భ జలమట్టాలు పెరగాలి

- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భజలమట్టాలు పెరిగేవిధంగా అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. జలవనరులు, భూగర్భజలశాఖాధికారులతో శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోస్తా జిల్లా అయిన బాపట్ల ప్రాంతంలో భూగర్భజలమట్టం తగ్గుముఖం పట్టటం పర్యావరణానికి మంచిదికాదన్నారు. పూడికతీత పనులు చేపట్టి, కాల్వలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి భూగర్భజలాలను పెంచాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని కొండల అంచుల వద్ద ఇంకుడుగుంతలు, పంటగుంతలు నిర్మించాలన్నారు. ఉపాధి నిధులను అనుసంధానిస్తూ ఆయా పనులు చేపట్టాలన్నారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో పంట కాల్వల మధ్యలో బోర్లలు వేసి భూగర్భజలాలు పెరగడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇసుకతవ్వకాలతో కృష్ణానదీ తీరంలోని కొల్లూరు మండలంలోను భూగర్భజలమట్టం తగ్గుతుందని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. బాపట్లలో తాగునీటి చెరువు కట్ట బలోపేతం, పూడికతీత పనులకు రూ.8 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి తక్షణమే పంపాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జలవనరులశాఖ ఎస్ఈ అబూతలీమ్, భూగర్భజలశాఖ ఏడీ సురేష్, డ్వామాపీడీ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ.15 లక్షల సొత్తు, రెండు బైకులు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు, ఎస్ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే వ్యసనాలతో చోరీలను ఓ అలవాటుగా చేసుకున్న కత్తి రవికుమార్ అనే అంతర్ జిల్లా దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన రవికుమార్‌ను బల్లికురవ పోలీసు స్టేషన్‌లో మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు ప్రకటించారు. చిల్లర దొంగతనాలకు అలవాటు పడి పలు కేసుల్లో జైలుకు వెళ్లడం, బెయిల్‌పై వచ్చి మళ్లీ దొంగతనాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో జైలు నుంచి వచ్చిన రవికుమార్ తూర్పు గోదావరి జిల్లా పెదపాడులో చోరీలు చేస్తుండగా పట్టుబడి జైలుకు వెళ్లి ఈ నెల 1న విడుదలయ్యాడు. ఆ తర్వాత 4న పల్నాడు జిల్లా నాదెండ్లలో, 5న బాపట్ల జిల్లా బల్లికురవ మండలం రామాంజనేయపురంలో, 15న తూర్పుగోదావరి జిల్లాలో, 17న కర్నూలు జిల్లాలో చోరీలకు పాల్పడ్డాడు. రామంజనేయపురం గ్రామంలో జరిగిన చోరీ కేసులో బల్లికురవ, సంతమాగులూరు ఎస్ఐలు వై.నాగరాజు, పట్టాభిరామయ్యలు రెండు బృందాలుగా ఏర్పడి విచారణ క్రమంలో దొంగను గొర్రెపాడులో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 102 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు అద్దంకి కోర్టుకు హాజరు పరిచారు. అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసిన డీఎస్పీ రామాంజనేయులు, సీఐ వెంకట్రావు, ఎస్ఐలు వై.నాగరాజు, పట్టాభిరామయ్యలకు ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

- నేతన్నల నుంచి భారీగా దరఖాస్తులు
- షెడ్డు కార్మికులకూ వర్తింపజేసేందుకు కసరత్తు
- గుంటూరు జిల్లాలో 2,460, పల్నాడులో 280 మంది గుర్తింపు
- బాపట్ల జిల్లాలో 7 వేలకు పైగా కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఊరట కల్పించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఈ నెల 7న మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ రోజు నుంచే పథకం అమలు లోకి వస్తుందని ప్రకటించిన విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ముమ్మరంగా సాగుతోంది. ఈ ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేస్తున్నారు. చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయ పర్యవేక్షణలో లబ్ధిదారుల జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. చేనేత కార్మికులుగా గుర్తింపు ఉన్న కార్మికుల ఇళ్లకు వెళ్లి వాళ్ల వివరాలను సేకరిస్తున్నారు. చేనేత గుర్తింపు కార్డు కలిగి ఉండడం, ఇళ్లలో చేనేత మగ్గం ఉండడం ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తెనాలి, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం (మిగతా 6వ పేజీలో)

దొరికితేనే దొంగలు

- యథేచ్ఛగా గ్రానైట్ దందా
- అధికారులకు ముడుపులతో అక్రమ రవాణా
- ఏటా రూ.250 కోట్ల ఆదాయం కోల్పోతున్న గనులశాఖ

అద్దంకి/బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ దందాలో దొరికితేనే దొంగ.. లేదంటే దొరలాగా వెళ్లిపోతున్నారు. బిల్లులు లేకుండా యథేచ్ఛగా అక్రమంగా రవాణా జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా ఉండటంతో గ్రానైట్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి ఎగుమతి చేసే గ్రానైట్ శ్లాబులకు రాయల్టీ, జీఎస్టీ, ఇతర రుసుములు కలిపి సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. రాష్ట్ర సరిహద్దు దాటితే బిల్లులతో పని ఉండదు. ప్రభుత్వానికి రోజుకు రూ.70 లక్షల చొప్పున నెలకు రూ.20 కోట్లు ఏడాదికి రూ.250 కోట్ల ఆదాయం గనులశాఖ కోల్పోతుంది. బిల్లులు లేకుండా రాష్ట్ర సరిహద్దు దాటించేందుకు గత దశాబ్ద కాలంగా ప్రత్యేకంగా బృందాలు ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దీనిని ఓ వృత్తిగా ఎంచుకోగా కూటమి ప్రభుత్వంలోనూ అదే పంథా కొనసాగుతుంది. నిత్యం 100కు పైగా గ్రానైట్ శ్లాబుల లారీలు ఇక్కడి నుంచి వెళ్తుండగా వాటిలో బిల్లులు ఉన్నవి పట్టుమని పది కూడా ఉండవు. బిల్లులు లేకుండా లారీని సరిహద్దు దాటించే బృందానికి గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని రూ.40 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. రూ.20 వేలను ఆ బృందాలు వివిధ శాఖల అధికారులకు మామూళ్లుగా సమర్పించి గ్రానైట్ లారీలను అడ్డుకోకుండా చేస్తారని తెలిసింది. ఇలా ఒక్కో ముఠా ఐదారు లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తుంటుంది. అంటే ఒక్కో ముఠాకు రోజుకు కనీసం రూ.లక్ష మిగులుతుండగా గ్రానైట్ యజమానికి ఒక్కో లారీ ద్వారా రూ.40 వేల పన్నులు ఆదా అవుతాయి. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలతో సరిపెడుతుంటారు. ఎప్పుడైనా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు మాత్రం గ్రానైట్ శ్లాబుల లారీలపై కేసులు నమోదు చేస్తుంటారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం బల్లికురవ మండలంలో రెండు శ్లాబుల లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



బల్లికురవ పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడ్డ గ్రానైట్ శ్లాబుల లారీలు

సదరం కోసం పడిగాపులు

- రేపల్లె ఆస్పత్రికి తరలివచ్చిన దివ్యాంగులు
- క్యాంపుపై సమాచారం లేదన్న డీఎంహెచ్‌వో

రేపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్లు నిలిచిపోయిన బాధితులు తిరిగి సదరం సర్టిఫికెట్ కోసం వ్యయప్రాయాలకు ఓర్చి ఆస్పత్రికి రాగా అసలు ఆ సమాచారమే తమకు లేదని వైద్యాధికారులు ముఖం చాటేశారు. దీంతో దివ్యాం గులు పడిగాపులతో వెనుతిరగాల్సి వచ్చింది. రేపల్లె పరిధిలోని సచివాలయ సిబ్బందికి.. వైద్యాధికారులకు మధ్య సమన్వయం కొరవడంతో దివ్యాంగులు తిప్పలు పడాల్సి వచ్చింది. ఇటీవల ప్రభుత్వం దివ్యాంగ పింఛన్లలో అనర్హులను తొలగించింది. వారిలో అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో పింఛన్లు నిలిచిపోయిన వేమూరు నియోజకవర్గ పరిధిలోని బాధితులు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంప్‌నకు వెళ్లి పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లను అందిస్తే పింఛన్లు పునరుద్ధరణ జరుగుతుందని సచివాలయాల సిబ్బంది బాధితులకు నాలుగు రోజుల క్రితం సూచించారు. దీంతో సుమారు 50 మంది బాధితులు ఆయా ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయప్రాయాసలకు ఓర్చి శుక్రవారం రేపల్లె ప్రభుత్వవైద్యశాలకు చేరుకున్నా రు. ఎంతసేపటికీ వైద్యులు రాకపోవడంపై ఆస్పత్రిలోని సిబ్బందిపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంపుపై తమకు ఆదేశాలు రాలేదని తాము ఏమీ చేయలేమని స్థానిక వైద్యులు చెప్పారు. సచివాలయ సిబ్బంది ఇక్కడ సదరం క్యాంపు ఉందని చెప్తేనే వచ్చామని వరికూటి వెంకటనారాయణ, వెంకటేశ్వరమ్మ, పీతల కిరణ్ తదితరులు తెలిపారు. ఎన్నో ఇబ్బందులు పడి వస్తే ఎవరూ స్పందించలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో విజయమ్మను వివరణ కోరగా క్యాంపుపై తమకు కనీస సమాచారం కూడా లేదని, మూడురోజుల తర్వాత అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో వేచి చూస్తున్న బాధితులు



దివ్యాంగురాలు



నోటీసును చూపిస్తున్న వెంకటేశ్వరమ్మ

ఇస్కాన్ ఆధ్వర్యంలో పాదయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇస్కాన్ పాదయాత్ర బృందం శుక్రవారం మార్కాపురం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జవహర్‌నగర్ కాలనీలోని ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం నుంచి మహా హరి నామ సంకీర్తన చేస్తూ ప్రధాన వీధుల్లో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం వరకు చేరుకున్న తర్వాత అక్కడ మహాహారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఇస్కాన్ ఆల్ ఇండియా పాదయాత్ర అధ్యక్షుడు స్వామీజీ శ్రీమాన్ ఆచార్య ప్రభూజీ ప్రవచనం ఇచ్చారు.

చెంచు కుటుంబానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో పరామర్శ

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజివారి పల్లి పంచాయతీ పరిధిలోని శాంతి నగర్ గిరిజన గూడెంలో నివాసం ఉంటున్న పులిచెర్ల చిన్న దేవయ్య అనే వ్యక్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి గూడెంలోని మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. వారితో మాట్లాడి మృతుని మట్టి ఖర్చుల కోసం రూ. 5వేల రూపాయలను ఆయన వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట వైద్యులు కోటానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్‌చార్జి.. పెండింగ్

(5వ పేజీ తరువాయి)

అనుమతి ఇస్తే నిధులు జమవుతాయని వారు సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తుంది. ఐజీ అనుమతి ఇవ్వాలంటే ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని సమాచారం.

అప్పుల్లో కూరుకుపోతున్నాం

గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం విడుదల చేసి ఎనిమిది నెలలు దాటింది. కానీ ఇంతవరకు గ్రామ పంచాయతీలకు జమ చేయలేదు. గ్రామాల్లో ఏ చిన్న అవసరం వున్నా అప్పు చెయ్యాల్సి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న సర్‌చార్జి నిధుల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సంవత్సరం నుంచి సర్‌చార్జి రాలేదని గుంటూరు జిల్లా వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలితకుమారి తెలిపారు.

కబడ్డీ కోచ్ దుర్గాప్రసాద్ మృతికి సంతాపం


దుర్గాప్రసాద్ (ఫైల్)

ఒంగోలు(రూరల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, కబడ్డీ కోచ్ దుర్గాప్రసాద్ శుక్రవారం అనారోగ్యంతో చీరాలలో తన స్వగృహంలో మృతి చెందడంపై జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్య క్షుడు కుర్రా భాస్కరరావు, ఇతర సభ్యులు తమ ప్ర గాఢ సంతాపం వ్యక్తం చేశారు. దుర్గాప్రసాద్ గత 30 సంవత్సరాలుగా కోచ్‌గా ఎందరో క్రీడాకారులను తయారు చేశారని కొనియాడారు. కాకినాడలోని స్పోర్ట్స్ హాస్టల్ కోచ్‌గా ఉండి విద్యార్థులను క్రమశిక్షణ గల క్రీడాకారులు తీర్చిదిద్దారని చెప్పారు. అంతేగాకుండా ప్రకాశం జిల్లా డీఎస్‌డీవోగా పని చేశారన్నా రు. ఆయన లేని లోటు క్రీడాకారులకు తీరని లోటని పేర్కొన్నారు.

వంద ఉపన్యాసాల కన్నా ఒక్క పాట శక్తివంతమైంది

ప్రజా కళాకారులు దేశంలోని రుగ్మతలపై సాంస్కృతికోద్యమం నిర్వహించాలి : సీపీఐ రామకృష్ణ

హాజరైన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఏపూరి సోమన్న

ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వంద ఉపన్యాసాల కన్నా ప్రజా కళాకారుని ఒక పాట ఎంతో శక్తివంతమైనదని, ప్రజలను చైతన్యపరుస్తూ దూసుకుపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. సీపీఐ వందేళ్ల పండుగను పురస్కరించుకుని ఒంగోలులో ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించననున్న సభలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రామకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశం నేడు క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. అటువంటి పరిస్థితుల్లోనూ డాక్టర్ అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగం గొప్ప స్ఫూర్తితో నిలుస్తోందన్నారు. బీజేపీపై వామపక్ష పార్టీలు సాగిస్తున్న పోరాటంలో ప్రజా కళాకారులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. ఈ సందర్భంగా సినీ దర్శకులు బాబ్జీ మాట్లాడుతూ తాము ఇంత గొప్ప స్థాయిలో ఉండటానికి ప్రజా నాట్యమండలినే కారణమన్నారు. ప్రజా వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, ఏపూరి సోమన్న ఆట, పాట, మాట ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నాయక్, కార్యదర్శులు చిన్నం పెంచలయ్య నాగరాజు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో నేటికీ కొనసాగుతున్న అంటరానితనం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమాజంలో అంటరానితనం నేటికీ కొనసాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలు ఆవరణలో జరుగుతున్న మూడో పుస్తక ప్రదర్శన కేంద్రాన్ని శుక్రవారం రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై దేవరాజు మహారాజు రచించిన హిందూత్వం సింహాసనంపై అబద్దాల చక్రవర్తి అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంకా కులం, మతం అనే పేరుతో విభజన రేఖ ఉందన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం త్వరలో మనం జపాన్‌ని అధిగమిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర పబ్లిక్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి రచించిన వాడు-నేను అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విజయవాడ పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు కే లక్ష్మయ్య, మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

నల్లమలలో ఏం జరుగుతోంది?

చెక్‌పోస్టు దాటి తవ్వకాలకు ఎలా వెళ్ళారనేది ప్రశ్న

మూడు రోజులుగా మూడు వాహనాలతో పనులు

అసలు సూత్రధారులు ఎవరు

ఉద్యోగులు, నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యంలో అసలు ఏమి జరుగుతుందో తెలియన పరిస్థితిలో ఫారెస్టు అధికారులు ఉన్నారా? అంటే నిజమే అన్నట్లు ఉంది. ఎర్రగొండపాలెం మండంలోని గంజివారి పల్లి రెంజ్ పరిధిలోని చెన్నుపల్లి గూడెం సమీపంలోని విరుడుగుంట ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు అక్కడికి వెళ్ళి ఎక్స్‌కవేటర్, జీపు స్వాధీనం చేసుకోని ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రాంతంలోకి వారు ఎలా వెళ్ళారు.., ఎన్ని రోజులుగా తవ్వకాలు చేస్తున్నారు.., దానికి గల సూత్రధారులు ఏవరు అనేది విచారణలో తెలియాల్సి ఉంది.

చెక్ పోస్టులు దాటి ఏలా వెళ్లారు

గంజివారిపల్లి రెంజ్ పరిధిలో నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్ళాలంటే గాంధీనగర్ గూడెం వద్ద ఫారెస్టు అధికారులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఏ వాహనం వెళ్ళాలన్న, రావాలన్నా ఈ చెక్ పోస్టు దాటి వెళ్ళాల్సిందే. మరి ఈ రెండు (మూడు వాహనాలు అని ప్రచారం) వాహనాలు ఏలా వెళ్ళాయి... ఏవరు పంపించారు అనేది ప్రశ్నగా ఉండగా ఇందులో ఫారెస్టు అధికారుల హస్తం కూడా ఉందా అనేది అనుమానంగా ఉంది.

మూడు రోజులుగా తవ్వకాలు

అయితే ఈ ప్రాంతంలో మూడు రోజులుగా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మూడు రోజులుగా తవ్వకాలు జరుగుతుంటే ఫారెస్టు అధికారులకు తెలియకుండా ఉందా, కనిపించ లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.


తవ్వకాలు చేసిన ప్రాంతంలో మట్టి గుంతలు(ఫైల్)


ఫారెస్టు కార్యాలయంలో ఉన్న వాహనాలు (ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగుల హస్తం

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాలకు సంబంధించి ఎర్రగొండపాలెం మండలంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల హస్తం ఉందని జోరుగా మండలం వ్యాప్తంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దానికి గల కారణం తవ్వకాలకు వినియోగించిన వాహనంలో ఓ వాహనం ప్రభుత్వ ఉద్యోగిదని సమాచారం. అంతే కాకుండా ప్రజాప్రతినిధులు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్స్‌కవేటరుకు డీజిల్ కొట్టించే సమయంలో ఓ నాయకున్ని పలువురు చూసినట్లు తెలుస్తోంది. అత్యాస కోసం ఇటు ప్రభుత్వ ఉద్యోగులు, నాయకులు ఇలాంటి పురాతన దేవాలయాల్లో తవ్వకాలు చేస్తుంటే ఇంక వాటిని కాపాడేదేవరంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇద్దరు నిందితులు దొరికితే వాహనాలు ఎవరివో..దానికి సుత్రధారులు ఎవరో అధికారులు తెలసుకోలేక పోతున్నారా అంటూ ప్రజలు గుసగుసలాడున్నారు. దీనిపై రేంజర్ ప్రసన్న జ్యోతి, ఎఫ్ఎస్ఓ కరిముల్లాలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఏది ఏమైనా దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే చాల విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.

ఉచిత విద్యుత్‌కు.. సర్వే

(5వ పేజీ తరువాయి)

సహా చుట్టుపక్కల ఉన్న చేనేత గ్రామాలు, చెరుకుపల్లి, పేటేరు, ఇసుకపల్లి, వరపర్ల పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ దరఖాస్తుల కోసం సచివాలయాల వద్ద బారులు తీరుతున్నారు. కాగా ఇప్పటికే మూడు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చింది. అర్హుల జాబితా ఇప్పటికే చేనేత, జౌళిశాఖ కార్యాలయాలకు చేరినట్లు సమాచారం. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 2,460 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. మంగళగిరి, పరిసర ప్రాంతాల్లో ఎక్కువమంది షెడ్డుల్లో నేసే కార్మికులు ఉన్నారు. వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్న డిమాండు వినిపిస్తోంది. దీనిపై మంత్రి లోకేశ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాగా పల్నాడు జిల్లాలో 280 మంది మాత్రమే అర్హులుగా ఉన్నట్లు తేలింది. అయితే బాపట్ల జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 7వేల పైచిలుకే ఉండే అవకాశం కనిపిస్తోంది. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పొందినవారి సంఖ్యే 7వేల పైచిలుకు ఉంది. అయితే అట్టడుగు వర్గానికి చెందిన కార్మికులను నేతన్న నేస్తం లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదు. అలాంటివారు కూడా ఇప్పుడు ఉచిత విద్యుత్ స్కీముకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వారిని కూడా కలుపుకుంటే మూడు జిల్లాల్లో ఈ సంఖ్య మరో ఐదువేల వరకూ పెరిగే అవకాశం కనిపిస్తోంది.

క్విస్‌లో 110మంది రక్తదానం


ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్, బ్రహ్మకు మారీస్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ రక్త దాన శిబిరం జరిగింది. సుమారు 110 మంది విద్యార్థులు స్వచ్ఛంధంగా రక్తదా నం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. దాది ప్రకా శమణి 18వ వర్ధంతి సందర్భంగా భారత, నేపాల్‌లలో ఒకే రోజు 2 లక్షల యూనిట్ల రక్తం సేకరించారన్నారు. రక్తసేకరణలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికా ర్డులో స్థానం సాధించినట్లు బ్రహ్మకుమారీస్ తెలిపారు. విద్యార్థుల్లో సేవాభా వం పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఎగ్జి క్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో నవనీత్ కృష్ణన్, రేవతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడిపై దాడి చేసిన వైసీపీ నేత

అవీఇవీ

బాధితుడిని పరామర్శించిన ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్


చికిత్స పొందుతున్న ఎర్రన్నను పరామర్శిస్తున్నదారునాయక్

కంభం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశాడన్న కారణంతో దాసరి చిన్న ఎర్రన్న అనే గిరిజనుడిపై వైసీపీకి చెందిన ఎక్కుడి బాదరయ్య ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన గురువారం రాత్రి అర్ధవీడు మండలం బొమ్మిలింగం చెంచు కాలనీలో జరిగింది. అర్ధవీడు పోలీసుల కథనం ప్రకారం బొమ్మిలింగం చెంచు కాలనీకి చెందిన దాసరి చిన్న ఎర్రన్న తెలుగుదేశం పార్టీ అభిమాని కాగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బాదరయ్య చెంచు కాలనీకి వెళ్లి వైసీపీకి ఓటు వేయండని బెదిరించాడు. అయితే కాలనీలోని దాసరి ఎర్రన్నతోపాటు పలువురు చెంచులు టీడీపీ అభ్యర్థికి ఓటు వేశారు. దీనిని మనసులో పెట్టుకున్న బాదరయ్య గురువారం రాత్రి దాసరి చిన్న ఎర్రన్నపై ఆగ్రహం వ్యక్తం చేయడమేగాక తాను వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన ఎర్రన్నను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరచారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

ఎర్రన్నను పరామర్శించిన ఎస్టీసెల్ ర్రాష్ట అధ్యక్షుడు

చెంచు కాలనీకి చెందిన దాసరి చిన్న ఎర్రన్నపై వైసీపీ నాయకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని, ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఎర్రన్నను పరామర్శించారు. అనంతరం దారు నాయక్ మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన ఎర్రన్నపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వైసీపీ నాయకుడు బాదరయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అర్ధవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావులతో పొంచి ఉన్న ప్రమాదాలు

పలు గ్రామాలలో వినియెగంలో లేని పురాతన నేలబావులు

సీసీ రోడ్లు వేయటంతో రోడ్డు అంచున ఉన్న బావులతో ప్రజలు బెంబేలు


కూకట్లపల్లి గ్రామంలో రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న నేలబావి

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలంలో ప్రజల దాహార్తి తీర్చిన నేల బావులు ఇప్పుడు పాడుపడిపోయి ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గ్రామాలలో చిన్నారులు, వాహన చోదకులు రాత్రుళ్ల రోడ్ల వెంబడి వెళుతుంటే ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్నిసార్లు బావులు అక్కడ ఉన్నాయన్న సంగతి కూడా మరిచి పోతున్నామని అంటున్నారు. మండలంలోని గొర్రెపాడు గ్రామ సెంటర్‌లో రోడ్డు పక్కనే ఉన్న పురాతన బావితోపాటు చుట్టూ చిల్లచెట్లతో నిండి ఉంది. ఆ బావితో ప్రజలు ప్రతి రోజూ భయాందోళన చెందుతున్నారు. పశువులు, చిన్నారులు అటు వైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. అలానే కూకట్లపల్లి గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డు అంచునే పురాతన బావి రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ బావుల్లో నీరు కూడా లేదు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న పురాతన బావులను పూడ్చి వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బడి బయటఉన్న విద్యార్థులను స్కూలులో చేర్పించాలి


ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు చొరవ చూపాలి

బాపట్ల జిల్లా డీఈవో యస్.పురుషోత్తం


పర్చూరులో మాట్లాడుతున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

పర్చూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి యస్. పురుషోత్తం చెప్పారు. దీంతోపాటు డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థులను కూడా వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఈనెల 25వ తేదీలోపు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. శుక్రవారం చీరాల డివిజన్ పరిధిలో ప్రధానోపాధ్యాయుల సమావేశం స్థానిక రోటరీ భవనంలో జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఎఫ్-ఏ 1 మార్కులు 25వ తేదీలోపు నమోదు చేయాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ప్రతి తరగతికి ఒకటి చొప్పున (6 నుంచి10వ తరగతులు) 31వలోపు పూర్తిచేయాలని చెప్పారు బెస్ట్ టీచర్ అవార్డుకు నామినేషన్‌లు 24లోపు పంపించాలన్నారు. విధిగా ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గంగాధర్, ఎంఈవో శివకోటేశ్వరరావు, పి.వెంకట్రామయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచు గూడాలలో నీటి సమస్యకు పరిష్కారం


చేతి పంపునకు మరమ్మతులు చేసి పరిశీలిస్తున్న సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి గిరిజన గూడెంలో మరియు పందివానిపల్లి లో చెంచు కుటుంబాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ వారు శుక్రవారం సమస్యను పరిష్కారం చూపారు. ఆయా గూడాలలో నీటి ఎద్దడి విషయం తెలుసుకున్న సంస్థ ఎర్రగొండపాలెం కో ఆర్డినేటర్ డి వెంకట్రావు అధికారులు, నాయకులు దృష్టికి తీసుకెళ్ళారు. వారి సహాయ సహకారాలతో ఆ రెండు ప్రాంతాలలో నీటి సరఫరా చేసి నీటి సమస్యను తీర్చినట్లు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్‌లు డి సుబ్బారెడ్డి, అరుణా బాయ్, పంచాయితీ కార్యదర్శి రామ సుబ్బయ్య, మరియు సంస్థ సిబ్బంది బి కామ్లానాయక్, డి బాల లక్ష్మీ బాయ్, ఆయా గ్రామాల విటిడిఏ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రెర్రగా..

- నేడు భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు రాజా, నారాయణ
- రేపు, ఎల్లుండి ప్రతినిధుల సభలు

ఒంగోలు వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్రమహాసభలకు ఆ పార్టీశ్రేణులు, ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి సంస్థాగతంగా సీపీఐ గ్రామస్థాయి నుంచి అఖిలభారత స్థాయి వరకు మహాసభలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహాసభలు పూర్తికాగా ఈనెల 23 నుంచి 25 వరకు రాష్ట్రమహాసభలు జరుగుతున్నాయి.

ఒంగోలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మూడ్రోజులుపాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాభలకు నగరం ముస్తాబైంది. మూడేళ్ల రాష్ట్రంలో ఆ పార్టీ నిర్వహించిన కార్యక్రమాల సమీక్ష, రాష్ట్రంలో, దేశంలో ప్రస్తుత రాజకీయపరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించి వచ్చేమూడేళ్ల చేపట్టనున్న భవిష్యత్ కార్యచరణను రూపొందించనున్నారు. రానున్న మూడేళ్ల పాటు పార్టీని నడిపించే నూతన నాయకత్వ ఎన్నిక కూడా ఈ మహాసభల్లో జరగనుంది. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి మహాసభలకు అధిక ప్రాధాన్యత ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో ఘన కీర్తి

ఉమ్మడి జిల్లాలో సీపీఐకి గతంలో ఘన కీర్తి ఉంది. ప్రస్తుతం దీనికోసం ఆరాటపడుతున్నప్పటికీ జాతియోద్యమ కాలం నుంచే ఉమ్మడి జిల్లా పరిధిలో కమ్యూనిస్టు ప్రభావం అధికంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతాల్లో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి బీజం పడింది. 1937లో కొత్తపట్నంలో జరిగిన రాజకీయ పాఠశాల కాగా ఆ పాఠశాల ఒంగోలు ప్రాంతంలో ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు భావాజాలంతో ఉన్నవారి సహకారంతోనే జరిగింది. అనంతర కాలంలో కూడా ఉమ్మడి జిల్లాలో సాగు, తాగు, నీరు, భూసమస్యల పరిష్కారం, అంటరానితనం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, రైతులు, వ్యవసాయ కార్మికుల పక్షాన నాటి కమ్యూనిస్టు నేతలు ముందుండి పోరాడారు. ఒకప్పుడు జిల్లాలోని వివిధ శాసనసభ స్థానాల నుంచి కమ్యూనిస్టు నేతలు ప్రాతినిథ్యం వహించారు. నాటి నందికొండ (నాగార్జునసాగర్) ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న వెలిగొండ ప్రాజెక్టు వరకు సీపీఐ నాయకత్వాన చేపట్టిన పోరాటాల ఫలితం అన్నది నేటి తరానికి అవగాహన లేకపోయినా చరిత్రలో గుర్తించగల అంశాలు. అలాంటి వారస్వం ఉన్న పార్టీ నేడు బలహీనపడి ఉనికి కోసం ఆరాటపడే స్థితికి చేరింది.

నగరంలో తొలిసారి మహాసభలు

నాటిపోరాట చరిత్రకు కేంద్రంగా ఉన్న ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు తొలిసారి జరుగుతున్నాయి. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ ప్రత్యేక గుర్తింపు ఉన్న ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, వామపక్ష, అభ్యుదయ వాదులందరూ ఆప్యాయంగా 'అన్న' అంటూ పిలుచుకునే నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అధ్యక్షుడుగా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో మహాసభల నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.


ఫ్లెక్సీలతో ఎర్రబారిన ఒంగోలు

నగరం ఎరుపుమయం

నగరంలోని ప్రధాన వీధులు, కూడళ్లలో సీపీఐ జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, తోరణాలు, మహాసభలకు వచ్చే అగ్రనాయకులకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా సీపీఐ మహసభల ప్రచారంలో భాగంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్‌రూము అవరణలో ఉత్సాహంగా ప్రజాకళా ఉత్సవాలు సాగుతున్నాయి. మహాసభల తొలిరోజైన శనివారం నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు బస్టాండు సెంటర్ నుంచి అద్దంకి బస్టాండు సమీపంలోని కూరగాయాల మార్కెట్ మైదాన ప్రాంగణం వరకు భారీ ర్యాలీ జరుగుతుంది. అనంతరం అక్కడ బహిరంగసభ నిర్వహిస్తారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా పార్టీశ్రేణులు తరలిరానున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొనున్నారు. ఆది, సోమవారాల్లో నగర సమీపంలోని ఎస్‌వీజీఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరగనుంది. గత పక్షం రోజులుగా జిల్లా సీపీఐ నాయకత్వంతో కలిసి ఆ పార్టీరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జి.ఈశ్వరయ్య నేతృత్వంలో పలువురు యువజన, విద్యార్థిసంఘాల రాష్ట్ర నాయకులు మహాసభ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అవీ..ఇవీ..

పాము కాటుకు గురై రైతు మృతి

● నేరుగా ఆస్పత్రికి వచ్చి అక్కడే కుప్పకూలిన దైన్యం



రైతు వెంకటేశ్వర్లు మృతదేహం

అద్దంకి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు(40) శుక్రవారం ఉదయం పొలానికి పశువుల మేత కోసం వెళ్లాడు. అక్కడ పాము కరవడంతో కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించి, నేరుగా అద్దంకిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వచ్చాడు. అక్కడ వారు వైద్యం నిరాకరించడంతో అదే వాహనం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి అక్కడే కుప్పకూలాడు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎలుకల మందు తిని వ్యక్తి మృతి

● కుటుంబపోషణ భారంగా మారి ఆత్మహత్య

అద్దంకి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): కుటుంబపోషణ భారంగా మారడంతో ఆందోళనతో ఎలుకల మందుతిన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని గరటయ్యకాలనీ 21వ లైన్‌లో నివాసం ఉండే ఓరుపల్లి సుబ్బారావు(45)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. వారి కుంటుంబాల్లో విభేదాలతో వారు కూడా సుబ్బారావు వద్దే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారమై ఈ నెల 20న సుబ్బారావు ఎలుకల మందు తిన్నాడు. ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం ఒంగోలు రిమ్స్ నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ లైన్ పనుల కారణంగా భవానిసెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శనివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

విద్యార్థులు సేవల్లో భాగస్వాములు కావాలి



ఇంట్రాక్టు క్లబ్ విద్యార్థులతో రోటరీ ప్రతినిధులు

బల్లికురవ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రత్యేక క్లబ్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రావి.అంకమ్మచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో మార్టూరు రోటరీ క్లబ్ ద్వారా 20 మంది విద్యార్థులతో కలిసి ఇంట్రాక్టు క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాలలో ఎక్కడైన సేవా కార్యక్రమాలు చేయాలంటే విద్యార్థులను వినియెగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి నాగేశ్వరరావు, గోనుగోంట్ల రవికుమార్, ప్రదానోపాద్యాయులు హనుమంతురావు,రోటేరియన్ గంగాదర్, డేవిడ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గిరిజనులకు ఆర్థిక భరోసా

● ఎస్టీలకు ఉపాధి జాబ్‌కార్డులు పంపిణీ



గిరిజనులకు జాబ్‌కార్డులు అందిస్తున్న ఎంపీడీవో శివన్నారాయణ

తోటవారిపాలెం(చీరాల), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులతో ఎస్టీలకు ఆర్థికభరోసా కలుగుతుందని ఎంపీడీవో శివన్నారాయణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీవో దాసు ఆధ్వర్యంలో మండల పరిధిలోని తోటవారిపాలెం రామయ్య కాలనీలోని 50 ఎస్టీ కుటుంబాలకు ఉపాధి జాబ్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాము, విజయ్‌కుమార్, సుజాత, భారతీ, పావని తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీలో పొగాకు చేయవద్దు

ఇంకొల్లు, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : రానున్న రబీలో ఎవరూ పొగాకు సాగు చేయవద్దని పర్చూరు ఏడీఏ జీబీ ప్రవీణ్ సూచించారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, జొన్న పంటలు సాగుచేయాలన్నారు. మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయకులు సిహెచ్.రమాదేవి పాల్గొని రైతులకు సూచనలు చేసారు. పచ్చిరొట్ట సాగుతో చౌడుభూములు మంచి భూములుగా మారతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల వ్యవసాయాధికారి సరళ, మండల వ్యవసాయాధికారి మేరమ్మ, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 ఎఫ్.వై 2023-24పై మండల స్థాయి అదికారులకు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్ర రావు, ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి స్వామిత్వ సర్వే పారదర్శకంగా చేయాలని తహసీల్దార్ జె.ప్రభాకరరావు గ్రామదర్శులకు సూచించారు. గ్రామాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్‌లు కృషి చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, గ్రామ ఆదాయాలు ఎలా పెంచుకోవాలి, 2025-26 ఆర్‌జీఎస్‌ఎ వార్షిక కార్యచరణ ప్రణాళికపై రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుధాకరరావు, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖ ఏ.ఈలు డి.దాసు, జి.రాజశేఖర్, ఏపివో లక్ష్మిదేవి, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అద్దంకి, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం రోజు దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల నుండి సుమారు 400 మంది మహిళా భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలలో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో పూజా సామగ్రి అందజేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేటపాలెం(చీరాల) : వేటపాలెం మండలం అనుమల్లి పేటలో వేంచేసిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని భక్తులు శాకాంబరి అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. డ్రై ఫ్రూట్స్‌తో సామూహిక పూజలు చేశారు.





వేటపాలెంలో శాకంబరిగా అమ్మవారు, 108చీరాలతో అలంకరణ

అమ్మవారికి శ్రావణమాస ప్రత్యేక పూజలు

పంగులూరు: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పలు ఆలయాలలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలం లోని రామకూరు కొండపై కొలువు దీరిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాశీఅన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకస్వామి వెంకటేష్ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ గావించారు.





రామకూరు కొండపై అమ్మవారి అలంకరణ, శింగరకొండలో పూజలు చేస్తున్న మహిళలు

108 చీరలతో అలంకరణ

అద్దంకి : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో 108 చీరలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ పూటుకూరి రామకోటేశ్వరరావు, పూజారి స్వర్ణ వెంకటసుబ్బారావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని దామావారిపాలెం లో లక్ష్మీనరశింహ స్వామి దేవాలయంలో శుక్రవారం అభిషేకాలు, వరలక్ష్మీ వ్రతములు నిర్వహించారు. భవానిసెంటర్ లోని వేయిస్తంభాల గుడిలో కుంకుపూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా సినీనటుడు చిరంజీవి జన్మదినం

పర్చూరు, అగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మవిభూషణ్ గ్రహీత సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన, చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం పర్చూరు లో ఉత్సాహంగా పండుగ వాతావరణాన్ని తలపించే విధంగా నిర్వహించారు. ముందుగా బొమ్మల కూడలిలో చిరంజీవి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తులసి చంటి, దీర్ఘాల రమేష్‌నాయుడు, బోగాది మోహన్, బాలు, కఠారి సురేంద్రబాబు, కోటా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, టి.శ్రీనివాసరావు, కంచనపల్లి రమేష్, గోగుల శ్రీను, తులసి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

చిరంజీవి జన్మదినం సందర్భంగా అద్దంకి నాంచారమ్మ ఆలయంలో చెందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 100 మంది నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.





కడవకుదురు, పర్చూరులో కేకు కట్ చేస్తున్న చిరంజీవి అభిమానులు

చినగంజాం : మండలంలోని కడవకుదురు గ్రామంలో కేంద్ర మాజీమంత్రి, పద్మ విభూషణ్, మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కడవకుదురులోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కేకుకట్ చేసి నాయకులకు, అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరినాయుడు, నాయకులు పెదసింగ్ వెంకటేష్, గాంధీ, నామన వెంకటేష్, గొల్లపూడి మస్తాన్‌రావు, సత్యనారాయణ, కే.నాగేశ్వరరావు, గాజుల మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించాలి



మాట్లాడుతున్న కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

అద్దంకిటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించేలా అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మవరం రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో భూసారం పెంపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారానే ఎరువుల వినియోగించాలన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేయాలన్నారు. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నాలన్నారు. వరి, మొక్కజొన్న పంటలలో వచ్చే తెగుళ్ల, పురుగులు గురించి వివరించి, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, గ్రామ సర్పంచ్ చావాల కల్యాణి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు అశోక్, వీఏఏ శేషయ్య, రైతులు పాల్గొన్నారు.

26న మండల స్థాయి శిక్షణ కార్యక్రమం

అద్దంకిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశ మందిరంలో మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు ఏఎస్‌వో, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యాదర్శులు అందరు హాజరు కావాలన్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):సంతమాగులూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. సమావేశానికి గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొనాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఎంపీపీ బండారు అనూష సూచన

ఇంకొల్లు, ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని ఇంకొల్లు ఎంపీపీ బండారు అనూష సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల పనితీరును మెరుగుపరుచుకునే అంశంపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కిరణ్ సూచించారు. సమస్యలపై ప్రజలతో చర్చించి వాటిని పరిష్కరించే దిశగా కార్యదర్శులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ రాజ్‌శాఖ అధికారి ఆనంద్, పంచాయతీ సెక్రటరీలు రామసుబ్బారెడ్డి, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ప్రభుత్వ విధానాలను అనుసరించే మద్యం దుకాణాలు

చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల నిర్వహణలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీ విధానంతోనే నిర్వహణ సాగుతుందని చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో చీరాల ప్రముఖులు, రిసార్ట్స్ నిర్వాహకులు, మద్యందుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటికే జారీ అయిన నోటిఫికేషన్ విధివిధానాలను వివరించారు. లాటరీ పద్ధతిలోనే దుకాణాల కేటాయింపు జరుగుతుందని వివరించారు. ఆసక్తి కలిగినవారు పేర్లు నమోదు చేసుకోవాలని, వారికి అన్నివిధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నట్లు సీఐ తెలిపారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అద్దంకి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): శింగరకొండ శ్రీరామవృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేశారు. కొర్రపాటి కృష్ణచైతన్య, సాయిశ్రీ దంపతుల మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. వృద్ధుల ఆశ్రమం కమిటీ ఛైర్మన్ రావూరి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ

మార్టూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో ఇద్దరు యువకులు మార్టూరులో సాయిబాబా గుడిలో పూజారిగా సేవలను అందిస్తున్న కె.హరిబాబు సెల్‌ఫోన్‌ను చాకచక్యంగా కొట్టేసిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకొంది. మధ్యాహ్నం సమయంలో మార్టూరు సెంటరు నుంచి స్కూటీపై ఇంటికి వచ్చిన హరిబాబు ఇంటిలోకి వెళుతున్న సమయంలో ఒక యువకుడు ద్విచక్రవాహనంపై వచ్చి హరిబాబు ముందు బైక్ పైనుంచి పడిపోతున్నట్లుగా నటించాడు. దాంతో హరిబాబు అతనిని పైకి లేపుతుండగా, మరో యువకుడు అక్కడకు వచ్చి హరిబాబుకు సాయం చేశాడు. అనంతరం ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు వెళ్లిపోయారు. తర్వాత ఇంటిలోకి వెళ్లిన హరిబాబు కొంతసేపటికి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను ఇద్దరు యువకులు తెలివిగా కాజేసినట్లు గ్రహించాడు. గత మూడురోజుల క్రితం హరిబాబు ఇంటికి సమీపంలోని ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుని ఇంటిముందు ఇటువంటి ఘటనే జరిగింది.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన చిడిపూడి అంజమ్మ(80) శుక్రవారం మృతి చెందగా రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, వెంకాయమ్మ, వరలక్ష్మీలను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావుజెట్టి స్వామి, బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి అభినందించారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

మార్టూరు, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలోని పడమర ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో వస్రాం నాయక్ సందర్శించారు. అక్కడ రెండవ తరగతిలో కేవలం ఇద్దరు విద్యార్థులు ఉండటంతో, విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయురాలు రమాదేవికి సూచనలు చేశారు. అనంతరం తూర్పు ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, అక్కడ శిథిలావస్థలో ఉన్న గదిని పరిశీలించారు. ఈ గదిలో తరగతులను నిర్వహించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. తరువాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

బాలిక ఆపరేషన్‌కు ఎల్‌వోసీ మంజూరు



ఎల్‌వోసీని అందజేస్తున్న విజయ్‌కుమార్

మార్టూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న ఏడేళ్ల బాలిక వెర్ర బోయిన లలిత శ్రీకి ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరుచేయించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో బాలిక తండ్రి అశోక్‌కు రూ.8 లక్షలు మంజూరుకు చెందిన ఎల్‌ఓసీని మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్ కుమార్ చేతులమీదగా అందజేశారు. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన బొబ్బేపల్లి అంజమ్మకు రూ.70 వేలు ఎల్‌ఓసీని టీడీపీ నాయకుల చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పొగడదండ రవి, క్యాంపు కార్యాలయ ప్రతినిధులు వెంకట్, అఖిల్, సంపత్ పాల్గొన్నారు.

అవగాహనతోనే రోగ నియంత్రణ సాధ్యం

● మహిళా మండలిలో హెచ్ఐవీపై అవగాహన

చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీపై అవగాహనతోనే రోగ నియంత్రణ సాధ్యమని కౌన్సిలర్లు వెంకటస్వామి, యేసురాజు పేర్కొన్నారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో మహిళ మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా మెలగాలని సూచించారు. రోగం దోమకాటు, ఉమ్మి, మరుగు దొడ్ల వాడకం వల్ల, వస్తు మార్పిడి వంటి ద్వారా సోకదని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సరళ, సీయో సుకుమారి, విజయ్‌బాబు, సంధ్యారాణి, శ్రీగీత, దానమ్మ, జ్యోతి, దివ్యభాను, శిరీష పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంతో సమస్యలకు పరిష్కారం

● మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు

చీరాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజాప్రభుత్వంతో ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తోందని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 135 అర్జీలు రాగా, వాటిల్లో పెన్షన్ల కోసం 20, నివేశన స్థలాలు 110, ఇతర సమస్యలు 5 ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గంజి పురుషోత్తం, పద్మిని, ప్రసన్న ఉన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం


మార్టూరు, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుగారిపాలెంలో ఒంగోలులోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వారి సహకారంతో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ఆధ్వర్యంలో ఈ నెల 24 వతేదీ ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తాళ్లూరి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, పీఎఫ్‌టీ వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మందులు కూడా ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు.



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 23 ఆగస్టు 2025

లక్ష్మీ ప్రసీద.. ప్రసీద !

- ఆఖరి శ్రావణ శుక్రవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి, మూలస్థానేశ్వర, రంగనాథ స్వామి ఆలయాల్లో సామూహిక పూజలు చేశారు.

నూతన విధానంలో 'ఈ-క్రాప్'



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నూతన విధానంలో ఈ-క్రాప్ నమోదు జరుగుతోంది. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. రైతులు ఉన్నా లేకున్నా ఈ-క్రాప్ నమోదు చేస్తారు. గతంలో జరిగిన లోపాలను సరిచేసుకుంటూ సాగుతున్న ఈ పద్ధతిని డిజిటల్ ఈ-క్రాప్ అని కూడా పిలుస్తున్నారు. సాగు చేస్తున్న, సాగు చేయని భూములన్నింటినీ నమోదు చేయడమే ఈసారి ప్రత్యేకత.

- వివరాలు 8లో...

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నాయకులు

- ఉపాధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి, సంయుక్త కోశాధికారిగా సత్యనారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు చోటు లభించింది. ఆ పార్టీ సీనియర్ నేతలు పెట్టేటి సురేంద్రరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కందుకూరి సత్యనారాయణ రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాదశ నుంచే సురేంద్రరెడ్డి రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మూడు సార్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర సెల్స్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. మరోసారి ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్ష పదివి వరించింది. అలాగే మరో సీనియర్ నేత కందకూరి సత్యనారాయణ 1994లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర జాయింట్ కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

పట్టుకో.. పట్టుకో

- శ్రీకాంత్, అరుణ గ్యాంగ్‌ల కోసం పోలీసుల వేట
- సిద్ధం చేసుకున్న జాబితా ఆధారంగా జల్లెడ
- వరుస అరెస్ట్‌లకు రంగం సిద్ధం
- విషయం తెలిసి పొరుగు రాష్ట్రాలకు జంప్!
- అయినా, ముమ్మరంగా గాలింపు

కి'లేడి' నిడిగుంట అరుణ, రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ అనుచరులు ఎక్కడెక్కడ ఉన్నారు!? ఎంత మంది ఉన్నారు!? ఆ గ్యాంగ్ చేసిన అరాచకాలెంటి? వారి ఆగడాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయా!? బాధితులు ఉన్నారా!? ఇలా పోలీస్ యంత్రాంగం శోధిస్తోంది.


నెల్లూరు (క్రైం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో బెదిరింపులు, దాడులు, హత్యలు, బ్లాక్‌మెయిల్, దందాలు ఇలా అనేక నేరాలకు శ్రీకాంత్, అరుణలు పాల్పడ్డారు. అంతటితో ఆగక పోలీసు ఉన్నతాధికారులను వలలో వేసుకొని ఎవరినీ లెక్క చేయకుండా పేట్రేగిపోయారు. తాము చెప్పిన, సూచించిన వాటన్నిటికీ తలూపితే సరే లేకుంటే ప్రాణాలు తీసేంత స్థాయికి ఎదిగిపోయారు. అధికారులనూ లోబరుచుకుని తాము అనుకున్నదంతా చేశారు. అయితే, వీరిద్దరి ఆగడాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బ్రేక్ పడింది. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ రద్దు కావడం నుంచి నేర సామ్రాజ్యానికి బీటలు పడటం ఆరంభమైంది. ఆ తర్వాత అనూహ్యంగా అరుణ అరెస్ట్‌తో వారితోపాటు నడిచిన గ్యాంగ్‌ల గుండెల్లో దడ మొదలైంది.


● వివరాలు సేకరణ

రాష్ట్రవ్యాప్తంగా శ్రీకాంత్, అరుణల వ్యవహారం సంచలనంగా మారడంతో పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలో వారికి అండగా ఉన్న రౌడీగ్యాంగ్‌ల వివరాలను సేకరించడం ప్రారంభించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలతోపాటు శ్రీకాంత్, అరుణలతో చేతులు కలిపి నేరాలకు పాల్పడిన వారి జాబితాను సిద్ధం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ముందుగా గుర్తించిన రౌడీషీటర్లను ఎక్కడ కనిపిస్తే అక్కడ అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరులోని వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో ముగ్గురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శనివారం వారిని అరెస్ట్ చూపించే అవకాశం ఉంది. ఇలా పోలీసుల దూకుడు పెంచడంతో పలువురు రౌడీషీటర్లు జిల్లాను వీడి చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, గోవా వంటి ప్రాంతాలకు పరారైనట్లు సమాచారం. అలా వెళ్లిన వారి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

● రూ.21 లక్షలు మోసం చేశారు!

మరోవైపు అరుణ తనను మోసం చేసిందంటూ శుక్రవారం విజయవాడ నుంచి ఓ వ్యక్తి నెల్లూరుకు వచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆ వ్యక్తి ఫిర్యాదు ఇస్తుండగా తిరిగి నెల్లూరుకు పిలిపించారు. అసలేం జరిగిందో సమగ్రంగా విచారిస్తున్నారు. అరుణ తన వద్ద రూ.21 లక్షలు తీసుకొని మోసగించినట్లు విజయవాడవాసి వాపోయినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు ఆధారంగా అరుణపై మరో కేసు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది.





పెన్నమ్మ ఒడికి కృష్ణమ్మ

- సోమశిల జలాశయానికి జలకళ
- 55 టీఎంసీలు దాటిన నీటిమట్టం

అనంతసాగరం ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు నీటినిల్వ క్రమేణా పెరుగుతుండటంతో డ్యాం జలకళను సంతరించుకుంటోంది. ఈ ఏడాది జూలై 9 నుంచి కృష్ణా జలాల రాక మొదలవగా, అప్పటికే సోమశిలలో కేవలం 29 టీఎంలసీల నీరు మాత్రమే ఉంది. ఆ తర్వాత ప్రభుత్వం తీసుకొన్న చొరవతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు నీటి మోతాదును పెంచడం, పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు వరద పోటెత్తింది. ప్రస్తుతం 25,124 క్యూసెక్కుల నీరు వస్తుండగా జలాశయం నీటిమట్టం 55.038 టీఎంసీలకు చేరుకొంది. సుమారు 26 టీఎంసీల నీరు అదనంగా చేకూరాయి. ఇక కండలేరు జలాశయానికి రోజువారీగా 9,400 క్యూసెక్కులు వదులుతుండగా అక్కడకు 8,600 క్యూసెక్కులు చేరుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కృష్ణమ్మ కరుణతో కండలేరులోనూ నీటిమట్టం (ప్రస్తుతం 28.59 టీఎంసీలు ఉన్నాయి.) పెరుగుతుండగా తాగు, సాగునీటి ఇబ్బందులు తీరాయి. రానున్న ఖరీఫ్, రబీతోపాటు తాగునీటి అవసరాలు తీర్చేవిధంగా యంత్రాగం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇక రాబోవు రెండు మాసాల్లో భారీవర్షాలు కురిసే సూచనలు ఉండగా ఈలోపే సోమశిల, కండలేరు జలాశయాలు పూర్తిసామర్థ్యానికి చేరుకొనే అవకాశాలు ఉన్నాయి.

డ్యూటీచార్ట్‌లపై కోర్టుకెక్కిన కార్మికులు

- ఆర్టీసీ డీఎం, ఏడీఎంలకు నోటీసులు



కందుకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు ఆర్టీసీ డిపోలో డ్యూటీచార్ట్‌ల వ్యవహారంపై పలువురు కార్మికులు కోర్టు మెట్లు ఎక్కారు. వారు పటిషన్ దాఖలు చేయడంతో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని డీఎం, ఏడీఎంలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. డ్యూటీ చార్ట్‌లు వేయటంలో అధికారులు నిబంధనలు పాటించటం లేదని, దీంతో కొందరు కార్మికులపై పనిభారం పెరుగుతోం దంటూ కందుకూరు డిపోలో డ్రైవర్లుగా పని చేస్తున్న కూనం వెంకటరామిరెడ్డి, కొండా శ్రీనివాసరావు, దాసరి రమణయ్య, కొమ్మాలపాటి సుబ్బారావులు ఈ ఏడాది ఏప్రిల్ 4న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కార్మికుల అభిప్రాయాలు తీసుకోకుండా వేసిన డ్యూటీచార్ట్‌లను నిలుపుదల చేయాలని సూచిస్తూ ఏప్రిల్ 7న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఆ ఉత్తర్వులను డిపో అధికారులు బేఖాతరు చేయటంతో డిపో మేనేజరు రాఘూరి శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు మురళీబాబులు వ్యక్తిగతంగా కోర్టులో హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని డ్రైవర్ల తరఫు న్యాయవాది సీహెచ్ నాగేంద్రశర్మ తెలిపారు.

రిలయన్స్ భూముల్లో ప్రైవేటు సెజ్

రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం

రూ.1800 కోట్లతో పారిశ్రామికవాడ అభివృద్ధి ● 20 వేల మందికి ఉపాధి అవకాశం

నెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముత్తుకూరు మండలంలో ఉన్న కృష్ణపట్నం సెజ్‌లో రిలయన్స్‌కు కేటాయించిన 2600 ఎకరాల్లో ప్రైవేటు పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిసింది. రిలయన్స్ సంస్థ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పదం మేరకు ఇక్కడ భారీ పారిశ్రామికవాడ ఏర్పాటు కానుంది. చాలా ఏళ్ల క్రితం కృష్ణపట్నం పోర్టు సమీపంలో పరిశ్రమల అభివద్ధి కోసం రిలయన్స్ సంస్థకు 2600 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఆ సంస్థ భూములు స్వాధీనం చేసుకుందేగానీ పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టలేదు. ఈ భూములను పరిశ్రమల స్థాపన నిమిత్తం ఇతరులకు విక్రయించాలని నిర్ణయించుకుంది. ఈ దశలో ఆ భూములను వెనక్కు తీసుకోవాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, పరిశ్రమల స్థాపనకు సానుకూల పరిస్థితులు ఏర్పడటంతో రిలయన్స్ సంస్థ ఈ భూమిలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చింది. ఈ ఏడాది జనవరి నెలలో ఆ సంస్థ అధినేత అనిల్ అంబానీ ఈ భూములను సందర్శించారు. ఆ తరువాత ఇక్కడ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే తాజాగా ఆ ప్రతిపాదనను విరమించుకొని ప్రైవేటు పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని రిలయన్స్ సంస్థ నిర్ణయించుకుంది.

● రూ.1800 కోట్లతో..

ఈ భూముల్లో ప్రైవేటు సెజ్ ఏర్పాటుకు రిలయన్స్, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరిందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. ఆ ఒప్పందం ప్రకారం ఇది శ్రీసిటీ తరహాలో పూర్తిగా ప్రైవేటు పారిశ్రామిక వాడ అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇక్కడికి పరిశ్రమలను ఆకర్షించడానికి రూ.1800 కోట్లతో పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ఎకరాకు రూ.3లక్షలను ప్రోత్సాహకంగా మౌలిక వసతుల కల్పన కోసం ఖర్చు చేస్తారు. పరిశ్రమలకు భూముల కేటాయింపు, వాటి ధరలపై రిలయన్స్ సంస్థకు పూర్తి అధికారాలు ఉంటాయి.

● 20వేల మందికి ఉపాధి

ఈ ప్రైవేటు పారిశ్రామికవాడ ద్వారా రాబోయే పదేళ్లలో 20వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని రిలయన్స్ సంస్థ ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉన్న ఈ సెజ్ త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని, తక్కువ కాలంలోనే 20వేలకన్నా ఎక్కువ మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక వర్గాల అంచనా.



ఈ ఏడాది జనవరిలో రిలయన్స్ భూములను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఆ సంస్థ అధినేత అనిల్ అంబానీ

యూరియా అక్రమాల నిరోధానికి ప్రత్యేక స్క్వాడ్లు: డీఏవో

నెల్లూరు(వ్యవసాయం): జిల్లాలో యూరియా అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక అంతర్గత స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పీ సత్యవాణి ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్లు, గోదాములు, స్టాక్ పాయింట్లలో యూరియా సరఫరా, నిల్వలు, వినియోగం పై స్క్వాడ్లు సమగ్రంగా పరిశీలన జరుపుతాయని తెలిపారు. పరిశ్రమలకు అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడం, క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయి తనిఖీలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులకు ఎరువులను సకాలంలో అందించడమే ఈచర్యల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ఆహార పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై యూరియా ఇస్తుందని, జామాయిల్, సుబాబుల్ వంటి పంటలకు కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలని ఆమె సూచించారు.

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ

- దగదర్తిలో విమానాశ్రయం నిర్మాణానికి అడుగులు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర క్యాబినెట్
- 1379 ఎకరాలకు 814 ఎకరాల సేకరణ పూర్తి
- ఈ ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభమే తరువాయి



దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి 2019లో సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన పైలాన్

కావలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విమానాశ్రయం ఏర్పాటుపై జిల్లావాసుల కల నెరవేరబోతోంది. దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయం నిర్మాణానికి గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన ముసాయిదా ఆర్ఎఫ్‌పీని మంత్రివర్గం ఆమోదించింది. హడ్కో రుణంతో భూసేకరణ, యుటిలిటీల బదిలీ ప్రక్రియ పూర్తి చేయటం, ప్రతిపాదిత విమానశ్రయం కోసం మౌలిక సదుపాయాల కల్పన ప్రతిపాదనలకు మౌలికవసతులు, పెట్టుబడుల శాఖ ప్రతిపాదించగా మంత్రిమండలి ఆమోదించింది. ఇక మిగిలిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేస్తే పనులు ప్రారంభించడమే తరువాయి. వివిధ సమీకరణాల అనంతరం చివరకు విమానశ్రయ నిర్మాణానికి 1,379 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో 814 ఎకరాల సేకరణ పూర్తి చేసి విమానయాన అభివృద్ధి సంస్థకు అప్పగించారు. దీంతో 2019లో విమానశ్రయ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. అయితే ఆ ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావటంతో దామవరం విమానశ్రయాన్ని రద్దు చేసింది. దీంతో జిల్లా ప్రజల ఆశలు సన్నగిల్లాయి.

● కూటమి ప్రభుత్వంలో మరలా ఆశలు

2024లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ రావు టీడీపీకి చెందిన నేత కావడమేగాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కావటంతో దామవరం విమానశ్రయంపై జిల్లావాసుల్లో ఆశలు చిగురించాయి. గతంలో తానే శంకుస్థాపన చేసి ఉండటంతో చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విమానశ్రయాన్ని మరలా దామవరానికి మంజూరు చేయించారు. ఓ కేంద్ర బృందం కూడా దామవరానికి చేరుకుని అధ్యయనం చేసింది. త్వరగా భూసేకరణ పూర్తి చేసి తమకు అప్పగిస్తే వేగంగా పనులు పూర్తి చేస్తామని ఆ బృందం స్పష్టం చేసింది. అయితే, ఎందుకనో ప్రక్రియ ఆలస్యం అవుతూ వచ్చింది. తాజాగా రాష్ట్ర మంత్రి మండలి దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఆమోదం తెలపడంతో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తి చేసి త్వరలో విమానశ్రయ నిర్మాణపనులు ప్రారండమవుతాయనే నమ్మకం జిల్లావాసుల్లో నెలకొంది.



రిబ్బన్ కట్ చేసి పర్యాటక శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆ శాఖ ఆర్డీ రమణప్రసాద్, పక్కన కలెక్టర్ ఆనంద్, తదితరులు

పర్యాటక అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఆధునీకరించిన పర్యాటక శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యాలయం చాలా బాగుందని కితాబిచ్చారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో అన్నీ వసతులు కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలు, మ్యూజియంలు, బీచ్‌ల విశేషాలపై విస్తృత ప్రచారం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, తహసీల్దారు కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలోని మైపాడు బీచ్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఆ బీచ్ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు.

అనూహ్యంగా పెరిగిన పొగాకు ధర

- కిలో రూ.297 పలికిన రేటు
- నాణ్యమైన పొగాకు కోసం వ్యాపారుల పోటీ



కందుకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అధికారిక పొగాకు వేలం ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మార్కెట్లో డిమాండ్ నెలకొంది. నాణ్యమైన పొగాకు కోసం వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేస్తుండటంతో ధరపై విధించిన సీలింగ్ బ్రేక్ అయింది. వారం క్రితం వరకూ అత్యధిక ధరపై కిలోకు రూ.280 వద్ద సీలింగ్ పెట్టుకుని కొనుగోళ్లు చేసిన వ్యాపారులు సోమవారం నుంచి ఆ సీలింగ్‌ను బ్రేక్ చేశారు. తొలుత సీలింగ్ దాటి ఒక్క రూపాయి అదనంగా ధర పెట్టిన వ్యాపారులు రోజూ కొంత పెంచుకుంటూ శుక్రవారం రూ.297 ధర పెట్టి కొనుగోలు చేశారు. కందుకూరు-2 వేలం కేంద్రంలో ఈ ధర పలకగా, కందుకూరు-1 కేంద్రంలోనూ రూ.295 నమోదైంది. కోల్డ్‌స్టోరేజీలలో నిల్వచేసిన నాణ్యమైన పొగాకును ఇప్పుడిప్పుడే రైతులు బయటకు తీసి వేలం కేంద్రాలకు తెస్తుండగా ఆ పొగాకు కోసం వ్యాపారులు పోటీ పడుతుండటమే ఇందుకు కారణమని, రానున్న రోజుల్లో ఈ ధర ఇంకా పెరిగే అవకాశం ఉందని బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైన పొగాకుకు మార్కెట్లో రూ.320వరకు ధర పలికే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే లో గ్రేడ్, మీడియం గ్రేడ్‌లకు ధరలు పెరగకపోవటం, ఈ రకాలనే రైతులు ఎక్కువగా వేలం కేంద్రాలకు తెస్తుండటంతో శుక్రవారం కూడా నోబిడ్‌లు, సీఆర్‌లు అధికంగానే ఉన్నాయి. కందుకూరు-2లో శుక్రవారం 736 బేళ్లను వేలంకు తెప్పించగా 325 బేళ్లు మాత్రమే అమ్ముడుపోయాయి.

'మెట్ట'కు జ్వరమొచ్చింది!

- ఓ పక్క వర్షాలు.. మరోపక్క లోపించిన పారిశుధ్యం
- వైరల్ ఫీవర్‌తో ప్రజల అవస్థలు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రద్దీ

▪ 8 –



చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	103
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 525

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం కందుకూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పడమర బలిజపాలెంలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చి కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో శిగా శ్రీను, ఏకాంబరం విశ్వనాథం, శెట్టి కొండయ్య, గోకరాజు మాధవరావు, శ్రీను, మేకల నరసింగరావు, శ్రీరామ్, సాకిరి సాయిచందు తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి వీరాభిమాని బొమ్మల చిరంజీవి ఆధ్వర్యంలో పట్టణంలోని జనార్దనస్వామి కల్యాణ మండ పంలో ఫినిక్స్ ఈవెంట్స్‌తో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

అల్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఈనెల 27 నుంచి నిర్వహించే వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమలు ఏర్పాటు చేయాలంటే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావలి సీఐ పాపారావు ఆదేశాల మేరకు ప్రజలకు వినాయక చవితి ఏర్పాట్లపై కొన్ని నిబంధనలు పెట్టామని పేర్కొన్నారు. మండపాల కోసం పోలీసు, పంచాయతీ, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని రాత్రి 10 గంటల తరువాత మైక్ వినియోగించరాదని, ట్రాఫిక్ అంతరాయం, మద్యం సేవించి కార్యక్రమాల్లో పాల్గొనడం, నినాదాలు వంటివి చేయరాదని, మండలపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, నిమజ్జనానికి పోలీసులు ఇచ్చిన మార్గాలను అనుసరించాలని పేర్కొన్నారు. మట్టి విగ్రహాలు వినియోగించాలని, మతసామరస్యాన్ని పాటించాలని, అదేవిధంగా తమ శాఖ సూచించే నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ఈ నిబంధనలు పాటించకుంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

ఉలవపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని, వారి జీవితాలను సంక్షోభంలోకి నెట్టొదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆర్ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది దివ్యాంగులకు అనర్హత వేటు వేసి పింఛను తొలగించారని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులకు వెంటనే పింఛను పునరుద్ధరించాలని, లేని పక్షంలో వారి ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని పేర్కొన్నారు.

పోలీసు శాఖకు కంప్యూటర్ బహూకరణ

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్లు బీ.నరేంద్రబాబు శుక్రవారం పోలీసుశాఖకు కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ కంప్యూటర్‌ను రూరల్ ఎస్‌ఐ మహేంద్రనాయక్‌కు అందజేశారు. నెల్లూరులోని పోలీసుశిక్షణ కళాశాల (డీటీసీ)లో కానిస్టేబుళ్లకు నేరపరిశోధనలో అధునాతన టెక్నాలజీ వినియోగం, ఏఐ ఆధారిత నేరపరిశోధనపై నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం కోసం ఈ కంప్యూటర్‌ను అందజేస్తున్నట్లు విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు తెలిపారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ను విజయవంతం చేయాలి

కలిగిరి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మండలంలోని 23 పంచాయతీలలో శనివారం ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్థుల సహకారంతో తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కాలువలను శుభ్రం చేయడం, అంటువ్యాధుల నివారణ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు నిర్వహించడం తదితర కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

ఎవరి స్థలం ఎక్కడుందో ?


వలేటివారిపాలెం జగనన్న కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు

మండల కేంద్రమైన వలేటివారిపాలెం గ్రామంలో 186 కుటుంబాలకు ఊరికి దూరంగా పొలాల్లో ఇళ్ల పట్టాలను గత వైసీపీ ప్రభుత్వంలో అందజేశారు. పట్టాలైతే ఇచ్చారు ఇంటి నిర్మాణాల పనులు మాత్రం చేపట్టలేదు. నలుగురు లబ్దిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలకు పిల్లర్లు వేశారు. వీరికి బిల్లులు మంజూరు చయలేదు. తమ సెంటున్నర స్థలం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని లబ్దిదారులు వాపోతున్నారు. ఎప్పుడో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇప్పుడు పిచ్చి మొక్కలు మొలిచాయి. మట్టి రోడ్లతో పాటు లే అవుట్‌ల అభివృద్ధికి గతంలో లక్షల రూపాయల ఉపాధి నిధులు వెచ్చించారు. అవన్నీ వృథా అయ్యాయి. మళ్లీ లేఅవుట్‌లు అభివృద్ధి పనులు చేయాలంటే ప్రజాధనం రూ. లక్షల్లో వెచ్చించాల్సిన పరిస్థితి. ఇలా మండలంలో అనేక గ్రామాల్లో జగనన్న లేఅవుట్‌ల దుస్థితి ఇది.

- వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి)

అసంపూర్తిగా వాటర్ ట్యాంక్ నిర్మాణం



మండలకేంద్రమైన వలేటివారిపాలెం బీసీ హాస్టల్ ముందు పీహెచ్‌సీ భవనం వెనుకవైపున పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీలకు రాళ్లపాడు రోళ్లపాడు రక్షిత తాగునీరు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావ్యవస్థకు చేరడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశారు. దాని స్థానంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.30 లక్షల నిధులతో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నిధులు మంజూరు కాక వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. దీంతో ఎస్సీ బీసీ, ఎస్టీ కాలనీలకు రక్షిత తాగునీరు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన వాటర్‌ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి)



విద్యార్థుల క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలే లక్ష్యం

● కనుపర్తి మాల్యాద్రి, ఎంఈవో-1, లింగసముద్రం

లింగసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దడంతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని 38 ప్రాథమిక, 2 యూపీ, 4 ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీ, 1 ఏపీ మోడల్ స్కూల్, 1, ఏపీ గురుకుల పాఠశాల ఉన్నాయి. వీటిలో 1 నుంచి 10వ తరగతి వరకు 3,377 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ మండలంలో విద్యా వ్యవస్థ పనితీరు బాగుందని, ఇంకా ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దేందుకు కృషి చేస్తామని ఎంఈవో-1 కనుపర్తి మాల్యాద్రి తెలిపారు.

? మండలంలో విద్యా వ్యవస్థ పనితీరు ఎలా ఉంది.

! విద్యా వ్యవస్థ పనితీరు బాగుంది. ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దేందుకు కృషి చేస్తా.

? ఉపాధ్యాయుల కొరత ఉందా.

! మండలంలో 107 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఒక్క మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో ఒక గణితం ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది.

? ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా.

! ఉపాధ్యాయులు సమయపాలన కచ్చితంగా పాటిస్తున్నారు. ఒక నెలలో 3 సార్లు లేట్‌గా హాజరైతే ఒక సీఎల్ పడుతుంది.

? సీఆర్‌పీల పనితీరు ఎలా ఉంది.

! మండలంలో నలుగురు సీఆర్‌పీలు ఉండగా ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలిన ముగ్గురు బాగానే పని చేస్తున్నారు.

? మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతుందా.

! అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారు. ఎక్కడైనా మెనూ ప్రకారం భోజనం అందించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం.

తీరప్రాంత భద్రతపై సహకరించండి

● మత్స్యకారులకు అవగాహన


మాట్లాడుతున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

ఉలవపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతం భద్రతా విషయంలో మత్స్యకారులు సహకారం చెప్పుకోదగ్గ అంశమని రామాయాపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ జీ శివన్నారాయణ అన్నారు. మండలంలోని పెద్దపట్టపుపాలెంలో శుక్రవారం సామాజిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో మత్స్యకార గ్రామాల సహకారంతో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా మెరైన్ పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. సముద్ర మార్గానా దేశంలోకి ఉగ్రవాదులు, చొరబాటుదారులు, మాదక ద్రవ్యాల వంటి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా నివారించడానికి మత్స్యకారులు సహకారం అందించాలని సూచించారు. అంతేకాకుండా వేటకు వెళ్లేటప్పుడు లైఫ్ జాకెట్స్, లైఫ్‌బాయ్స్‌ని కచ్చితంగా తీసుకెళ్లాలన్నారు. వేట సమయంలో కొత్త బోట్లు, వ్యక్తులు కనిపించినా, ఆపద ఎదురైనా వెంటనే కోస్టల్ సెక్యూరిటీ టోల్ ఫ్రీ నెంబర్ 1093కి, కోస్టుగార్డ్ టోల్ ఫ్రీ నెంబరు 1554కి, రామాయపట్నం మెరైన్ స్టేషన్‌కు సమాచారం తెలియచేయాలన్నారు. బోట్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, బోటు పైభాగం పసుపు రంగు, కింద భాగం నీలిరంగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ ఈశ్వరయ్య, స్థానిక సర్పంచు జయరాం, ఫారెస్ట్ సెక్షన్ అధికారి బ్రహ్మనాయుడు, సచివాలయం సిబ్బంది కల్యాణరావు, మహేశ్వరరావు, రాజేష్, వంశీయాదవ్ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీవ్రతం


వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఉలవపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురష్కరించుకొని ఉలవపాడులో వెలసి యున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుధీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ వ్రతపూజలో పాల్గొన్న మహిళా భక్తులకు పూజా సామగ్రి అందచేశారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల రంగనాథాచార్యులు, చంద్రమౌళిశర్మలు వేద మంత్రాలతో లక్ష్మీదేవిరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకే తీర్థప్రసాదాలు అందచేశారు.

స్మార్ట్‌బ్రెయిన్ టెక్నాలజీస్‌కు విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్, స్మార్ట్‌బ్రెయిన్ టెక్నాలజీస్ సంస్థ హెచ్‌ఆర్‌లు

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌బ్రెయిన్ టెక్నాలజీస్ సంస్థ శుక్రవారం స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 17మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంది. సంస్థ హెచ్ఆర్ ప్రతినిధులు జీడీ, ఇంటర్వ్యూ పద్ధతిలో ఈ ఎంపికలు నిర్వహించారు. కాలేజీ కరస్పాండెంట్ కే.విజయ్‌శ్రీనివాస్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వడ్డి విక్రంరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, సహిత్య, సుమలత, భరద్వాజ్, మీరావలి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళమెత్తాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య

● మున్సిపల్ కార్మికుల 4వ మహాసభ

కావలి(టౌన్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు గళమెత్తాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక షాదీమంజిల్‌లో యూనియన్ 4వ మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెంచలనరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కార్మికుల తలరాత మారడంలేదన్నారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకపోగా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని చూడడం దుర్మార్గమన్నారు. ఇటీవల నెల్లూరులో కార్మికులను ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పెద్దఎత్తున పోరాటం చేసి విజయం సాధించారన్నారు. అదే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలు కొనసాగించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కే రహెనాబేగం మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ఇతర రంగాల కార్మికులు కూడా సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నప్పటికీ పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తురకా శీనయ్య, రాజ్యలక్ష్మి, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, ఎస్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎంపీపీ


సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్

లింగసముద్రం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణయ్య మాట్లాడుతూ మంచినీటి పథకాల ద్వారా తాగునీరు కలుషితమై వస్తోందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. తిమ్మారెడ్డిపాలెం గ్రేజింగ్ భూములను బయటి గ్రామాల వ్యక్తులు ఆక్రమించి జామాయిల్ సాగు చేస్తున్నారని ఎంపీటీసీ వెంకటేశ్వర్లు చెప్పారు. లింగసముద్రం పాత చెరువు కట్ట, తూములు, కాలువల మరమ్మతులకు గురయ్యాయని, వాటి బాగు చేయించాలని కోరారు. అయితే ఈ సమాశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు బదులుగా వారి బంధువులు హాజరై అధికారులను సమస్యలపై ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసులు వారిని వారించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఆర్ఐ రమణయ్య, నీటి పారుదల శాఖ ఏఈ మనోహర్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ప్రతిమల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

● డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పర్వదినం సందర్భంగా నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలకు అనుగుణంగా అన్నిరకాల జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సాయంత్రం ఆయన సబ్‌డివిజన్ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ విగ్రహాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత విగ్రహ కమిటీలదేనని తెలిపారు. విగ్రహాలవద్ద పెద్దపెద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు, రాజకీయ ప్రేరేపిత స్లోగన్లు నిషిద్ధమని, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతితో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు చేయకూడదన్నారు. ఏవైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినా రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విగ్రహకమిటీల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయటం ద్వారా ఎలాంటి రుసుము లేకుండా విగ్రహాలకు అనుమతులు పొందవచ్చునని తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో కూడా ఈ నిబంధనలన్నీ వర్తిస్తాయని, శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో భక్తితో నిమజ్జనోత్సవాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు అన్వర్‌బాషా, మంగా రావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే కుట్ర

● నల్లబ్యాడ్జీలతో చౌదరిపాలెం వాసుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్థులు

కావలిరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ఆయనను హతమార్చేందుకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుట్రపన్నడం దారుణమని చౌదరిపాలెం టీడీపీ నాయకుడు గోరంట్ల రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చౌదరిపాలెంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కావలి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అశాంతి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండవ శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, పోకూరు రాంబాబు, మండువ సుబ్బారావు, శేషమ్మ, యామన హారిక, గొంది అంజమ్మ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 'జనసురక్ష'


జన సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ అధికారులు

కావలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విశ్వోదయ బాలికల ఉన్నతపాఠశాల ప్రాంగణంలో జనసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ తిరుపతి డిప్యూటీ జనరల్ మేనేజరు దినేష్ గులాటి, నెల్లూరు రీజనల్ మేనేజరు మురళీనాయక్, నెల్లూరు మేనేజరు మల్లికార్జున్, కావలి బ్రాంచి మేనేజరు రమేష్ పాల్గొని జనసురక్ష పథకం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకాలు కలిగి ఉంటే ఏదైనా ప్రమాదాలు జరిగినపుడు ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు అందజేస్తారన్నారు. అలాగే జనధన్ ఖాతాలు తెరచి 10 ఏళ్లు పూర్తైన వారు ఈకేవైసీ చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు లోక్‌నాథం, మెప్మా సీఎం భారతి, వెలుగు ఏపీఎం కృష్ణారావు, పెన్షనర్స్ అసోసియే షన్ సెక్రటరీ కే.హరినారపరెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీమాధవి పాల్గొన్నారు.

68వ సారి 'కండ్లగుంట' రక్తదానం


కండ్లగుంటను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, హరినారపరెడ్డి

కావలి(టౌన్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు శుక్రవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో 68వ సారి రక్తదానం చేశారు. ఆయనను రెడ్‌క్రాస్ కావలి ఛైర్మన్ రవిప్రకాష్, రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ రమ్య, పాలకమండలి సభ్యులు హరినారపరెడ్డి, ప్రణీత్ తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. మధుబాబునాయుడు విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచి రక్తదానం పట్ల చైతన్యం కలిగి ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తూ కావలి రెడ్‌క్రాస్ కేంద్రంలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన రక్తదాతగా గుర్తింపు పొందారన్నారు. ఆయన యువతకు మర్గదర్శకుడిగా, బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని అభినందించారు. మధుబాబునాయుడు మాట్లాడుతూ రక్తదానం చేయడం సేవగా కాకుండా బాధ్యతగా భావించాలని, మన రక్తదానం మరొకరి ప్రాణం కాపాడిందంటే ప్రాణం పోసినట్లేనన్నారు. యువత సామాజిక స్పృహ కలిగి బాధ్యతగా మెలిగినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమన్నారు. అనంతరం ముధుబాబునాయుడు తలసేమియా డీకేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకుంటున్న చిన్నారులను పరామర్శించారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యూనెక్స్-సన్‌రైస్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని నారాయణ విద్యా సంస్థల జీఎం, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో సమానంగా క్రీడల్లో కూడా రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర సబ్ జూనియర్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 238 మంది క్రీడాకారులు హాజరయ్యారని, మూడు రోజులు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలి

● కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం


ప్రతాప్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నిరసనకారులు

జలదంకి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకర కృష్ణారెడ్డిని హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని 9వ మైలులో పార్టీ శ్రేణులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రోడ్డుపై బైఠాయించారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను మహిళలు చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణక్రాక పంచాయతీ టీడీపీ నాయకులు చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, దగుమాటి శ్రీనివాసులరెడ్డి, వేలమూరి రామ్మోహన్‌రెడ్డి, సొంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అశ్వారూఢుడై దర్శనమిచ్చిన వెంకయ్యస్వామి

వెంకటాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా వెంకయ్య స్వామి అశ్వారూఢుడై శుక్రవారం ఉదయం గొలగమూడి గ్రామంలో విహరించారు. నిత్య పూజలతోపాటు ఉదయం 10 గంటలకు అశ్వవాహనసేవ ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. స్వామి అశ్వవాహనాన్ని అధిరోహించి, వామన హస్తంతో కళ్లాలను చేతబట్టి.. 'మనిషి కోరికలనే గుర్రాలకు కళ్లెం వేయాలి' అని భక్తులకు హితబోధ చేస్తున్నట్లుగా దర్శనమిచ్చారు. 'నేనుండగా మీకు చింత ఏల' అన్నట్లుగా దక్షిణ హస్తం పైకెత్తి భక్తులను ఆశీర్వదిస్తూ చిరుదరహాసంతో వీధుల్లో ఊరేగారు. రాత్రికి అవధూత వెంకయ్యస్వామి పెదశేషవాహనంపై కొలువుదీరారు. వివిధ రకాల పుష్పాలంకరణతో స్వామిని పెదశేష వాహనంపై కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర నీరాజనాలు అందించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలచే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించాయి.

నేడు సింహ, గరుడ వాహన సేవలు

ఉత్సవాలలో భాగంగా స్వామికి శనివారం ఉదయం సింహవాహన సేవ, రాత్రికి గరుడ వాహనసేవ జరుగుతాయని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహిస్తామన్నారు.

సోమేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



కందుకూరు పట్టణంలోని స్కంధపురి సోమేశ్వరాలయంలోని మూల విరాట్‌ను శుక్రవారం సూర్యకిరణాలు తాకాయి. శ్రావణమాసం మాస శివరాత్రి సందర్భంగా భానుడు సోమే శ్వరుడిపై ప్రసరించటంతో ఆలయ పూజారులు, భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ప్రతి ఏటా మాసశివరాత్రి నాడు సోమేశ్వరుడిని సూర్య కిరణాలు తాకుతాయని, మూడురోజులపాటు ఈ అనుభూతి భక్తులు పొందవచ్చని పూజారులు తెలిపారు. కాగా శుక్రవారం భక్తులు పెద్దసంఖ్యలో సోమేశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

- కందుకూరు (ఆంధ్రజ్యోతి)



వైభవంగా శ్రీకృష్ణ నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు నగరంలో శుక్రవారం శ్రీకృష్ణుని నగరోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక డైకస్‌రోడ్డులో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించి ఆరు రోజులు పూజించారు. ఆ ఉత్సవాల ముగింపు సందర్భంగా నగరోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతా జ్ఞాన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఇక పక్కాగా సాగు భూమి

నూతన విధానంలో ఈ-క్రాప్
రైతులు లేకున్నా నమోదు ప్రక్రియ

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పొలంలో ఒక పంట సాగవుతుంటే మరో పంటను సాగుచేస్తున్నట్లు పంట నమోదు చేసేవారు. పొలాలు ఖాళీగా ఉన్నా ఏదో ఒక పంట సాగవుతున్నట్లు చూపించే అవకాశం ఉండేది. అంతేగాక చెరువులు, చివరికి పోరంబోకు స్థలాల్లో కూడా వివిధ రకాల పంటలు సాగవుతున్నట్లు ఈ-క్రాప్‌లో చూపించి అవినీతి జరిగే అవకాశం ఉండేది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఎంత మేర ఉన్నాయనే సమాచారం సరిగా ఉండది కాదు. దీంతో అనేక అక్రమాలకు తెరలేపేందుకు అవకాశం ఉండేది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం చెకొపెదుతూ సరికొత్త విధానంలో ఈ-క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టింది. ఈ-క్రాప్ నమోదుకు గతంలో రైతుల ఈకేవైసీ తీసుకునేవారు. రైతులు అందుబాటులో లేకపోతే వారి వివరాలు నమోదయ్యే అవకాశం ఉండేది కాదు. ప్రస్తుత విధానంలో రైతులు లేకున్నా ఈ-క్రాప్ నమోదు చేస్తారు. ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా పారదర్శకంగా చేసేందుకు రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేస్తారు.

● ఈసారి ఇలా...

ఈ-క్రాప్ నమోదుకు గతంలో 100మీటర్ల పరిధిలో ఫొటోలు తీస్తే సరిపోయేది. అయితే ఇందులో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈసారి ప్రతి 20 మీటర్ల పరిధిలో ఫొటోలు తీసి పంట నమోదు చేయాల్సిందే. లేదంటే యాప్ అంగీకరించదు. అయితే క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న ఇబ్బందుల దృష్ట్యా 50మీటర్లకు ఇటీవల అనుమతులు వచ్చాయి. ఈయాప్‌లో పంటల సాగుకు ఉపయోగకరమైన భూముల వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయానికి అనువుకాని భూములను గతంలో నమోదు చేసి ఉంటే వాటిని తొలగిస్తారు. ప్రతి సర్వే నెంబరు ఫొటో తీయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఉద్యాన పంటలనూ తప్పనిసరిగా చేయాల్సిందే. ఖాళీ పొలాలను నమోదు చేసి పంట లేదని నమోదు చేయాలి. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది నమోదు చేసిన తరువాత వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలిస్తారు. అభ్యంతరాలు ఉన్న భూములు ఏమైనా ఉంటే జిల్లా ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుంటారు. కౌలు రైతులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి భూ యజమానితోపాటు కౌలు రైతుల వివరాలు కూడా నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో పంటలు దెబ్బతింటే ప్రభుత్వం అందించే బీమా పొందాలంటే ఈ-క్రాప్ నమోదు కీలకం. కాబట్టి భూయజమానికి అదేవిధంగా పొలం కౌలుకిస్తే కౌలు రైతులకు బీమా అందుతుంది.



దొంతాలి గ్రామంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న నెల్లూరు మండల వ్యవసాయాధికారి నాగమోహన్

ప్రతి సర్వే నెంబరు నమోదు చేయాలి



ఈ-క్రాప్ నమోదు గతంలో రైతులు వచ్చి నమోదు చేసుకోవాలి. నూతన విధానంలో ప్రతి సర్వే నెంబరులో పంటను డిజిటల్ సర్వేలో నమోదు చేయాలి. పంటలు సాగు చేసినా, చేయకపోయినా నమోదు చేయాలి. కౌలు రైతులు సాగు చేసుకుంటున్న భూములకు కూడా భూయజమాని, కౌలు రైతుల వివరాలు సర్వేలో నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో భూయజమానికి బీమా వర్తిస్తుంది. కౌలుకు ఇచ్చిఉంటే కౌలు రైతుకు దక్కుతుంది. జిల్లాలో 2,64,071 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగవుతుండగా దాదాపు 1,02,673 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేయడం జరిగింది. ఇందులో 1,33,522 ఎకరాల్లో వరి సాగవుతుండగా దాదాపు 68496 ఎకరాల్లో నమోదు చేయడం జరిగింది. వీలైనంత త్వరగా ఈ-క్రాప్ నమోదు పూర్తిచేస్తాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

విజృంభిస్తున్న వ్యాధులు

కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు



ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఉదయగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతంలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ప్రతిఒక్కరూ జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు క్యూకడుతున్నారు. వైరల్ జ్వరాలతోపాటు పలువురికి రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో రక్తకణాలు తగ్గి ఇతర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, ఒక్కసారిగా మారిన వాతావరణంతో పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం, అధికారులు తూతూ మంత్రంగా పారిశుధ్యం చర్యలు చేపట్టడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

వైద్యశాలలకు పరుగులు

ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు తదితర పట్టణాలు, గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి గత వారం రోజులుగా రోజుకు 200 నుంచి 250 మంది రోగులు వస్తుండగా అందులో 70 నుంచి 80 మంది జ్వరపీడితులేనని, కొంతమంది వాంతులు, విరోచనాలతో బాధపడుతూ వస్తున్నారని వైద్యులు తెలుపుతున్నారు. రోగుల తాకిడి అధికంగా ఉండడం, వైద్యుల కొరత ఉండడంతో బాధితులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అలాగే స్థానికంగా ఉండే ప్రైవేటు వైద్యశాలలకు సైతం జ్వరపీడితులు అధికంగా వస్తున్నారని వైద్యులు తెలుపుతున్నారు. ఇటీవల ఉదయగిరి పట్టణంలోని ఓ చిన్నారికి రోజుల తరబడి జ్వరం తగ్గక రక్తకణాలు తగ్గి చెన్నైలో చికిత్స పొంది వచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరం స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతోపాటు జ్వరాల నివారణకు వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరి పట్టణంలో ప్రధాన రహదారికి పక్కనే అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

తూతూమంత్రంగా పారిశుధ్య పనులు

వైరల్ జ్వరాలే ఎక్కువ

సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 70 నుంచి 80 మంది జ్వరపీడితులే వస్తున్నారు. కొంతమంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వస్తున్నారు. వారందరికీ వైద్యసేవలందిస్తున్నాం. వైరల్ జ్వరాలతో అధికంగా బాధపడుతున్నారు.

- రాగూర్, సీహెచ్‌సీ వైద్యుడు

నేడు, రేపు రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శని, ఆదివారాల్లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బీ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా జట్లు పాల్గొంటున్నాయని, వీరికి తగిన వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు.

క్షయ బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేయండి

● ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీల్లో ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆసుపత్రులకు క్షయ వ్యాధిగ్రస్తులు వస్తే వారిని ప్రభుత్వ క్షయ ఆసుపత్రికి సిఫార్సు చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. శుక్రవారం నెల్లూరులోని వైష్ణవి, సాయిపథం, మధుసూదన్‌శాస్త్రి ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందని తెలిపారు. అంతేకాకుండా పౌష్టికాహార నిమిత్తం రూ.6 వేలు వారి ఖాతాలో జమచేస్తుందని చెప్పారు. ఇంటెన్సిఫైడ్ టీబీ విముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద ప్రైవేట్ ప్రాక్టీషనర్లు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్, ప్రైవేట్ హాస్పిటల్స్ కో ఆర్డినేటర్ హరీష్, భవ్య, తులసీరామ్, సరిత, అనూరాధ పాల్గొన్నారు.



ఓ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి ఖాదర్‌వలి

29 నుంచి తెలుగు భాషోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై ఈనెల 29 నుంచి 31వతేదీ వరకు అవగాహన సదస్సులు జరుగుతాయని నిర్వాహకులు కంచర్ల సుబ్బానాయుడు, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, పెరుగు రామకృష్ణ తెలిపారు. నెల్లూరులోని టౌన్ హాలులో జరిగే సదస్సులకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. భాషోత్సవాలను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో ప్రముఖ భాషాకోవిదులు, విమర్శకులు, కళాకారులు పాల్గొంటారని, జిల్లా ప్రజలు తరలిరావాలని కోరారు.



తెలుగు భాషోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభం

రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 26 వరకు గడువు

పొదలకూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. గతంలో ఆన్‌లైన్‌లోపాటు ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటించినా ప్రస్తుతం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 26 వరకు గడువు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ ఫీజు ఓసీ విద్యార్థులకు రూ.400, బీసీలకు రూ.300. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.200గా నిర్ణయించారు. సెప్టెంబరు 1నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. నచ్చిన కళాశాల, కోర్సుల్లో సీటు కావాలంటే విద్యార్థులు సాధ్యమైనంత ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలి.

● ఇవి తప్పనిసరి

పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా, ఇంటర్ టీసీ, ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు.

● రిజిస్ట్రేషన్లకు గడువు

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ వెరిఫికేషన్ (స్పోర్ట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, పీహెచ్‌సీ), 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు, ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉంది. 29న సీట్ల కేటాయింపు, 31వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయి.

బంగారు, వజ్రాల నగలు, నగదు చోరీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి లోపలికి ప్రవేశించి బంగారు నగలు, నగదు, వజ్రాల హారాన్ని గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ చోరీ శుక్రవారం తెల్లవారుజామున నెల్లూరులోని లేక్‌వ్యూ కాలనీలో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు.... వెదురు బొంగుల వ్యాపారం చేసే వెంకటేశ్వర్లు కుటుంబం లేక్‌వ్యూ కాలనీలో నివసిస్తోంది. ఆయన భార్య కొద్దిరోజుల కిందట హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఈ నెల 21వ తేదీ వెంకటేశ్వర్లు వ్యాపార నిమిత్తం ఆత్మకూరుకు వెళ్లారు. రాత్రి ఇంటికి రాలేదు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున ఆ ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులోని సుమారు ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్, కొంత నగదు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన వెంకటేశ్వర్లు తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులను దోచుకెళ్లారని గుర్తించారు. వెంటనే దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

సంగం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షూటింగ్ బాల్ జిల్లాస్థాయి టీమ్ ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈపోటీలను స్థానిక జడ్పీ హెచ్ఎం బుజ్జయ్య ప్రారంభించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా టీమ్‌కు ఎంపికచేసి బుచ్చిరెడ్డిపాళెంలో శిక్షణ ఇవ్వనున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణయ్య తెలిపారు. సెప్టెంబరు 13, 14 తేదీల్లో బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.



జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం బుజ్జయ్య

వీఎస్‌యూకి ఇది గొప్ప అవకాశం

● వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : చెన్నై నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో వీఎస్‌యూ మెరైన్ బయాలజీ విభాగం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం వీఎస్‌యూకి ఒక గొప్ప అవకాశమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. వీఎస్‌యూలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఒప్పందం వివరాలను వెల్లడించారు. మెరైన్ బయాలజీ విభాగానికి రూ.4.12 కోట్ల నిధులు ఈ ఒప్పందం ద్వారా మంజూరయ్యాయన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫెలోషిప్ సౌకర్యం ఉంటుందన్నారు. లాబరేటరీ సామగ్రి కోసం రూ. 2.12 కోట్ల నిధులు కేటాయించామన్నారు. మరిన్ని సదుపాయాలు కూడా కల్పించినట్లు తెలిపారు. మెరైన్ బయాలజీలో పీజీ చేసే అవకాశం రాష్ట్రంలో వీఎస్‌యూలో మాత్రమే ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, ఎస్ సాయిప్రసాద్‌రెడ్డి, చాముండేశ్వరి, డాక్టర్ జీ సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాన్ని చూపుతున్న వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

రైల్వే పనుల్లోనూ నాణ్యతకు తిలోదకాలు!

పైన పటారం.. లోన లొటారం
వేస్టేజీ మట్టిపై కాంక్రీట్ ప్లాట్‌ఫారం నిర్మాణం

రైల్వే స్టేషన్ ఆవరణలో ప్లాట్ ఫారం వేసేందుకు తోలిన వేస్టేజీ మట్టి



కావలి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : రైల్వే నిర్మాణ పనులు అంటే ఒకప్పుడు నాణ్యతకు పెట్టింది పేరు. కానీ రాను రాను రైల్వే పనుల్లో కూడా లోకల్ కాంట్రాక్టర్లు చేరి నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నా అధికారులు మౌనంగా ఉంటున్నారు. కావలి రైల్వే స్టేషన్‌ను నూతనంగా నిర్మించిన తర్వాత దాని ముందు భాగంలో గతంలో రెండు భాగాలు పైగా సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్‌ఫారం పూర్తి చేసి ఒక భాగం వదిలేశారు. రైల్వే స్టేషన్ ప్రధాన ముఖద్వారం నుంచి దక్షిణం వైపున ఉన్న స్థలంలో ప్లాట్‌ఫారం లేక వర్షాకాలం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పైగా రైల్వేశాఖకు సంబంధించిన కార్యాలయాలన్నీ దక్షిణం వైపునే ఉండడంతో స్టేషన్‌లో నుంచి కార్యాలయాల్లోకి రావడానికి ఇబ్బందులు పడేవారు. దీంతో దక్షిణం వైపున కూడా ప్లాట్‌ఫారం వేసేందుకు రైల్వే అధికారులు నిధులు మంజూరు చేయడంతో వాటికి పనులు చేపట్టారు. అయితే దక్షిణం వైపున ఉన్న ప్రాంతం లోతట్టుగా ఉండటంతో అక్కడ ముందు మంచి గ్రావెల్ లేదా క్వారీ డస్ట్‌తో ఎత్తు చేసి దానికి క్యూరింగ్ చేసి పటిష్టం చేసిన తర్వాత దానిపైన సిమెంట్ కాంక్రీట్ చేయాల్సి ఉంది. వాస్తవంగా లూజ్ మట్టి ఉన్నా దానిని తొలగించి మంచి మట్టి తోలి పనులు చేస్తారు. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్‌ఫారం వేయడానికి లోతట్టు ప్రాంతంలో ఎక్కడ నుంచో పనికి రాని చెత్తా చెదారంతో కూడిన వేస్టేజీ మట్టిని తోలారు. దానిని నీటితో తడిపి రోలింగ్ చేయకుండానే దానిపై 40 ఎంఎం కంకరతో తొలివిడత కాంక్రీట్ వేశారు. ఈ కాంక్రీట్ కూడా క్యూరింగ్ చేయకుండానే 20 ఎంఎం కంకరతో ఫైనల్ కాంకీంట్ వేసేందుకు సిద్ధం చేశారు. నాణ్యత లేకుండా వేస్తున్న ఈ ప్లాట్‌ఫారంకు ఎలా ఎన్నిక వస్తుందని ప్రయాణికుల, రైల్వే ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి ఫైనల్ కాంక్రీట్ అయినా నాణ్యతగా వేసి క్యూరింగ్ చేసేట్లు చూడాల్సి ఉంది.



వేస్టేజీ మట్టిపైనే ఫ్లాట్‌ఫారం కోసం 40 ఎంఎం కంకరతో వేసిన కాంక్రీట్